'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 346

శనివారం 7-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కరోనా.. టెర్రర్!

11 వేల పాయింట్ల దిగువకు నిఫ్టీ. సెన్సెక్స్ 894 పాయింట్లు డౌన్ -బిజినెస్‌లో

YES BANK SBI

'యస్'బీఐ

యస్ బ్యాంకులో వాటాల కొనుగోలుకు ఎస్‌బీఐ ఆసక్తి -బిజినెస్‌లో

● బాధ్యతల స్వీకరణ..

సీఐసీగా బిమల్ జుల్కా

సమాచార కమిషనర్‌గా ఉన్న బిమల్ జుల్కా శుక్రవారం సీఐసీగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జుల్కా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సమాచార కమిషనర్‌గా అమిత పండోవే బాధ్యతలు స్వీకరించారు.

- 5లో

● పెరుగుతున్న కోవిడ్ కేసులు

లక్షకు చేరువలో..

కోవిడ్ వైరస్ కేసుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా కేసుల సంఖ్య ఇంచుమించుగా లక్షకు చేరుకుంది. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు కోవిడ్ కట్టడికి మరిన్ని పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది.

- 5లో

● విపక్షాల నిరసనలు..

ఐదో రోజూ అడ్డుకున్నారు

పార్లమెంట్ ఉభయసభల కార్యకలాపాలను విపక్షాలు ఐదో రోజూ అడ్డుకున్నాయి. ఢిల్లీ అల్లర్లపై లోక్‌సభ నుంచి కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయడంపై శుక్రవారం విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. పలు వాయిదాల అనంతరం లోక్‌సభ, ప్రారంభమైన పావుగంటకే రాజ్యసభ మార్చి 11కి వాయిదా పడ్డాయి.

- 5లో

● వెండితెర వెనుక

స్త్రీ మహాలక్ష్మి..

రేపు మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా మగవాళ్ల రాజ్యంలో 'స్త్రీ మహాలక్ష్మి'గా వెలిగిన.. వెలుగుతున్న.. సినీ మహిళా నిర్మాతలు కృష్ణవేణి, ఆమె కూతురు అనురాధ, స్వప్నాదత్, ప్రియాంకాదత్, లక్ష్మీ మంచులతో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలు.

- ఫ్యామిలీలో

రాష్ట్ర సీఈవోగా శశాంక్ గోయల్

నోటిఫికేషన్ జారీ చేసిన సీఈసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)గా శశాంక్ గోయల్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన ప్రస్తుతం కార్మిక, ఉపాధి కల్పన, కర్మాగారాల శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతంలో ఆయన సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా, ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేశారు. అంతకుముందు కొంత కాలం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పనిచేశారు. విద్యా శాఖ డైరెక్టర్‌గా, నిజామాబాద్, గుంటూరు జిల్లాల కలెక్టర్‌గా కూడా వ్యవహరించారు. గతంలో సీఈవోగా పనిచేసిన రజత్‌కుమార్‌ను ప్రభుత్వం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో ఆయన స్థానంలో తాజాగా సీఈసీ శశాంక్ గోయల్‌ను నియమించింది. 2018 మేలో టర్కీకి విహార యాత్రకు వెళ్లిన శశాంక్ గోయల్ కుమారుడు శుభం గోయల్‌ను ఇస్తాంబుల్‌లో దోపిడీ దొంగలు కాల్చి చంపారు.

మళ్లీ న్యాయ హక్కులు ఇవ్వండి

నిర్భయ కేసు దోషుల్లో ఒకడైన ముఖేష్ సింగ్ మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. న్యాయవాదులు తప్పుదోవ పట్టించిన కారణంగా న్యాయపరంగా తనకు ఉన్న హక్కులు అన్నింటినీ మళ్లీ దఖలుపరచాలని కోరుతూ ఓ పిటిషన్ వేశాడు. - 5లో

నా తెలంగాణ ప్రగతికి చిరునామా

దేశమంతా అబ్బురపడేలా అభివృద్ధి కార్యక్రమాలు

దుర్భర స్థితి నుంచి సర్వతోముఖాభివృద్ధి వైపు పయనం

ప్రజావిశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పునర్నిర్మాణ యజ్ఞం

ప్రజావసరాలే ప్రాతిపదికగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

త్వరలోనే 57 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్లు

రాష్ట్రంలో సరికొత్తగా భూపరిపాలన విధానం

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: ఆరు దశాబ్దాలపాటు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అవసరాలే ప్రాతిపదికగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు.

వణక్కం.. నమస్కారం

రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యాక మొదటిసారిగా ఉభయసభలకు హాజరైన తమిళిసై.. తమిళంలో వణక్కం అని, తెలుగులో నమస్కారం అని సభ్యులకు అభివాదం చేసి ఆ తరువాత ఆంగ్లంలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్రాన్ని సాధించుకున్న అనతికాలంలోనే అనేక రంగాల్లో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి పరిస్థితులతో పోల్చుకుంటే తక్కువ వ్యవధిలో సాధించిన ప్రగతిని చూసి దేశమంతా అబ్బురపడటం గర్వకారణమన్నారు. 2014 జూన్ 2 నాటికి ముందున్న దుర్భర పరిస్థితులను దూరం చేసుకుంటూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి వైపు పయనిస్తోందన్నారు. ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సారథ్యంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతౌల్యత పాటిస్తూ ముందుకు సాగుతోందన్నారు.

రాష్ట్రంలోని వనరులు, వసతులు, అవసరాలు, అనుకూలతలు, ప్రతికూలతలు, బలాలు, బలహీనతలన్నింటినీ అంచనా వేసుకొని స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలవంటి మూడంచెల ప్రణాళికలను రూపొందించుకొని రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. అందుకే సందర్భం వచ్చిన ప్రతిసారీ కేసీఆర్ ప్రభుత్వాన్ని, పాలనను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు

మిగతా 2వ పేజీలో ▶

నేడు కేబినెట్ భేటీ

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర మంత్రివర్గం శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రగతి భవన్‌లో సమావేశమై 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించనుంది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శాసనసభలో ప్రవేశపెట్టే తీర్మానం ప్రతిపై శనివారం జరగనున్న మంత్రివర్గ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) నిర్వహణపైనా శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేసీఆర్ కీలక ప్రకటన చేసే అవకాశముంది. ఎన్పీఆర్ విషయంలో ప్రభుత్వ వైఖరిపై చేసే ప్రకటన గురించి కూడా కేబినెట్ భేటీలో చర్చించే అవకాశముందని తెలిసింది. కొత్త రెవెన్యూ చట్టాన్ని ఈ సమావేశాల్లోనే తీసుకొస్తామని సీఎం ఇప్పటికే ప్రకటన చేశారు. ముసాయిదా రెవెన్యూ చట్టానికి తుదిరూపునిచ్చి శాసనసభలో ప్రవేశపెట్టేందుకు ఉన్న అవకాశాలను సైతం కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి.

20 వరకు అసెంబ్లీ

- 12 రోజులు అసెంబ్లీ, 8 రోజులు మండలి భేటీ
- బీఏసీలో నిర్ణయం

-వివరాలు 2లో

కోవిడ్ వైరస్‌పై 'ర్యాపిడ్ రెస్పాన్స్'

- ప్రతి జిల్లాలోనూ బృందాలను ఏర్పాటు చేసిన సర్కారు.. వేలిముద్రల బయోమెట్రిక్ హాజరు నిలిపివేతకు ఆదేశం
- ఒక్క రోజులోనే '104' హెల్ప్‌లైన్‌కు 210 ఫోన్ కాల్స్
- నా ఆరోగ్యం మరింత మెరుగవుతోంది: కోవిడ్ బాధితుడు

సాక్షి, హైదరాబాద్

కోవిడ్ వైరస్‌పై సర్కారు యుద్ధం ప్రకటించింది. అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేయాలని శుక్రవారం నిర్ణయించింది. రాష్ట్రస్థాయి రెస్పాన్స్ టీమ్స్‌తో పాటు ప్రతి జిల్లాలోనూ ఈ టీంలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా కోవిడ్ పాజిటివ్ కేసుల కాంటాక్టులను గుర్తించడం కోసం 15 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటైంది. అలాగే ప్రతి జిల్లాలోనూ 15 మంది చొప్పున ఈ టీంలు పనిచేస్తాయి. ఒకవేళ ఏదైనా పాజిటివ్ కేసు నమోదైతే ఆ కేసుకు సంబంధించి గుర్తించాల్సిన బాధ్యత వారిదే. పాజిటివ్ కేసు నమోదైన ప్రాంతంలో 3 కి.మీ. మేరకు మ్యాపింగ్ చేస్తారు. అక్కడంతా యాక్టివ్ నిఘా ఏర్పాటు చేస్తారు. అంటే పారిశుద్ధ్యంతో పాటు క్లోజ్డ్ కాంటాక్టులను గుర్తించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, ఎప్పటికప్పుడు ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని పనిచేస్తారు.

గుంపుల్లో ఏమాత్రం తిరగొద్దు:

జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో కోవిడ్ వ్యాపించే అవకాశాలు ఎక్కువుండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం తాజాగా ఆదేశాలు జారీచేసింది. సభలు, సమావేశాలు జరగకుండా నిరోధించాలని అన్ని రాష్ట్రాలకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ ఆపలేని పరిస్థితి నెలకొంటే వాటిని వాయిదా వేయించాలని కోరింది. సభలు, సమావేశాలు, ర్యాలీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను

మిగతా 3వ పేజీలో ▶

19,945 మందికి విముక్తి 14 లో

బతికున్నా.. లేకున్నా పేర్లు రాయాల్సిందే!

- కుటుంబంలోని ప్రతి ఒక్కరి పుట్టిన తేదీ చెప్పాలి
- పుట్టినరోజు గుర్తులేకపోతే పండుగల ఆధారంగా నమోదు.. వివాహ ఏడాది కూడా పరిగణనలోకి..
- పిన్‌కోడ్ నమోదు తప్పనిసరి..
- ప్రతి కుటుంబం పూర్తి వివరాలు ప్రత్యేక ఫామ్‌లో నమోదు..
- జాతీయ పౌర పట్టికకు మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: మీ పుట్టిన రోజు గుర్తులేదా? ఏ సంవత్సరమో తెలీదా..? ఏ నెలలో, ఏ తేదీన పుట్టారో మీ తల్లిదండ్రులు నమోదు చేయలేదా? మీరు చదువుకోకపోవడంతో సర్టిఫికెట్లలోనూ పుట్టిన తేదీ పేర్కొన లేదా..? అయినా ఫర్వాలేదు.. త్వరలో జరగనున్న జాతీయ పౌర పట్టిక(ఎన్పీఆర్) నమోదు చేయడానికి వచ్చే ఎన్యూమరేటర్లు మీ పుట్టిన తేదీ నిర్ధారించేందుకు అన్ని అవకాశాలనూ పరిశీలిస్తారు. ఎలాగో తెలుసా.. వర్షాకాలంలో పుట్టారా? ఎండాకాలం తర్వాత జన్మించారా అని తెలుసుకుం టారు. అప్పుడు ఏ పండుగలున్నాయో చూస్తారు.. పండుగల ఆధారంగా మీ పుట్టిన తేదీ

మిగతా 3వ పేజీలో ▶

కన్నతండ్రే.. కాలయముడు

చెరువులో ముంచి.. ఊపిరి ఆడకుండా చేసి..

ముగ్గురు కూతుళ్లను చంపిన తండ్రి

తాగుడుకు బానిసై ఉన్మాద చర్య

భర్తను ఉరి తీయాలని భార్య డిమాండ్

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో దారుణం

బాన్సువాడ: కన్న తండ్రే ఆ పిల్లల పాలిట కాలయముడయ్యాడు. మద్యానికి బానిసై, విచక్షణ మరచి ముగ్గురు కూతుళ్లను చెరువులో ముంచి దారుణంగా చంపాడు. ముగ్గురు పిల్లలు తుదిశ్వాస విడిచాక తీరిగ్గా ఇంటికి వెళ్లాడు. శుక్రవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నిజామాబాద్ నగరానికి సమీపంలోని దాస్‌నగర్‌కు చెందిన ఫయాజ్ 2009లో బాన్సువాడ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నివసించే నీలోఫర్‌ను వివాహం చేసుకున్నాడు. ఫయాజ్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో ఇల్లరికం వచ్చి బాన్సువాడలో స్థిరపడ్డాడు. వీరికి వరుసగా ముగ్గురు కూతుళ్లు పుట్టారు. నాలుగో కాన్పులో ఒక బాబు, పాప జన్మించారు. చిన్న కూతురును రూ.50 వేలు తీసుకుని బంధువులకు దత్తత ఇచ్చాడు. సెంట్రింగ్ పనిచేసే ఫయాజ్ తాగుడు, జూదానికి బానిస కావడంతో అతడిని ఇటీవల ఎవరూ పనిలోకి తీసుకోవడం లేదు. దీంతో భార్య నీలోఫర్

మిగతా 3వ పేజీలో ▶

ఆఫియా బేగం

మాహీన్ బేగం

జోయా బేగం

జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు 6 రోజులే

- మే 1 నుంచి దరఖాస్తులు
- వెబ్‌సైట్‌లో అందుబాటులోకి 'అడ్వాన్స్‌డ్' ఇన్ఫర్మేషన్ బ్రోచర్

సాక్షి, హైదరాబాద్: ఐఐటీల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష కోసం మే 1వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జేఈఈ నిర్వహణ సంస్థ అయిన ఐఐటీ ఢిల్లీ వెల్లడించింది. అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులను 6 రోజులే స్వీకరించేలా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను శుక్రవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మే 1 నుంచి 6 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో (jeeadv.ac.in) దరఖాస్తు

మిగతా 3వ పేజీలో ▶

అసెంబ్లీ ముచ్చట్లు

శుక్రవారం అసెంబ్లీకి వచ్చిన గవర్నర్ తమిళిసైకి స్వాగతం పలికి సాదరంగా లోపలికి తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్, స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి

గవర్నర్‌కు సాదర స్వాగతం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించేందుకు తొలిసారిగా శాసనసభకు వచ్చిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సాదర స్వాగతం లభించింది. ఉదయం 10.50గం.కి అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్‌కు సభా నాయకుడి హోదాలో సీఎం కేసీఆర్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు స్వాగతం పలికి గవర్నర్‌ను అసెంబ్లీ సమావేశ మందిరంలోకి తోడ్కొని వెళ్లారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ 40 నిమిషాలు ప్రసంగించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి సూట్లు ధరించి సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అమరవీరులకు నివాళి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా టీఆర్ఎస్ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు శుక్రవారం అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. మంత్రి కె.తారకరామారావు నేతృత్వంలో ఉదయం 10.15 గంటలకు గన్‌పార్క్‌కు చేరుకున్న మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులర్పించారు.

గవర్నర్ ప్రసంగంపై స్పందనలు

గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దరిదాపుల్లో లేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తావించలేదు. నిరుద్యోగ భృతి–సాగునీటి ప్రాజెక్టులపై క్లారిటీ లేదు. పేదలకిచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పై ఆరేళ్ల నుంచీ ఒకటే మాట చెబుతున్నారు. ఈ ప్రసంగంలో పోడుభూములు, ఎస్సీ–ఎస్టీ నిధులపై అంకెలు చెప్పలేదు. రైతుబంధు–రైతురుణమాఫీ అనేవి ఎన్నికల ఆయుధాలుగా మారాయి. మిషన్ భగీరథ నీళ్ల కోసం రూ.50వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఇంటికి నీళ్లు ఇవ్వలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు– మహిళల పై దాడుల నివారణ చర్యలు కనిపించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు లో టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో రూ.4వేల కోట్ల ప్రాజెక్టు ఇవ్వడం పై చర్చ జరపాలి. ఉస్మానియా యూనివర్సిటీలో ఎదురవుతున్న వివిధ సమస్యల పై చర్చించాలి. ప్రాధాన్యత సంతరించుకున్న ఆయా సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు అసెంబ్లీ పనిదినాలు పొడిగించాలి. – సీఎల్పీ నేత భట్టి

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం విన్న తరువాత చాలా బాధ అనిపించింది. ఒక అత్యున్నత స్థాయి మహిళ ద్వారా టీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పించింది. తెలంగాణలో ఇంకా అన్ని కష్టాలు పోలేదు. ఈ రోజు కొంతమంది నాయకులు తమ ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారు. ఒక దళితుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉండటాన్ని కూడా కేసీఆర్ సహించలేకపోతున్నారు. – కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి

బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అసత్యాలు పలికించింది. గత ఖరీఫ్‌లో రైతుబంధు అందరికీ అందలేదు, యాసంగి పంటలు చేతికందే సమయమొచ్చినా ఆ సబ్సిడీ చెల్లింపులు చేయలేదు. కందిపంట వేసిన రైతులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. గవర్నర్ ప్రసంగంలో రూ.లక్ష రుణమాఫీ హామీ అమలు ప్రస్తావనే లేదు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై ప్రచారం తప్ప, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదు. – చాడ వెంకటరెడ్డి

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఉపాధి కల్పన, గృహ నిర్మాణాలు, ఉద్యోగభద్రత, శాంతిభద్రతల సమస్యలు ప్రస్తావించకుండా టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికను గవర్నర్ ప్రసంగంలో వినిపించారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితిని ప్రతిబింబించేలా, ప్రగతికి దోహదపడేలా ఈ ప్రసంగం లేదు. దయనీయంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి మాట వరుసకు కూడా ప్రస్తావించలేదు. – తమ్మినేని వీరభద్రం

అరిగిపోయిన రికార్డును మరోసారి సభలో వినిపించారు. అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలమైందదని గవర్నర్ ప్రసంగంతో రుజువైంది. గవర్నర్‌తో పబ్లిక్ డాక్యుమెంట్ చదివించారు. ఒక్క అంశం కూడా ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాతది కాదు. – రాంచంద్రరావు

ఇది కొత్త తరహా బడ్జెట్ ఏమీ కాదు. గవర్నర్ ప్రసంగంలోని ప్రతి అంశంపైనా మేము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. కేసీఆర్ ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తాం. సీఏఏ, బైంసా అంశాలపై సభలో చర్చను లేవనెత్తుతా. – రాజాసింగ్

మాట్లాడుతున్న నారదాసు, కర్నె

గవర్నర్ తమిళిసై ప్రసంగం తెలంగాణ ఖ్యాతిని చాటింది. టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడింది. వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ రంగాల్లో పురోగతి సాధించింది. – టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

గవర్నర్ తమిళిసై ప్రసంగంలో కొత్తదనం లేదు. గత ప్రసంగమే తిరిగి చెప్పించినట్లుంది. కొత్త సీసాలో పాత సారాను తలపిస్తోంది. రైతు సమన్వయ సమితి స్థానంలో రైతు బందు సమితిలు తప్ప కొత్త అంశాలేమీ లేవు. – టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తెలంగాణ ప్రభుత్వం జాతీయ జనాభా రిజిస్టర్‌పై (ఎన్‌పీఆర్) స్టే విధించాలి. కేరళ మాదిరిగా ఎన్‌పీఆర్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. గవర్నర్ ప్రసంగంలో ఎన్‌పీఆర్ ప్రస్తావన ఉంటుందని భావించాం. కానీ, నిరాశపర్చింది. – మజ్లిస్ ఎమ్మెల్యేలు

అసెంబ్లీ సమావేశాలకు హాజరైన కాంగ్రెస్ సభ్యులు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి.. బీజేపీ సభ్యులు రాజాసింగ్, రాంచంద్రరావు

గవర్నర్ ప్రసంగాన్ని ఆలకిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్

శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

20 వరకు అసెంబ్లీ

- 12 రోజుల పాటు అసెంబ్లీ, 8 రోజుల పాటు మండలి భేటీ
- రేపు అసెంబ్లీ, మండలిలో రాష్ట్ర వార్షిక బడ్జెట్
- 9, 10న హోలీ, 15న అసెంబ్లీకి విరామం
- స్వల్పకాలిక చర్చల కోసం అవసరమైతే పొడిగింపు
- సీఏఏ, ఎన్నార్సీపై సభలో చర్చ, ఆ తర్వాత తీర్మానం

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై శుక్రవారం బీఏసీలో చర్చిస్తున్న సీఎం కేసీఆర్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మంత్రులు, విపక్షాల సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఐదో విడత సమావేశాలు ఈ నెల 20 వరకు 12 రోజుల పాటు జరగనున్నాయి. కాగా, 8న (ఆదివారం) రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2020–21ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశం జరిగింది. స్పీకర్ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ఈటల రాజేందర్, గంగుల కమలాకర్‌తో పాటు విపక్ష నేతలు భట్టి విక్రమార్క, అక్బరుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ విప్‌లు, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు పాల్గొన్నారు. సుమారు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశ తేదీలను ఖరారు చేయడంతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన నేపథ్యంలో, శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సీఎం సమాధానం ఉంటుంది. ఆర్థిక మంత్రి హరీశ్ 8న రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం సభను స్పీకర్ వాయిదావేస్తారు. హోలీ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీలతో పాటు 15న సభా కార్యకలాపాలకు విరామం ప్రకటించారు. శాఖల వారీగా బడ్జెట్ పద్దులపై 13 నుంచి 19 వరకు జరిగే చర్చలకు 20న కేసీఆర్ సమాధానం ఇస్తారు.

సీఏఏ, కరోనాపై చర్చ..

అసెంబ్లీ పనిదినాలు పొడిగించి, స్వల్పకాలిక చర్చలు జరపాల్సిందిగా కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. అయితే స్వల్పకాలిక చర్చ కోసం వచ్చే వినతుల సంఖ్యను బట్టి ఈ నెల 20 తర్వాత అవసరమైతే మరోసారి బీఏసీ సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకుందామని సీఎం ప్రతిపాదించారు. నిర్మాణాత్మక చర్చలు జరిగే పక్షంలో ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా సభలో ప్రభుత్వమే తీర్మానం చేస్తుందని సీఎం తెలిపారు. కరోనా వైరస్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, భయాందోళన తొలగించేందుకు అసెంబ్లీలో చర్చించాలని బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. 304 నిబంధన కింద వివిధ అంశాలకు సంబంధించి లఘు ప్రశ్నలపై చర్చించేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించారు. ప్రతిపక్ష సభ్యులు కోరే ప్రతి చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముందస్తుగా ఆయా అంశాలను సభ ముందు పెడితే సంబంధిత సమాచారాన్ని సభలో అందుబాటులో ఉంచుతామని సీఎం పేర్కొన్నారు.

8 రోజుల పాటు మండలి భేటీ

శాసనమండలి సమావేశాలను 8 రోజుల పాటు నిర్వహించాలని మండలి బీఏసీ నిర్ణయించింది. అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగం అనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం బీఏసీ సమావేశం జరిగింది. మంత్రులు హరీశ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, విప్ భానుప్రసాద్‌రావు, ఎంఐఎం ఎమ్మెల్సీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం చర్చ ముగిస్తారు. శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండలిలో 8న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం సభను చైర్మన్ వాయిదా వేస్తారు. తిరిగి 11న మండలి సమావేశమవుతుంది. 11 నుంచి 14 వరకు వరుసగా 4 రోజుల పాటు మండలి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించగా, 13, 14 తేదీల్లో స్వల్పకాలిక చర్చ నిర్వహించేందుకు బీఏసీ అంగీకరించింది. 15 నుంచి 19 వరకు మండలి సమావేశాలకు విరామం ప్రకటించగా, తిరిగి 20న ముగింపు భేటీ జరుగుతుంది. సీఏఏపై తీర్మానం 20న మండలి ముందుకొచ్చే అవకాశం ఉంది. బిల్లుల ఆమోదానికి అవసరమైతే మండలి సమావేశ తేదీలను పొడిగించాలనే అభిప్రాయం బీఏసీలో వ్యక్తమైనట్లు సమాచారం.

అసెంబ్లీలో శాఖల వారీగా బడ్జెట్ పద్దులపై చర్చ

మార్చి 13: హౌజింగ్, సోషల్, ట్రైబల్, బీసీ, మైనారిటీ, మహిళా, శిశు, దివ్యాంగ సంక్షేమ శాఖలు

మార్చి 14: రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, హోం, వ్యవసాయం, పశు, మత్స్య సంపద, సహకారం, పౌరసరఫరాలు

మార్చి 16: పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, క్రీడలు, యువజన సర్వీసులు, వైద్య, ఆరోగ్యం

మార్చి 17: కార్మిక, ఎంప్లాయ్‌మెంట్, ఎండోమెంట్స్, అటవీ, పర్యావరణ, వాణిజ్యం, పరిశ్రమలు, ఐటీ, ప్రభుత్వ రంగ సంస్థలు

మార్చి 18: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాలు, చిన్న, మధ్యతరహా, భారీ నీటిపారుదల, విద్యుత్

మార్చి 19: శాసనసభ వ్యవహారాలు, గవర్నర్, మంత్రి మండలి, న్యాయ, జీఏడీ, ఎన్నికలు, ప్లానింగ్, సమాచార, ప్రజా సంబంధాలు

మార్చి 20: ద్రవ్య వినిమయ బిల్లు–2020

నా తెలంగాణ ప్రగతికి చిరునామా

▶ మొదటి పేజీ తరువాయి

బలపరుస్తున్నారన్నారు. ప్రజలు తమపై పెట్టుకున్న అచంచల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఎప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన నాయకుడే రాష్ట్ర సారథిగా ముందుకు నడిపించడం తెలంగాణకు కలిసొచ్చిన అంశమన్నారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన జీవన విధ్వంసం కారణంగా కుదేలైన అన్ని రంగాలకు పునరుత్తేజం కల్పించేందుకు దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం గడిచిన ఆరేళ్లుగా ప్రణాళికాబద్ధంగా, చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగం ఆమె మాటల్లోనే...

పేదలకు కనీస జీవన భద్రత కోసం..

''పేదలకు కనీస జీవన భద్రత కల్పించాలని ప్రభుత్వం సంక్షేమ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. మానవీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వారికి భద్రత కల్పించాయి. ఆసరా, వికలాంగుల పెన్షన్లను పెంచడంతో వారు ఎవరిపైనా ఆధారపడకుండా సంతోషంగా బతుకుతున్నారు. వృద్ధాప్య పెన్షన్ల అర్హత వయసును 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే వారందరికీ పెన్షన్లు అందుతాయి. ప్రభుత్వ ఖర్చుతో నిర్మించే డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కేవలం తెలంగాణలోనే అమలవుతోంది. ఈ పథకం క్రింద ఇప్పటివరకు 2,72,763 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటి నిర్మాణం వేగంగా కొనసాగుతోంది.

పేదలు, వివిధ వర్గాలకు చేయూత..

ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు 125 చదరపు గజాల్లోపు స్థలాలను ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరించింది. ఆర్టీసీ కార్మికుల రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లకు పెంచింది. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 22,667 మంది ఆర్టిజన్ల సర్వీసును క్రమబద్ధీకరించింది.

విద్యుత్ రంగంలో అనితర విజయాలు..

దేశంలోనే తలసరి విద్యుత్ వినియోగం అధికంగా కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. సమైక్య రాష్ట్రంలో 13,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడితే తెలంగాణ రాష్ట్రంలో 13,168 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణం. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది.

ప్రపంచవ్యాప్త గొప్ప పథకాల్లో రైతు బంధు ఒకటి..

రైతుబంధు పథకం ఇప్పుడు భారత దేశానికే కాదు, యావత్ ప్రపంచానికి ఆదర్శనీయం. ఎకరానికి రూ. 10 వేల చొప్పున రెండు విడతల్లో రైతుబంధును అందిస్తూ దేశానికి ఓ రోల్‌మోడల్‌గా నిలిచింది. తెలంగాణ స్ఫూర్తితో వివిధ రాష్ట్రాలు రైతుబంధును ఆదర్శంగా తీసుకుంటున్నాయి. వ్యవసాయాభివృద్ధి కోసం ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న గొప్ప పథకాల్లో రైతుబంధు ఒకటని ఐక్యరాజ్యసమితి కీర్తించడం మనకు గర్వకారణం.

ఇకపై రైతుబంధు సమితులు..

రైతు సమన్వయ సమితులను ఇకపై రైతు బంధు సమితులుగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విత్తనం వేసిన దగ్గర నుంచి మార్కెట్లో పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతుబంధు సమితిలు కీలక బాధ్యతలు నిర్వహించేలా ప్రభుత్వం త్వరలోనే కార్యాచరణను ప్రారంభించనుంది.

త్వరలోనే తెలంగాణ హెల్త్ ప్రొఫైల్..

'కంటి వెలుగు'లో 1.54 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 41 లక్షల మందికి కంటి అద్దాలు, మందులను ప్రభుత్వం ఉచితంగా అందించింది. కంటి వెలుగు తరహాలోనే చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిహిస్తాం. ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తాం. దీనికి సంబంధించిన కార్యాచరణను త్వరలోనే ప్రభుత్వం ప్రకటిస్తుంది.

కొత్త విధానాలు–కొత్త చట్టాలు..

అధికారులు, ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెంచడం కోసం, స్థానిక సంస్థలను క్రియాశీలం చేయడం కోసం ప్రభుత్వం కొత్త గ్రామీణ విధానం, కొత్త పట్టణ విధానం తీసుకొచ్చింది. కొత్తగా పంచాయతీ, పుర చట్టాలను తెచ్చింది. గతంలో ప్రభుత్వానికి, మంత్రులకు ఉండే అధికారాలను తొలగించి కలెక్టర్లకు ఇచ్చింది. అవినీతికి, జాప్యానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తోంది. రాష్ట్రంలో కొత్త భూ పరిపాలన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది.

రూ. 2.04 లక్షల కోట్ల పెట్టుడులు...

రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. కేవలం 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులిచ్చే టీఎస్ ఐపాస్ సింగిల్ విండో విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ఇప్పటివరకు 12,427 పరిశ్రమలు అనుమతులు పొందగా రూ. 2.04 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. 14 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

ఐటీ రంగంలో మేటి..

ఐటీ రంగంలో రాష్ట్రం బలమైన శక్తిగా ఎదిగింది. అంతర్జాతీయ ఐటీ కంపెనీలు వచ్చాయి. 2013–14లో ఐటీ ఎగుమతుల విలువ రూ. 57 వేల కోట్లు కాగా 2018–19 నాటికి రూ. 1.09 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఐటీ ఎగుమతుల వృద్ధిరేటులో దేశ సగటు 8.9% కాగా తెలంగాణలో 16.89 శాతం కావడం ఐటీ రంగంలో సాధించిన ప్రగతికి సంకేతం. మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఐటీ రంగాన్ని రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలు, పట్టణాలకు విస్తరింపజేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. శాంతిభద్రతల పటిష్టత కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ త్వరలోనే ప్రారంభం కానుంది.

కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ...

ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రంపైనా పడింది. అయినప్పటికీ పటిష్టమైన పరిపాలన విధానాలు, కట్టుదిట్టమైన ఆర్థిక క్రమశిక్షణతో తెలంగాణ నిలదొక్కుకోగలుగుతోంది. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఆదాయ వృద్ధిరేటు తిరోగమనంలో ఉండగా తెలంగాణ ఆ దుస్థితిలో లేదు. ప్రస్తుతం అమలు చేస్తున్న అన్ని పథకాలను యథాతథంగా అమలు చేస్తూ స్వీయ ఆదాయ మార్గాలను పెంపొందించుకుంటూ అత్యంత ఆశావహ దృక్పథంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.''

వ్యవసాయ రంగంలో అభివృద్ధి..

కోటి ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర జలవిధానాన్ని అమలు చేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రభుత్వం నీరందిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తికానుంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టుకు 365 రోజులపాటు నీరందించడానికి సమ్మక్క బ్యారేజీ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంతంలోనే సీతారామ ప్రాజెక్టుకు నీరందించడానికి 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి సాధించేలా 40 టీఎంసీల సామర్థ్యంతో సీతమ్మ సాగర్ బ్యారేజీని మంజూరు చేసింది. యాసంగి పంట సాధారణ విస్తీర్ణం 17,08,397 ఎకరాలవగా ఈ యాసంగి సీజన్‌లో వరి పంట సాగు 38,19,419 ఎకరాలకు పెరిగింది. 123.5 శాతం పెరుగుదల నమోదైంది.

గవర్నర్ నోట జై తెలంగాణ నినాదం...

గవర్నర్ తన ప్రసంగం చివరల్లో ఓ కొటేషన్‌ను తమిళంలో చెప్పి దాని అర్థాన్ని ఆంగ్లం లోకి అనువదించారు. 'ఆకలి దప్పులు, అనారోగ్యాలు, శతృత్వం లేని రాజ్యమే గొప్ప రాజ్యం' అని అన్నారు. తర్వాత జైహింద్, జై తెలంగాణ అంటూ ప్రసంగాన్ని ముగించారు.

మీడియా పాయింట్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామికంగా పరిపాలన చేస్తోంది. లోక్‌సభ సభ్యుడు రేవంత్ రెడ్డిని దుర్మార్గంగా అరెస్ట్ చేయడం సరైంది కాదు. ప్రజాస్వామ్య దేశంలో ఆరోపణలతో లోక్‌సభ సభ్యుడిని అరెస్ట్ చేసి జైలుకి పంపడం ఇదే మొదటిసారి. రేవంత్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. బేషరతుగా వెంటనే రేవంత్‌పై కేసును కొట్టివేసి విడుదల చేయాలి. కేటీఆర్ ఫామ్‌హౌస్ విషయంపై మంత్రి స్పందించి స్పష్టత ఇవ్వాలి. తప్పును ప్రశ్నిస్తే అరెస్టులు చేసి జైలుకి పంపిస్తారా? 111 జీవో ఉల్లంఘన జరిగిందా? లేదా? అనే విషయంపై కేటీఆర్ సమాధానం చెప్పాలి. – భట్టి విక్రమార్క

రేవంత్‌రెడ్డి డ్రోన్ ఉపయోగించినట్లు ప్రభుత్వం ఆధారాలు బయట పెట్టాలి. ఎలాంటి ఆధారాల్లేకుండా కేసులు పెట్టడం సరైంది కాదు. రేవంత్‌పై కేసులు ఉపసంహరణ చేసుకుని వెంటనే విడుదల చేయాలి. నేను పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. – శ్రీధర్‌బాబు

అసెంబ్లీ సమావేశంలో సంగారెడ్డి రైతుల పక్షాన పలు అంశాలపై ప్రశ్నిస్తాను. సింగూరు–మంజూరు నీళ్లు సంగారెడ్డికి అందకపోవడంతో సంగారెడ్డి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు హరీశ్‌రావు మంత్రిగా కొనసాగుతున్నారు. నేను గత అసెంబ్లీ సమావేశాల నుంచి సంగారెడ్డికి నీళ్లు కావాలని అడిగినా ఇప్పటివరకు రాలేదు. – జగ్గారెడ్డి

కేటీఆర్ తన విలాసవంతమైన జీవనం కోసం 111 జీవోను ఉల్లంఘించారు. కేటీఆర్ ఉల్లంఘనలను బయటపెట్టినందుకు రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదు. అసలు దొంగలను పట్టుకోవడం మానేసి ప్రజాప్రతినిధులను అరెస్టు చేస్తారా? 111 జీవోను కాపాడాల్సిన కేటీఆర్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. ఫామ్‌హౌస్ కేటీఆర్‌ది కాదు.. కానీ ఆయన కొన్నేళ్లుగా వాడుకుంటున్నారు అని బాల్కసుమన్ అన్నారు. కేసీఆర్‌కి ఎర్రవల్లిలో ఫామ్‌హౌస్, కేటీఆర్‌కి జన్వాడలో ఫామ్‌హౌస్ ఎందుకు? పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ పోయాయి. – జీవన్‌రెడ్డి

మా ఇంట్లోనూ..: ఈటల

రాష్ట్రంలో నమోదైన రెండు కరోనా కేసులు నెగటివ్‌గా తేలడంతో ఊపిరిపీల్చుకున్నా. కరోనా ప్రభావం రాష్ట్రంలోని చాలా రంగాలపై పడింది. కరోనా రోగిని తరలించాలని కోరిన గాంధీ ఆస్పత్రి వైద్యులను తిట్టా. మాస్కు వేసుకుని బయట తిరగాలని అందరూ చెప్తే, సాధారణ జనంలో కరోనా ప్రభావం రాష్ట్రంలో లేదని చెప్పేందుకు నేను మాస్కులు లేకుండానే తిరిగా. ఓ దశలో మా ఇంట్లోనూ కుటుంబ సభ

కోవిడ్ వైరస్‌పై 'ర్యాపిడ్ రెస్పాన్స్'..

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధిత సంస్థలు, వ్యక్తులకు వివరించాలంది. అలాగే సినిమాలు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, ఇతరత్రా గుంపులుండే ప్రాంతాలకు వెళ్లకుంటేనే మేలని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు స్పష్టం చేశాయి. వివిధ సంస్థల్లో హాజరు కోసం వేలిముద్రలతో బయోమెట్రిక్ నిర్వహిస్తున్నారు. కోవిడ్ కరచాలనంతో కూడా సోకే ప్రమాదం ఉండటంతో వెంటనే బయోమెట్రిక్‌ను నిలిపివేయాలని కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్రం ఆదేశాలను రాష్ట్రంలో అమలు చేసే దిశగా సర్కారు ఉపక్రమించింది. వీటితోపాటు అంతర్జాతీయ విమాన ప్రయాణికులను స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించిన కేంద్రం ఆథరైజ్డ్ ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుల వద్ద వైద్య బృందాలను ఉంచింది. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా 107 చెక్‌పోస్టులుంటే, వాటిలో కేవలం 71 చోట్లే వైద్య బృందాలున్నాయి. మిగిలిన చోట్ల స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలే వాటిని ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

104కు 210 కాల్స్...

కరోనాపై వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన '104'హెల్ప్‌లైన్‌కు విపరీతంగా కాల్స్ వస్తున్నాయి. అది ఏర్పాటైన 24 గంటల్లోనే 210 కాల్స్ వచ్చాయి. అందులో 185 మంది కరోనాకు సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మరో 25 మంది తమకు కోవిడ్ లక్షణాలున్నాయని తెలిపారు. అయితే ఆ లక్షణాలున్నాయని చెప్పిన వారిలో క్రాస్ చెక్ చేయగా ఆ లక్షణాలు లేవని, వారికి కనీసం ట్రావెలింగ్ హిస్టరీ కూడా లేదని గుర్తించి వారికి ఎటువంటి పరీక్షలు నిర్వహించలేదు. హైదరాబాద్‌లో 40 కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో కోవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటవుతున్నాయి. ఆ ఆస్పత్రులన్నీ విధిగా తమ వివరాలను శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖకు తెలిపాయి. కాగా కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్రం ఆరా తీసింది. శుక్రవారం ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావుతో కేంద్ర బృందం సభ్యులు భేటీ అయ్యారు. కరోనా ఐసోలేషన్ వార్డుల వివరాలను సేకరించారు. అలాగే తీసుకుంటున్న చర్యలను ఆ బృందం తెలుసుకుంది.

మరింత మెరుగవుతోంది...

కోవిడ్ బాధితుడు ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆసుపత్రిలో చేరిన మొదట్లో అతను చాలా కుంగిపోయి కనిపించాడు. మొదట్లో అతని ఊపరితిత్తుల్లో మూడో వంతు వరకు న్యుమోనియా ఆవరించి ఉంది. ఇప్పుడు అతని ఆరోగ్య పరిస్థితి మరింత మెరుగవుతోంది. కొందరు వైద్యాధికారులు, కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అతను ఒక కుటుంబ సభ్యునితో ఫోన్‌లో మాట్లాడుతుండగా 'సాక్షి'అతని మాటలను ఆలకించింది. అతనేమన్నా డంటే, 'నా ఆరోగ్యం చాలా వరకు మెరుగ్గా ఉంది. అమ్మా నాన్నల ఆరోగ్యం కూడా బాగుంది. ఇంటి నుంచే భోజనం వస్తోంది. ఆసుపత్రిలో చిన్న చిన్న సమస్యలున్నా ఇబ్బంది పడే పరిస్థితి లేదు. డాక్టర్లు మంచిగా చికిత్స చేస్తున్నారు. ఇప్పుడు నాకు తగ్గుతుందన్న విశ్వాసముంది'అని బాధితుడు వ్యాఖ్యానించడం గమనార్హం. అయితే తన ఫొటోలను కొందరు తీయడానికి ప్రయత్నిస్తున్నారని అతను ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మరింత విశ్వసనీయత పెంచాలి

గాంధీ ఆస్పత్రి: కోవిడ్‌పై భయాందోళనలు తొలగించి అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వసనీయత పెంచేందుకు కృషి చేయాలని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గాంధీ ఆస్పత్రిని శుక్రవారం రాత్రి వైద్య ఉన్నతాధికారులతో కలసి మంత్రి సందర్శించారు. కోవిడ్ ఐసోలేషన్, వీఐపీ వార్డులను, అత్యవసర విభాగంలోని ఎక్యూట్ ఐసీయూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోవిడ్ పాజిటివ్ వ్యక్తికి అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. పర్సనల్ ఎక్విప్‌మెంట్ ప్రొటెక్షన్ దుస్తులు ధరించి ఐసీయూలోకి వెళ్లారు. అద్దంలోంచి కోవిడ్ పాజిటివ్ వ్యక్తిని చూసుకుంటూ ఐదు నిమిషాల పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కోవిడ్ పాజిటివ్ వ్యక్తి కోలుకుంటున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ రమేష్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాసరావు, గాంధీ ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఫల్మనాలజీ వైద్యులు కృష్ణమూర్తి, ప్రమోద్, ఆర్‌ఎంఓలు శేషాద్రి, నరోత్తం, గోపాల్‌లతోపాటు పలువురు వైద్యులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

.. పేర్లు రాయాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ధారించేందుకు ప్రయత్నిస్తారు. అప్పటికీ తేలకపోతే మీ కుటుంబ వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన వారే మీ శారీరక పరిస్థితి, మీ కుటుంబసభ్యుల వయసు, మీ పిల్లల వయసు ఆధారంగా మీ పుట్టిన తేదీ ఖరారు చేసి నమోదు చేస్తారు. ఈ మేరకు కేంద్రం ఎన్పీఆర్ మార్గదర్శకాలను రాష్ట్రాలకు పంపింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఎప్పుడైనా నిర్ణీత షెడ్యూల్‌లో జనగణనతో పాటు ఎన్పీఆర్‌ను ఏకకాలంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. జాతీయ పౌరపట్టిక (ఎన్పీఆర్) మీ మూలాలను తేల్చనుంది. మీ తల్లిదండ్రులు ఎక్కడి వారో నమోదు చేయనుంది. వారు బతికున్నా లేకపోయినా వారి పేర్లనూ రికార్డు చేయనుంది. మీ కుటుంబసభ్యులు ఇంట్లో లేకపోయినా, ఏదైనా ప్రాంతంలో ఉద్యోగం, ఉపాధి నిమిత్తం వెళ్లినా, అక్కడ నమోదు చేసుకోకపోతే మీ దగ్గరే వారి పేర్లు, వివరాలను నమోదు చేసుకోనుంది. ఈసారి కొత్తగా సొంత ఇళ్లు లేని వారి జాబితాను కూడా ప్రత్యేకంగా రూపొందించనుంది.

ఎన్పీఆర్ తయారీ మార్గదర్శకాల్లో కొన్ని..

- ప్రతి కుటుంబానికి తాత్కాలిక ధ్రువీకరణ సంఖ్య (టీఐఎన్) కేటాయిస్తారు. అందులో రాష్ట్రం, జిల్లా, మండలం, పట్టణం లేదా గ్రామాలకు కోడ్ నంబర్లు ఉంటాయి. ఆ తర్వాత 2010, 2015లో రూపొందించిన డేటా ప్రకారం ఇంటి అడ్రస్ సరిచూస్తారు. అవసరమైతే చిరునామా మారుస్తారు. ఇందులో పిన్‌కోడ్ తప్ప నిసరిగా నమోదు చేయాలి.
- ఇంట్లో ఉంటున్న వారి సంఖ్య నమోదు చేసి, ప్రతి ఒక్కరికీ సీరియల్ నంబర్ కేటాయిస్తారు. ఈ సంఖ్య ఆధారంగా ప్రతి వ్యక్తి పూర్తి పేరు (ధ్రువపత్రాల్లో ఉన్న పేర్లతో పోల్చి), యజమానితో బంధుత్వం, ఎన్యూమరేటర్ వెళ్లినప్పుడు ఆ వ్యక్తి ఇంట్లోనే ఉన్నారా.. లేదా.. ఎక్కడికి వెళ్లారనే విషయాలను నమోదు చేస్తారు.
- ప్రతి వ్యక్తికి సంబంధించి వివాహమైందా? లేదా అనే అంశాన్ని వయసుతో సంబంధం లేకుండా నమోదు చేసుకుంటారు. అలాగే కుటుంబంలో అందరి పుట్టిన రోజులు ఇంగ్లిష్ క్యాలెండర్ ప్రకారం నమోదు చేస్తారు.
- కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఎక్కడ పుట్టారనే విషయాన్ని విడివిడిగా రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం లేదా పట్టణం లాంటి వివరాలను నమోదు చేస్తారు. అప్పుడు ఆ వ్యక్తి భారతీయుడా? కాదా అనేది నిర్ధారిస్తారు. జాతీయత విషయంలో కుటుంబంలోని అందరిని అడిగి రికార్డు చేసుకుంటారు.
- పాస్‌పోర్టు నంబర్, విద్యార్హతల వివరాలు, వృత్తి, మాతృభాషలాంటి సమాచారాన్ని నమోదు చేస్తారు.
- మీతో పాటు మీ నివాసంలోనే పనిమనుషులు శాశ్వతంగా ఉంటే వారి పేర్లను కూడా మీ కుటుంబ వివరాల్లోనే నమోదు చేసుకుంటారు.
- మిలిటరీ ఏరియాలు, బయటప్రాంతాల్లో నివసించే రక్షణ సిబ్బంది వివరాలను ప్రత్యేకంగా తీసుకుంటారు. వారి వివరాలను సంబంధిత విభాగాలతో చర్చించిన తర్వాతే జాబితాలో పొందుపరుస్తారు.
- యాచకులు, వలసజీవులు, సంచార జీవులు, ప్లాట్‌ఫారాలు, బస్‌స్టేషన్లు, పార్కుల్లో ఉండేవారి వివరాలను కూడా ఈసారి ఎన్పీఆర్‌లో నమోదు చేయనున్నారు.
- కుటుంబ శాశ్వత చిరునామా, ఆ ఇంట్లో ఎంత కాలం నుంచి ఉంటున్నారు. గతంలో ఆ కుటుంబ వివరాలు ఎన్పీఆర్‌లో నమోదయ్యాయా? లేదా అనే విషయాలను కూడా రాసుకుంటారు. ఆధార్, మొబైల్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్లను లభ్యతను బట్టి తీసుకుంటారు. ఈ వివరాలన్నింటినీ కలిపి ప్రతి కుటుంబానికి ఒక సంగ్రహ నివేదికను ఇంటికొచ్చిన ఎన్యూమరేటర్ తయారు చేస్తారు.

కన్నతండ్రే.. కాలయముడు

▶ మొదటి పేజీ తరువాయి

నిందితుడు ఫయాజ్

బట్టలు కుడుతూ, మహిళా సంఘం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఫయాజ్ డబ్బుల కోసం భార్యను వేధిస్తుండేవాడు. గురువారం రాత్రి తాగివచ్చి డబ్బుల కోసం భార్యను కొట్టాడు. అదే సమయంలో పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులకు తన భర్త గురించి నీలోఫర్ ఫిర్యాదు చేసింది. దీన్ని మనసులో పెట్టుకున్న ఫయాజ్.. శుక్రవారం ఉదయం సైతం ఆమెను కొట్టాడు. అనంతరం అతను ముగ్గురు కూతుళ్లు, కుమారుడిని తీసుకుని బయటకు వెళ్లాడు. సమీపంలోని దర్గాలో కందూరు చేస్తున్నారని, అక్కడికెళ్లి అన్నం తిందామ ని చెప్పి వారిని తాడ్కోల్ చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అయితే నాలుగేళ్ల కుమారుడు రయీజ్ మధ్యలోనే ఇంటికి వెళ్లాడు. దీంతో ముగ్గురు కూతుళ్లను చెరువు వద్దకు తీసుకెళ్లిన ఫయాజ్.. ఒక్కొక్కరిని బల వంతంగా నీటిలో ముంచాడు. ఆఫి యా బేగం(10), మహీన్ బేగం (8), జోయా (6)లను నీటిలో ముంచి, వారిపై కూర్చున్నాడు. ఊపిరి ఆడక వారు చనిపోవడంతో ఇంటికి వెళ్లా డు. తడి బట్టలతో వచ్చిన భర్తను చూసిన నీలోఫర్.. కూతుళ్లు ఎక్కడని అడిగింది. వారు దర్గా వద్ద అన్నం తింటున్నారని చెప్పి, అక్కడి నుంచి కల్లు దుకాణానికి వెళ్లి కల్లు తాగాడు. భర్తపై అనుమానం వచ్చిన నీలోఫర్ చెరువు వద్దకు వెళ్లింది. అక్కడ కూతుళ్ల చెప్పులను చూసి స్థానికులకు విషయం చెప్పింది. స్థానికులు గాలించగా పిల్లల మృతదేహాలు దొరికాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బంధువుల ఆందోళన..

నిందితుడినిబహిరంగంగాఉరితీ యాలంటూ మృతుల తల్లి నీలోఫర్, బంధువులు, డ్రైవర్స్ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. తన కళ్లముందే భర్తను ఉరి తీయాలని నీలోఫర్ డిమాండ్ చేసింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు 6 రోజులే

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకోవచ్చని అందులో పేర్కొంది. ఫీజు చెల్లింపునకు 7 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది. మే 17న అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహిస్తామని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని పేర్కొంది. వికలాంగులకు గంట అదనంగా సమయం ఇస్తామని, జూన్ 8న పరీక్షల ఫలితాలు ప్రకటిస్తామని తెలిపింది. ఈసారి జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన టాప్ 2.5 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా పరిగణన లోకి తీసుకుంటామని పేర్కొంది. 2020-21 విద్యా సంవత్సరంలో ఐఐటీల్లో కనీసం 20 శాతం (2,676) సూపర్ న్యూమరరీ సీట్లు మహిళలకు కేటాయించేలా ఐఐటీల కౌన్సిల్ నిర్ణయం తీసుకుందని వెల్లడించింది. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్‌లో అడ్వాన్స్‌డ్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.





తెలంగాణ ప్రభుత్వము
సాగు నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్
సంఖ్య: 73/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 05.03.2020
మిషన్ కాకతీయ-IV - మహబూబాబాద్ జిల్లాలో న (01) ఒక ఫీడర్ చానల్ నిర్మాణ పనులు కొరకు తేదీ: 06.03.2020 నుండి 13.03.2020 వరకు బిడ్స్‌ను ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఐ అండ్ సిఎడిడి., నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్ ఫోన్.నం.0870-2577221
DIPR Ro.No.823-PP/CL/ADVT/1/2019-20, Dt:06/03/2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
'e' NIT No. 139 to 145 / SE / R&B / Elec/Hyd/2019-2020 తేది: 06.03.2020
పనుల సంఖ్య: 7, పనుల పేర్లు: క్వాలిఫైడ్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ సర్వీసులు రోజంతా ఏర్పాటు చేయుట, 20 కాటేజీల నిర్మాణము, స్విల్డ్ ఎలక్ట్రిషియన్స్‌ను నియమించుట మరియు ఎలక్ట్రికల్ ఐటమ్స్ సరఫరా ద్వారా ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్ వార్షికంగా రోజు రోజుకు నిర్వహణ, పాత DG సెట్‌కు బదులుగా కొత్త 250 KVA DG సెట్ ఏర్పాటు చేయుట కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: 26.51 కోట్లు, టెండర్ల స్వీకరణకు చివరి తేది: 13-03-2020 మ. 1.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), ఎలక్ట్రికల్ సర్కిల్, హైదరాబాద్
DIPR RO.No.819-PP/CL/Advt/1/2019-20, Dt: 06/03/2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT. No.1920/WGL/ENC(R&B)/DCE(H)/EE-4/DEE-4/AEE-1/2019 (3rd Call) తేది: 05.03.2020
వరంగల్ రీజియన్ (R&B) డిపార్ట్‌మెంట్‌లో మున్సిపల్ ఫండ్స్ క్రింద వరంగల్ అర్బన్ జిల్లాలో 1 పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద దిగువ సంతకందారుచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే https://tenders.telangana.gov.in నుండి 10.03.2020 మ.3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 17.03.2020న లేదా ఆలోగా మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే https://tenders.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR Ro.No.2603-DP/CL/Advt/1/2019-20, Dt: 06.03.2020

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507
RECRUITMENT FOR MEDICAL OFFICER (FULL-TIME) – FEMALE ON CONTRACTUAL BASIS
IISER Tirupati invites online applications from Indian nationals having excellent academic record and relevant work experience for the post of "Medical Officer (full-time) - Female" on contractual basis.
For detailed advertisement, please visit www.iisertirupati.ac.in and click on the link "Opportunities-Technical/Administration".
The last date for submission of online applications is April 22, 2020.
Advt. No.10/2020/IISER-T/Rect./06.03.2020 Sd/- Registrar

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507
RECRUITMENT FOR PRIVATE SECRETARY ON CONTRACTUAL BASIS
IISER Tirupati invites online applications from Indian nationals having excellent academic record and relevant work experience for the post of "Private Secretary" on contractual basis.
For detailed advertisement, please visit www.iisertirupati.ac.in and click on the link "Opportunities-Technical/Administration".
The last date for submission of online applications is April 22, 2020.
Advt. No.09/2020/IISER-T/Rect./06.03.2020 Sd/- Registrar

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
CIN No: U40109TG2000SGC034119
టెండరు ప్రకటన
తయారీదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా మెటీరియల్స్ కొనుగోలు చేసేందుకు TSNPDCL ఉద్దేశిస్తోంది.
స్పెసిఫికేషన్ నం.: CGM/P&MM/OT-51 to OT-56/2019-20
మెటీరియల్ పేరు: వివిధ రకాల మెటీరియల్స్
బిడ్ సెక్యూరిటీ @ 2% ఆన్ ఎక్స్-వర్క్స్. టెండర్ డౌన్‌లోడింగ్ 12.03.2020 ఉ.11.00 గం. నుండి ఆన్-లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ప్రారంభమగును. తదుపరి వివరాల కోసం www.tender.telangana.gov.in మరియు www.tsnpdcl.in దర్శించండి. డిజిటల్ కీ పొందేందుకు www.tsts.gov.in దర్శించండి.
ఫోన్ నం. 0870-2461507
మెయిల్ Id: cgmpmm@tsnpdcl.in సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P&MM)

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
'e' Proc. Notice No.23/T7/DEE/DSE/SEW/2019-20 తేది: 04.03.2020
Nit No.66 & 67/T7/T6/DEE/DSE/SEW/2019-20 తేది: 04.03.2020
పనుల సంఖ్య: (2), పనుల పేర్లు: యాదాద్రి భువనగిరి జిల్లా, యాదాద్రి SLNSD వద్ద VIP గెస్ట్‌హౌజ్ భవనానికి, EO క్యాంప్ ఆఫీస్ భవనానికి అర్బనైజేషన్ ఎలివేషన్ ఏర్పాటు చేయుట కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా మొత్తం: రూ. 126 లక్షలు. టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లను 11.03.2020 సా.4.00 గం. నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 18.03.2020న లేదా ఆలోగా మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చును.
DIPR RO.No.2604-DP/CL/Advt/1/2019-20, Dt: 06/03/2020 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), రీజనల్ ఆఫీస్, వరంగల్

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 148 to 160 / RO / 2019-20 తేది: 02.03.2020 (2వ పిలుపు)
పనుల సంఖ్య (13). ప్యాకేజి నం.లు 19,20,21,22,23,24,25,01,02,03,04,05,06. మంచిర్యాల జిల్లాలోని చెన్నవరపల్లి, బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, తాండూరు, కాసిపేట, చెన్నూరు, జైపూర్, మందమర్రి, భీమారం, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలలో మరియు KB ఆసిఫాబాద్ జిల్లాలోని KB ఆసిఫాబాద్ మండలంలో రోడ్డు పనులు మరియు ఇతర పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: 2477.43 లక్షలు. గ్రాంట్: DMFT 2019-20. టెండరు డాక్యుమెంట్లు 07.03.2020 నుండి 16.03.2020 తేదీల మధ్య ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో లభిస్తాయి మరియు పైన తెలిపిన తేదీల మధ్య ప్రచురణ తేది నుండి 07 రోజుల కోసం లభిస్తాయి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- రీజనల్ ఆఫీసర్ (PR), రీజనల్ ఆఫీస్, ఆదిలాబాద్
DIPR Ro.No.2605-DP/CL/ADVT/1/2019-20, Dt:06/03/2020

Government of India
Ministry of Agriculture & Farmers Welfare
(Department of Agriculture Cooperation & Farmers Welfare)
Southern Region Farm Machinery Training and Testing Institute
Tractor Nagar, Garladinne- 515 731. District: Anantapur (A.P.)
[An ISO 9001:2015 Certified Institute]
Phone: 08551 286441 E-mail: fmti-sr@nic.in
Advertisement No. SRFMTTI/01/2019
RECRUITMENT NOTICE
Applications are invited from eligible candidates for filling up of 01 (One) vacant post of "Technician" (UR-1) Group 'C' (Non-Gazetted) (Non Ministerial) in Level-2 (Rs. 19900-63200) in the pay matrix through Direct Recruitment basis at Farm Machinery Training & Testing Institutes (FMT&TIs), Subordinate offices of the Ministry of Agriculture and Farmers Welfare, Department of Agriculture, Cooperation and Farmers Welfare. Complete Recruitment Notice of Vacancy Circular, Application Format and the details of eligibility terms and conditions are all available on the FMT&TIs' websites: www.fmttibudni.gov.in , www.nrfmtti.gov.in, www.srfmtti.dacnet.nic.in, www.nerfmtti.nic.in, and Department of Agriculture, Cooperation and Farmers Welfare website: agricoop.nic.in
Dated: 03/03/2020 (Dr. P.P.Rao) DIRECTOR

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీస్: కొత్తగూడెం కాలరీస్ - 507 101
నోటీస్
శ్రీ నిట్టూరి రత్నాకర్ రావు, ఇ.సి.నెం. 2930582, వృత్తి బదిలీ ఫిట్టర్, పనిచేయు స్థలము : ఆర్.కే. 6 గని అడ్రస్సు : ఇ.నెం. టి-1, 259, 8 ఇంక్లైన్ కాలనీ, పోస్ట్: గోలావరిఖని, జిల్లా పెద్దపల్లి, తెలంగాణ
షో కాజు నోటీసు నెం. Ref: No.SRP/RK6/R06/R010/267, dt: 07.01.2019
పైన తెలుపబడిన చార్జ్ షీటు ప్రకారము మీరు 2018వ సంవత్సరములో ఏ విధమైన మంజూరు కాని సెలవు / సరియైన కారణము లేకుండా విధులకు గైరు హాజరు అయినందువలన కంపెనీ నియమ నిబంధనావళిలోని క్లాజు 25:31 ప్రకారము తగిన కారణము లేకుండా కాని మంజూరు కాని సెలవుపై కాని / మంజూరైన సెలవుకు మించి ఎక్కువ కాలము గాని విధులకు గైరుహాజరు గా పరిగణించబడి మీపై క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో తెలుపుతూ మీకు చార్జ్ షీటు ఇవ్వడమైనది. తదుపరి ఇన్క్వైరీ షీటుపై విచారణ ప్రక్రియ కొనసాగించుట కొరకు విచారణ నోటీసులను మూడు మార్లు మీకు ప్రస్తుత / శాశ్వత చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించడము జరిగింది. ఇన్క్వైరీ విచారణ నోటీసులను మీరు స్వీకరించనందున విచారణ నోటీసును పత్రికాప్రకటన ఇవ్వడమైనది. తదనుగుణంగా మీరు తేది: 26.12.2019 రోజున ఉదయము 10:00 గం.లకు మేనేజర్ గారి కార్యాలయములో విచారణకు హాజరు కావలెనని పేపర్ ప్రకటన (తేది: 03.12.2019 ఆంధ్రజ్యోతి తెలుగు వార్తా పత్రిక) ద్వారా తెలియపరచడమైనది. కాని మీరు అట్టి విచారణకు కూడా హాజరు కానందున అందుబాటులో గల సాక్షులు, సాక్ష్యాధారాలనుపరించి పరోక్షముగా (ఎక్స్ - పార్టీ) విచారణ జరపడమైనది.
తదుపరి 2వ షోకాజు నోటీసును నెం. SRP/RK6/R06/R010/267, dt: 07.01.2019 తో విచారణ ప్రక్రియ మరియు విచారణ నివేదిక ప్రతులను జతపరుస్తూ మీ యొక్క ప్రస్తుత / శాశ్వత చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా బట్వాడా చేయడము జరిగినది. కాని మీరు అట్టి వాటిని స్వీకరించనందున తపాలా శాఖవారు తిరిగి మేనేజర్ ఆర్.కె.6 గని కార్యాలయమునకు వాపసు చేయడము జరిగినది.
కనుక వివరగా మీకు పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచడమేమనగా ఈ ప్రచురణ వెలువడిన ఏడు (7) రోజులలోగా మీరు గని మేనేజర్ గారి కార్యాలయములో హాజరు అయి అట్టి నివేదిక పై ఏమైనా విన్నవించుకొనుయెడల విధిత పూర్వకంగా సమర్పించుకోవలసినదిగా మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. లేనిచో తదుపరి తగు చర్య తీసుకోబడునని తెలియజేయడమైనది.
Sd/- జనరల్ మేనేజర్, శ్రీరాంపూర్
PR/2019-20/SRP/LWA/123

మార్పునకు ముందడుగు

ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

పట్టణ ప్రగతి ఫలితాలపై సమీక్షలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పట్టణాల మార్పే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన తొలి విడత పట్టణ ప్రగతి విజయవంతమైందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు ప్రకటించారు. పట్టణాల్లో గుణాత్మక మార్పునకు తొలి అడుగుగా భావిస్తున్నామని, మార్పుదిశగా ఒక ముందడుగు పడిందన్నారు. 10 రోజుల పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. అది ముగిసిన అనంతరం పట్టణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం పురప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన కొత్త మున్సిపల్ చట్టంపై ప్రజల్లో అవగాహన కలిగించడంలో పట్టణ ప్రగతి విజయం సాధించిందన్నారు. నగరంలోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో శుక్రవారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్లతో సమావేశమై పట్టణ ప్రగతి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రగతి కార్యక్రమం కోసం పని చేసిన ప్రతి ఒక్క పురపాలక శాఖ ఉద్యోగికి, ఇతర శాఖ ఉద్యోగులకు పురపాలక శాఖ తరపున కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తక్షణమే పారిశుద్ధ్యం వంటి సమస్యలను పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని భవిష్యత్తులో ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటి కోసం వార్డు కమిటీలతో పాటు పట్టణ ప్రజలను భాగస్వాములను చేస్తూ, వారిని నిరంతరం చైతన్యం పరుస్తూ ముందుకు పోవాలన్నారు.

పట్టణ ప్రగతిపై ఆరా....

పట్టణ ప్రగతి నిర్వహించిన తీరును జిల్లాల వారీగా అదనపు కలెక్టర్లతో ఆరా తీశారు. కొత్త పురపాలక చట్టం తప్పనిసరి చేసిన ప్రాథమిక కార్యక్రమాల ఆమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వార్డు పారిశుద్ధ్య ప్రణాళిక, పట్టణ/నగర పారిశుద్ధ్య ప్రణాళిక, పట్టణ వాటర్ ఆడిట్, పట్టణ హరిత ప్రణాళిక వంటి వాటిపై ప్రధాన దృష్టిసారించాలన్నారు. ప్రస్తుత మున్సిపాలిటీలో ఉన్న మౌళిక వసతులు, పౌర సౌకర్యాలపై ఒక సంపూర్ణ నివేదిక రూపొందించాలన్నారు. అదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఒక రోడ్ మ్యాప్ రూపొందించుకుని, ఆ దిశగా పనిచేయాలన్నారు. మోడల్ మార్కెట్లు, పార్కులు, డంపుయార్డులు, పబ్లిక్ టాయిలెట్లు, స్ట్రీట్ వెండింగ్ జోన్లు, నర్సరీలు, శ్మశాన వాటికలు, అర్బన్ లంగ్ స్పేసెస్, ఓపెన్ జిమ్స్ మొదలైన సౌకర్యాలు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు.వచ్చే 4 ఏళ్లలో దశల వారీగా ఈ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అడిషనల్ కలెక్టర్‌కు తన పరిధిలోని అన్ని మున్సిపాలిటీల గురించి అమూలాగ్రం తెలిసి ఉండాలన్నారు. మరోసారి పురపాలికలపై సమీక్ష నిర్వహిస్తామన్న మంత్రి, ఆ సమావేశం నాటికి పూర్తి స్థాయి ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు.

సీఎల్పీలో 'పని విభజన'

- ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఎమ్మెల్యేలకు శాఖల కేటాయింపు
- త్వరలోనే జిల్లాల పర్యటనలకు సీఎల్పీ బృందం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) పని విభజన చేసుకుంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసేందుకుగాను పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు శాఖలవారీ బాధ్యతలను అప్పగించింది. ఆయా ఎమ్మెల్యేలకు కేటాయించిన శాఖల్లోని ప్రభుత్వ వైఫల్యాలను సభలో ఎండగట్టేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించి ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆ పార్టీ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సీతక్క, పొడెం వీరయ్యలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎల్పీ తరఫున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. నిరుద్యోగులు, రైతుల సమస్యలు (భట్టి, శ్రీధర్‌బాబు), డబుల్ బెడ్‌రూం ఇళ్లు (జగ్గారెడ్డి), పురపాలక, నీటిపారుదల, బెల్ట్‌షాపులు, పబ్‌లు (కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి), విద్య, గిరిజన సంక్షేమ (సీతక్క, పొడెం వీరయ్య) శాఖలపై అధ్యయనం చేసి ఆయా అంశాల్లో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించారు. అదే విధంగా అసెంబ్లీ సమావేశాల అనంతరం జిల్లాల వారీ పర్యటనలు చేయనున్నారు. నెలకొక నియోజకవర్గం చొప్పున పర్యటించాలని, ముందుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని నిర్ణయించారు.

రేవంత్ అరెస్టు అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం: కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్ : మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అరెస్టు అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. రేవంత్ అరెస్టును కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డిలతో కలసి మాట్లాడుతూ ఒక ఎంపీ డ్రోన్ కెమెరా ఉపయోగించారని కేసులు పెట్టడం వింతగా ఉందని, జనం నవ్వుకుంటున్నారని చెప్పారు. 111 జీవోకు అక్రమంగా మూడంతస్తుల భవనాన్ని నిర్మించుకున్న మంత్రి కేటీఆర్ చేసింది అక్రమమో కాదో తేల్చాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ జీవో పరిధిలో సామాన్యులు, రైతులు నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో ఉల్లంఘనపై గ్రీన్‌ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.వేల కోట్ల విలువైన భూఆక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోపనపల్లి భూముల విషయంలో రేవంత్, ఆయన సోదరుడు తప్పు చేస్తే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించిన కోమటిరెడ్డి రాజకీయ కక్షతోనే ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, తెలంగాణలో కేవలం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని అన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ హక్కులకు భంగం కలిగిస్తూ రేవంత్‌ను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమన్నారు.

కేసులను ఎత్తివేయాలి: కుంతియా

సాక్షి, హైదరాబాద్: మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం టీఆర్ఎస్ ప్రభుత్వ పాశవిక పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా ఆరోపించారు. రేవంత్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ జీవో 111 పరిధిలో లక్ష అడుగుల భవనాన్ని నిర్మించారా? లేదా? అది నిబంధనలకు విరుద్ధంగా ఉందా.. లేదా.. అనే విషయాలు ప్రకటించి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. టీఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అక్రమాలు, కేసీఆర్ కుటుంబ సభ్యుల అవినీతిని ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న రేవంత్‌పై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రేవంత్ పోరాటానికి ప్రజల మద్దతు ఉందని, ఆయనకు పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కాగా, రేవంత్ అరెస్టును ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

అరెస్ట్‌ను ఖండిస్తున్నా: గులాం నబీ

టీఆర్ఎస్ పార్టీ నాయకుల అవినీతి, వారు చేపడుతున్న అక్రమ కట్టడాలపై గొంతెత్తిన మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక చర్యలు గర్హనీయమని ఆరోపించారు. రేవంత్‌ను వెంటనే విడుదల చేసి అక్రమ కట్టడాల్లో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్ బెయిల్ పిటిషన్ వాయిదా

హైదరాబాద్: ఎంపీ రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను ఉప్పర్‌పల్లిలోని 16వ అడిషనల్ మెట్రో పాలిటన్ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాది పాండురంగారెడ్డి బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి సంతోష్‌కుమార్ విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే కేసులో జైలులో ఉన్న మరో ఆరుగురి కోసం వేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి పరిశీలించి బెయిల్ మంజూరు చేశారు. జన్వాడలోని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంధువుల ఫాంహౌస్ వద్ద అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలతో పరిసరాలను చిత్రీకరించిన కేసులో రేవంత్‌రెడ్డితోపాటు మరికొంత మంది నాయకులపై కేసు నమోదవడం తెలిసిందే.

సాగు కాదు.. తాగు అవసరాలకే!

గోదావరికి వరద అధికంగా ఉండే రోజుల్లోనే తమిళనాడుకు తాగునీరు

- సాగు అవసరాలకు నీరివ్వాలన్న ప్రతిపాదనకు సీఎం కేసీఆర్ తిరస్కరణ
- పైపులైను ద్వారా సుమారు 50-60 టీఎంసీల నీటి తరలింపునకు ఓకే
- సాధ్యాసాధ్యాలపై అధికారుల స్థాయి భేటీ తర్వాత మూడు రాష్ట్రాల సీఎంలు భేటీ

సాక్షి, హైదరాబాద్: పొరుగు రాష్ట్రాలతో సఖ్యత, సహకారం కోరుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా మరో కీలక ముందడుగు వేయనుంది. తీవ్ర నీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్న తమిళనాడు తాగునీటి అవసరాలను తీర్చే దిశగా లోతైన అధ్యయనం చేసి సమస్యకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. గోదావరి బేసిన్‌లో రాష్ట్ర తాగు, సాగు అవసరాలు తీరాక, వృథాగా సముద్రంలోకి వెళ్తున్న నీటిలో నుంచే కొంత నీటిని తమిళనాడు తాగునీటి అవసరాలకు ఇవ్వాలని తెలంగాణ సూత్రప్రాయంగా నిర్ణయించింది. కేంద్రం ప్రతిపాదించిన గోదావరి-కావేరీ నదుల అనుసంధాన ప్రక్రియతో సంబంధం లేకుండా తాగునీటి అవసరాలకే పరిమితమవుతూ సహకార ధోరణితో తమిళనాడుకు చేయూతనిచ్చే దిశగా బాటలు వేసింది.

సాగుకైతే నో.. తాగుకైతే ఓకే..

ఏటా వేసవి చైన్నె నగర తాగునీటి కష్టాలు తీర్చేందుకు రైల్వే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వస్తోంది. గతేడాది వేసవిలో బక్కెట్ నీటికి కూడా తన్నుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కష్టాల నుంచి గట్టెక్కించే క్రమంలో ఏప్రిల్ 18, 1983లో తమిళనాడుతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఒప్పందం మేరకు.. చెన్నైకి తాగునీటి అవసరాల కోసం కృష్ణా బేసిన్‌లోని కర్ణాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు చెరో 5 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ వాటా కింద 3.3, తెలంగాణ వాటా కింద 1.7 టీఎంసీలు విడుదల చేయాలన్న ఒప్పందం ఉంది. అయితే ఏటా చెన్నై తాగునీటి అవసరాలకు 3 నుంచి 8 టీఎంసీలకు మించి నీటి విడుదల కావట్లేదు. దీంతో తాగునీటి కష్టాలు తీరడం కష్ట సాధ్యమవుతోంది. దీని దృష్ట్యా కేంద్రం, గోదావరి-కావేరీ నదుల అనుసంధాన ప్రక్రియను తెరపైకి తెచ్చింది. ఈ అనుసంధానం ద్వారా కనీసం 200 టీఎంసీల నీటిని తమిళనాడు తాగు, సాగు అవసరాలను తీర్చాలని నిర్ణయించింది. దీనికి రూ.60 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. అయితే ఈ ప్రతిపాదనకు ఓవైపు ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం చెబుతుండగా, తెలంగాణ, ఏపీలు సైతం తమ అవసరాలు పోయాకే మిగిలిన నీటిని తరలించాలని వాదిస్తున్నాయి. దీంతో ఈ పథకం పట్టాలెక్కట్లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు మంత్రుల బృందం కేంద్ర ప్రతిపాదనను ఆమోదించి, తమిళనాడు కష్టాలు తీర్చాలని సీఎం కేసీఆర్‌ను కలిసింది. అయితే సాగు అవసరాలను తెరపైకి తెస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకోవని, అదీకాక సాగు అవసరాలంటే కేంద్ర సంస్థల నుంచి అనుమతులు అనివార్యం అవుతాయని సీఎం చెప్పినట్లు సమాచారం. అదే తాగు అవసరాలకైతే పొరుగు రాష్ట్రాలు సహా, కేంద్రం సహకారం అందిస్తాయని సలహా ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే కృష్ణాలో తగినంత నీటి లభ్యత లేనందున గోదావరి నీటిని, అదీ వరద ఎక్కువగా ఉండి వృథాగా సముద్రంలోకి వెళ్తున్న సమయంలోనే 50 నుంచి 60 టీఎంసీల నీటిని తమిళనాడుకు తరలిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అయితే గోదావరి నుంచి నీటిని ఏ విధంగా తీసుకెళ్లాల

లక్షకి చేరువలో..

- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కోవిడ్ కేసులు
- ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలన్న డబ్ల్యూహెచ్‌వో

ఉమ్రా యాత్రను రద్దు చేయడంతో నిర్మానుష్యంగా ఉన్న మక్కా మసీదులోని కాబా ప్రాంతం

బీజింగ్: కరోనా వైరస్ కేసుల సంఖ్య రోజు రోజుకీ పెరిగి పోతోంది. ప్రపంచవ్యాప్తంగా కేసుల సంఖ్య ఇంచుమించుగా లక్షకి చేరుకుంది. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు కరోనా కట్టడికి మరిన్ని పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రెయేసస్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ''ఇదేమీ డ్రిల్ కాదు. వెనకడుగు వేసే విషయం కాదు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అంశం అసలే కాదు. ఈ తరహా ముప్పు ఎదుర్కోవడానికి దశాబ్దాలుగా దేశాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. వాటి అమలుకు సమయం వచ్చింది''అని అన్నారు. అమెరికా, యూరప్‌లలో కూడా కరోనా మృతులు పెరగడం, కేసులు పెరిగిపోవడం చూస్తే ఆ దేశాలేవీ సన్నద్ధంగా లేవన్న విషయం అవగతమవుతోందని అన్నారు. ధనిక, పేద అన్న దేశాల తేడా లేకుండా కరోనా వైరస్ ఎదుర్కోవడం అన్ని దేశాలకు ప్రమాదకరంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ దేశాలు చికిత్స కంటే నివారణే మార్గం అన్నది తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఏ మాత్రం వెనకడుగు వేయొద్దని గట్టిగా చెప్పారు.

చదువుకు సోకిన వైరస్

కరోనా వైరస్ ప్రభావంతో మొత్తంగా 13 దేశ్లాలో 29 కోట్ల మంది పిల్లలు బడికి దూరమయ్యారని యునెస్కో వెల్లడించింది. పిల్లలకి వైరస్ సోకకుండా పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో కోట్లాదిమంది చదువులపై ప్రభావం చూపించిందని తెలిపింది. ఆరోగ్యపరంగా ఇలా బడికి సెలవులు ఇవ్వడం సాధారణమే అయినా ఎక్కువ కాలం కొనసాగితే విద్యాహక్కుకి భంగం వాటిల్లుతుందని యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆంద్రీ అజౌలే అన్నారు.

భారత్‌లో 31కి చేరుకున్న కేసులు

ఢిల్లీలో మరొకరికి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ కావడంతో 16 మంది ఇటలీ టూరిస్టుల సహా కరోనా కేసుల సంఖ్య 31కి చేరుకుంది. థాయ్‌లాండ్, మలేసియాల నుంచి వచ్చిన వ్యక్తికి కోవిడ్ సోకిందని ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఆ రోగిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని, పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. జనం ఒకేచోట భారీగా గుమికూడే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించింది. వాయుసేనలో కూడా అధికారిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు సోనియా లేఖ

కరోనా వ్యాప్తిని అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ లేఖ రాశారు. ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించే వారికి అన్ని రకాలుగా సాయం అందించాలని కోరారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ సమర్థవంతంగా పనిచేయాల్సిన తరుణమిదేనని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

వాఘా సరిహద్దులో రిట్రీట్ సందర్శనకు నో

భారత్, పాకిస్తాన్ వాఘా సరిహద్దుల్లో ప్రతీరోజూ సాయంత్రం సరిహద్దు రక్షణ బలగాలు (బీఎస్ఎఫ్) నిర్వహించే రిట్రీట్‌కు శనివారం నుంచి సందర్శకులకు అనుమతి లేదు. అణువణువున దేశభక్తి ఉప్పొంగే ఈ కార్యక్రమం చూడడానికి భారీ ఎత్తున ప్రజలు అక్కడికి వస్తారు. కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సందర్శకులకు అనుమతినివ్వకూడదని బీఎస్ఎఫ్ నిర్ణయించింది. కొన్నాళ్ల పాటు ఒకేచోట జన సందోహాలు గుమికూడవద్దన్న ప్రభుత్వ సూచన మేరకు సందర్శకుల్ని అనుమతించబోమని బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

- ప్రపంచవ్యాప్తంగా 89 దేశాల్లో 3,404 మంది మరణించారు. 99,464మందికి వైరస్ సోకింది.
- చైనాలో శుక్రవారం 143 కేసులు నమోదైతే, 30 మంది మరణించారు. మృతుల సంఖ్య 3,042కి చేరుకుంది.
- చైనా తర్వాత దక్షిణ కొరియా, జపాన్, ఇరాన్, అమెరికా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌లలో కరోనా ప్రభావం ఉంది.
- భూటాన్, సెర్బియా, కామరూన్, వాటికన్ సిటీలో కొత్తగా కరోనా కేసులు వెలుగు చూశాయి. పోప్ ఫ్రాన్సిస్ అస్వస్థతకు లోనయ్యారు. ఆయనకు కేవలం జలుబు మాత్రమే ఉంది. నెదర్లాండ్స్‌లో ఓ వృద్ధుడు చనిపోయారు.
- భూటాన్‌లో అమెరికా టూరిస్ట్‌కి కరోనా వైరస్ ఉన్నట్టు తేలిందని భూటాన్ ప్రధాని వెల్లడించారు.
- అమెరికాలో 14 మంది ఇప్పటివరకు మరణించారు. కేసుల సంఖ్య 230కు పెరిగింది. కరోనాను ఎదుర్కొనేందుకు అమెరికా భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు 8.3 బిలియన్ డాలర్లను కేటాయిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకం చేశారు. ఈ నిధులను వాక్సిన్ల తయారీ, పంపకం, పరీక్షల కోసం వినియోగించనున్నారు.
- ఇరాన్‌లో 3,500 కేసులు నమోదై, 107 మంది మృతి చెందారు. పేపర్ కరెన్సీ వాడొద్దని ప్రజలను కోరింది.
- ఆస్ట్రేలియాలో కరోనా కేసుల సంఖ్య 61కి చేరుకుంది. వ్యాధి నివారణకు 100 కోట్ల డాలర్లు కేటాయించింది.

వుహాన్ కాదు ఘోస్ట్ సిటీ

రెండు నెలల క్రితం వరకు ఉత్తేజంతో ఉరకలేసే నగరం. ఇప్పుడు శ్మశాన నిశ్శబ్దాన్ని తలపిస్తోంది. జన సంచారం లేని వీధులు, వాహనాల అలికిడి లేని రోడ్లు, మూసివేసిన దుకాణాలు కరోనా ప్రభావంతో వూహాన్ ఒక ఘోస్ట్ సిటీగా మారిందని చైనా నుంచి భారత్‌కు వచ్చిన ఆశిష్ కుర్మి అనే ఎంబిబిఎస్ విద్యార్థి వెల్లడించారు. కోవిడ్-19 తొలి కేసు డిసెంబర్ 8, 2019న బయటకు వచ్చినప్పటికీ, జనవరి మొదటి వారం వరకు దాని ప్రభావం ఇంత తీవ్రంగా ఉంటుందని ఎవరూ ఊహించలేదని అన్నారు. మొదట్లో జనజీవనం సాధారణంగానే ఉందని రాను రాను నిషేధాలు మొదలయ్యాయని చెప్పారు. భారత్‌కు వచ్చాక కూడా తమను 14 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, వైరస్ సోకలేదని నిర్ధారణయ్యాక విడుదల చేశారని చెప్పారు. మహారాష్ట్రలో లాతూర్ జిల్లాకు చెందిన ఆశిష్ ఒక ప్రైవేట్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ వూహాన్ రోడ్లపై శవాలు పడి ఉన్న వీడియో ఫేక్ అని చెప్పారు. తాను భారత్ వచ్చాక ఆ వీడియో చూశానని తెలిపారు.

- చికిత్స సమయంలో కరోనా రోగుల హక్కుల్ని కాపాడ వలసిన అవసరం ఉందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ మిషెల్ బాచెలెట్ అన్నారు. మనుషుల మర్యాద, వారి హక్కుల్ని అన్ని దేశాలు కాపాడాలన్నారు.

31 ఏళ్ల క్రితమే కరోనా వార్త !

సాక్షి బెంగళూరు: ప్రస్తుతం ప్రపంచమంతటా కరోనా వైరస్ గురించి వార్తలు, వదంతులే వినిపిస్తున్నాయి. దాదాపు 30 ఏళ్ల కిందట ఈ వైరస్ గురించిన సమాచారం 1989లో 'తరంగ' అనే వార పత్రికలో ప్రచురితమైంది. అప్పట్లో అందులో కరోనా సహా వివిధ రకాల వైరస్‌ల గురించిన సమాచారాన్ని పొందుపరచారు. తరంగ పాఠకులు కొందరు ఈ పేజీని ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో పోస్టు చేయగా.. వైరల్‌గా మారింది.

- ఆస్ట్రేలియాలో కరోనా నేపథ్యంలో టాయిలెట్ పేపర్లు ఎక్కడ దొరకవేమోనని భారీగా కొనుగోలు చేసి పెట్టడంతో బహిరంగ మార్కెట్‌లో వీటికి కొరత ఏర్పడింది. దీంతో ఎన్‌టీ న్యూస్ గురువారం అదనంగా ఎనిమిది పేజీలతో పేపర్‌ని వాటర్ మార్క్‌తో ముద్రించి, దానిని టాయిలెట్ పేపర్‌గా వాడుకోవాలంటూ ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ పేపర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లక్షల్లో ఈ వీడియో చూసిన వాళ్లంతా ఆ పత్రిక ఆలోచన తమకు యమాగా నచ్చేసిందని కామెంట్లు పెడుతున్నారు.

బయో మెట్రిక్‌కు విరామం

కరోనా వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణం కరచాలనమేనని వైద్య నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. అన్ని మంత్రిత్వ శాఖల్లో బయోమెట్రిక్ విధానాన్ని కొద్ది రోజులు నిషేధం విధించింది. ఉద్యోగుల హాజరు కోసం వినియోగించే బయోమెట్రిక్ విధానం వల్ల వైరస్ వ్యాప్తి చెందుతుందని, అందుకే మార్చి 31 వరకు ఈ విధానాన్ని వాడొద్దని పేర్కొంది. రిజిస్టర్‌లో పేరు రాస్తే సరిపోతుందని సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

క్లుప్తంగా...

ఈ టాయిలెట్ బ్రాహ్మణులకు మాత్రమే..

త్రిస్సూర్: కేరళలోని కుట్టుముక్కు మహదేవ దేవస్థానానికి చెందిన టాయిలెట్లలో ఒకటి బ్రాహ్మణులు మాత్రమే వినియోగించాలని రాసి ఉండటం కలకలం రేపింది. పురుషులు.. మహిళలు.. బ్రాహ్మణులు అంటూ మూడు బోర్డులతో మూడు టాయిలెట్లు ఉన్న ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు నెటిజన్లు దీనికి వ్యతిరేకంగా కామెంట్లు చేశారు. ఈ విషయం ఆలయ కమిటీ సభ్యుల వరకూ వెళ్లడంతో ఆ బోర్డును తొలగించి అర్చకులకు, ఉద్యోగులకు అని మార్చారు. దాదాపు 20 ఏళ్ల కిందట ఆ బోర్డు పెట్టారని, అది తమ నోటీసుకు రాలేదని కమిటీ సభ్యులు తెలిపారు.

భవనం కూలి 18 మంది మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని కరాచీలో భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య 18కి చేరుకుంది. మరణాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. గురువారం గుల్‌బహార్ ఏరియాలోని ఇరుకైన సందులోని మూడంతస్తుల భవనంలో మొదటగా పైఅంతస్తు కూలింది. ఆ ధాటికి భవనం మొత్తం పేకమేడలా నేలమట్టమయింది. అందులో ఉండే 18 మంది చనిపోగా 20 మంది గాయాలపాలయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, శిథిలాల కింద ఇంకొందరు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అఫ్గానిస్తాన్ ర్యాలీపై కాల్పులు

32 మంది మృతి, 29 మందికి గాయాలు

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నుంచి ఆ దేశ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లా తదితరులు త్రుటిలో తప్పించుకున్నారు. కాల్పులకు పాల్పడిన ఇద్దరిని బలగాలు హతమార్చాయి. అఫ్గానిస్తాన్‌లో తమ బలగాలను ఉపసంహరించుకునేందుకు అమెరికా.. తాలిబన్లతో చేసుకున్న ఒప్పందం తర్వాత జరిగిన తొలి భారీ ఘటన ఇదే. ఈ ఘటనతో తమకు సంబంధం లేదని తాలిబన్ తెలిపింది.

అఫ్గాన్‌లో మేం నిష్క్రమిస్తే తాలిబన్‌లదే అధికారం

వాషింగ్టన్: అమెరికా బలగాలు నిష్క్రమిస్తే తాలిబన్లు అఫ్గాన్ ప్రభుత్వం నుంచి అధికారాలు లాక్కునే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. అలా లాక్కోకూడదని, కానీ అదే జరిగే అవకాశం ఉందంటూ వ్యాఖ్యానించారు. 20 ఏళ్లుగా అక్కడే ఉంటూ రక్షిస్తున్నామని, ప్రభుత్వాలు తమను తాము కాపాడుకోవాలన్నారు.

మూడు ముప్పుల ముంగిట భారత్: మన్మోహన్ సింగ్

న్యూఢిల్లీ: సామాజిక అసహనం, ఆర్థిక మందగమనం, అంతర్జాతీయ ఆరోగ్య సంక్షోభం.. ఈ మూడింటి నుంచి భారత్ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మూడు ముప్పులు దేశ ఆత్మనే కాకుండా, ప్రతిష్టను కూడా నాశనం చేస్తున్నాయన్నారు.'ది హిందూ'కు రాసిన ఒక వ్యాసంలో ఈ ముప్పులకు పరిష్కారాలనూ సూచించారు. కోవిడ్-19ని కట్టడి చేయడం, పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవడం, లేదా సవరణ చేయడం, ఆర్థిక రంగ పునరుత్తేజం కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించడం.. ప్రభుత్వం తక్షణమే ఈ మూడు చర్యలను చేపట్టాలన్నారు.

ఆ సంస్థలకు విదేశీ విరాళాలను అడ్డుకోవద్దు

న్యూఢిల్లీ: రాజకీయ లక్ష్యాలేవీ లేని, ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తున్న సంస్థలను విదేశీ నిధులను స్వీకరించకుండా అడ్డుకోకూడదని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. ఆ సంస్థలు రాజకీయ ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజా సంక్షేమం కోసం ధర్నా, బంద్, రాస్తారోకో తదితర చట్టబద్ధమైన నిరసనల ప్రదర్శనలు నిర్వహించినప్పటికీ.. వాటిని రాజకీయ పార్టీలుగానో, రాజకీయ సంస్థలు గానో పరిగణించకూడదని పేర్కొంది. అలా పరిగణించి, విదేశాల నుంచి విరాళాలను స్వీకరించే చట్టబద్ధ హక్కును వాటికి దూరం చేయకూడదని తెలిపింది. ఆయా సంస్థలను విదేశీ నిధుల కోసం రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటే మాత్రం.. ఫారిన్ కంట్రిబ్యూషన్(రెగ్యులేషన్) చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) నుంచి తప్పించుకోలేరని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం తేల్చి చెప్పింది. ఆయా సంస్థలు విదేశీ నిధులు స్వీకరించే హక్కును అడ్డుకునేముందు ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలను కేంద్రం కచ్చితంగా అనుసరించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఈ చట్టం ప్రకారం.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, పార్టీల ఆఫీస్ బేరర్లు విదేశీ నిధులను స్వీకరించకూడదు. రాజకీయ, లేదా రాజకీయ లక్షణాలున్న సంస్థలు విదేశీ నిధులు అందుకోకూడదు' అని కోర్టు పేర్కొంది. ఎఫ్‌సీఆర్‌ఏలోని 5(1), 5(4) సెక్షన్ల రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ 'ఇండియా సోషల్ యాక్షన్ ఫోరం(ఇన్సాఫ్)' అనే స్వచ్ఛంధ సంస్థ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు పై వివరణ ఇచ్చింది. ఒక సంస్థను రాజకీయ సంస్థగా నిర్ధారించే అపరిమిత అధికారం ఎఫ్‌సీఆర్‌ఏలోని 5(1), 5(4) సెక్షన్ల ద్వారా కేంద్రానికి దఖలు పడుతోందని, తద్వారా ఆ సంస్థలు విదేశీ నిధులను స్వీకరించకుండా కేంద్రం అడ్డుకుంటోందని, ఆ సంస్థ తన పిటిషన్‌లో ఆరోపించింది.

అవినీతి అధికారులకు నో పాస్‌పోర్టు

కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: సస్పెండ్ అయిన, అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారులకు పాస్‌పోర్ట్ జారీ చేయరాదని కేంద్రం ఆదేశాలిచ్చింది. అధికారులకు పాస్‌పోర్ట్ జారీ చేసే ముందు సీవీసీ నుంచి క్లియరెన్స్ పొందాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వ విభాగాల కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేసింది. సదరు అధికారి సస్పెన్షన్‌లో ఉన్నా, దర్యాప్తు సంస్థలు అతడిపై కోర్టులో చార్జిషీట్ వేసినా పాస్‌పోర్టు జారీని నిలిపివేయవచ్చని తెలిపింది. అతడికి లేదా ఆమెకు పాస్‌పోర్టు జారీ చేయవచ్చని పై అధికారి సూచించినప్పటికీ అవినీతి నిరోధక చట్టం కింద విజిలెన్స్ క్లియరెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాలను కోరింది. అతడుమెకు అనుమతి ఇవ్వడం వల్ల భారత్‌కు ఆ దేశంతో సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని, ప్రజోపయోగం కాదని భావించినా, మరే ఇతర కారణంతోనైనా పాస్‌పోర్టును నిరాకరించే అధికారం విజిలెన్స్ కమిషన్‌కు ఉందని తెలిపింది. పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న అధికారికి కోర్టు సమన్లు జారీ చేసినా, అరెస్టు వారెంట్లు ఇచ్చినా, ఆ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నా దేశం వదిలి వెళ్లరాదని ఏదైనా కోర్టు నిషేధం విధించినా కూడా పాస్‌పోర్టు ఇవ్వరాదని పేర్కొంది. ఇందుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలపై విదేశాంగ శాఖ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ)తో సమీక్ష జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిబ్బంది శాఖ తెలిపింది.

శుక్రవారం వారణాసిలో గంగా నది ఒడ్డున మణికర్ణిక ఘాట్‌లో చితాభస్మం చల్లుకుంటూ హోలీ జరుపుకుంటున్న భక్తులు

మళ్లీ న్యాయ హక్కులు ఇవ్వండి

మరోసారి 'సుప్రీం'కు నిర్భయ దోషి

న్యూఢిల్లీ: నిర్భయ కేసు దోషుల్లో ఒకరైన ముఖేష్ సింగ్ మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. న్యాయవాదులు తప్పుదోవ పట్టించిన కారణంగా న్యాయపరంగా తనకు ఉన్న హక్కులన్నింటినీ మళ్లీ దఖలుపరచాలని కోరుతూ ఎం.ఎల్ శర్మ అనే న్యాయవాది ద్వారా శుక్రవారం ఓ పిటిషన్ వేశారు. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం, కోర్టు సహాయకారిగా వ్యవహరించిన న్యాయవాది వృందా గ్రోవర్‌లు తనపై నేరపూరిత కుట్ర పన్నారని, మోసానికి పాల్పడ్డారని ఈ అంశాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కూడా ముఖేష్ తన తాజా పిటిషన్‌లో కోరారు. సుప్రీంకోర్టు తన క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టేసిన నాటి నుంచి న్యాయస్థానాలు ఇప్పటి వరకూ జారీ చేసిన అన్ని ఉత్తర్వులను కొట్టివేయాలని, రాష్ట్రపతి తన క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించడాన్ని కూడా రద్దు చేయాలని కోరాడు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపే అవకాశముంది.

సంతకాల కోసం బెదిరించారు

''కేంద్ర హోం శాఖ, ఢిల్లీ ప్రభుత్వం, వృందా గ్రోవర్‌తోపాటు సెషన్స్, హైకోర్టు సుప్రీంకోర్టుల్లో వాదించిన న్యాయమూర్తులు కలిసికట్టుగా పన్నిన కుట్రకు నేను బలయ్యాను. సెషన్స్ కోర్టు ఉత్తర్వులను బూచిగా చూపించి పలు పత్రాలపై సంతకాలు పెట్టించుకున్నారు' అని ముఖేష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేసేందుకు సంతకాలు పెట్టించాలని సెషన్స్ కోర్టు ఆదేశించినట్లు ప్రతివాదులు ముఖేష్ సింగ్‌తో చెప్పారని వివరించారు. ఈ రకమైన ఒత్తిడి/భయం కారణంగా తన కక్షిదారు వకాలత్‌నామాతో పాటు పలు ఇతర పత్రాలపై కూడా సంతకాలు చేశారని చెప్పారు. సెషన్స్ కోర్టు అలాంటి ఉత్తర్వులేవీ ఇవ్వలేదని తెలుసుకున్నానని అందుకే తన న్యాయహక్కులను పునరుద్ధరించాలని కోరారు. తీర్పుపై సమీక్షను తిరస్కరించిన తరువాత జూలై 2021లోపు క్యూరేటివ్, క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరాడు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- నుజ్జునుజ్జయిన రెండు కార్లు
- ఇద్దరు చిన్నారులు సహా 13 మంది దుర్మరణం

ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున తుమకూరు జిల్లాలోని కుణిగల్ తాలూకా బ్యాలదకెరె గేట్ వద్ద బెంగళూరు - మంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-75)పై ఈ ఘటన జరిగింది. రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఎస్‌యూవీ అనంతరం కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. గాయపడిన మరో నలుగురికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడులోని హోసూరుకు చెందిన మంజునాథ్ కుటుంబం ధర్మస్థలానికి వెళ్లింది. అనంతరం టవేరా వాహనంలో తిరుగు పయనమయ్యారు. ఇదే సమయంలో బెంగళూరు నుంచి బ్రిజా కారులో నలుగురు స్నేహితులు ధర్మస్థల వైపు వెళుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కుణిగల్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీలు కొడుతూ రోడ్డుకు అటువైపుగా దూసుకెళ్లి, అటు నుంచి వస్తున్న టవేరా వాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో ఇరు వాహనాల్లో ప్రయాణిస్తున్నవారిలో 13 మంది అక్కడికక్కడే మరణించారు. అమృతూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు కార్లలో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీశారు. పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఘటనపై అమృతూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రధాన సమాచార కమిషనర్‌గా బిమల్

బిమల్ జుల్కాను అభినందిస్తున్న రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ: ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా ప్రస్తుత సమాచార కమిషనర్ (ఐసీ) అయిన బిమల్ జుల్కా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జుల్కా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సమాచార కమిషనర్‌గా అమిత పండోవే బాధ్యతలు స్వీకరించారు. ఆమె చేత సీఐసీ జుల్కా ప్రమాణ స్వీకారం చేయించారు. అమిత సమాచార కమిషనర్ కావడంతో కేంద్ర సమాచార కమిషన్‌లో మొత్తం కమిషనర్ల సంఖ్య (సీఐసీతో కలిపి) 7కు చేరుకుంది. మాజీ సీఐసీ సుధీర్ భార్గవ జనవరి 11న పదవీ విరమణ చేసినప్పటి నుంచి సీఐసీ పోస్టు ఖాళీగానే ఉంది. సీఐసీ కాకుండా 10 మంది కమిషనర్లు ఉండాల్సిన కేంద్ర సమాచార కమిషన్‌లో కేవలం 6 మందే కమిషనర్లు ఉన్నారు. ప్రస్తుతం అమిత పండోవే నియామకం తర్వాత మరో 4 సమాచార కమిషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ గతంలో సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా పనిచేసిన జుల్కా పేరును సీఐసీ పదవికి, అమిత పండోవేను సమాచార కమిషనర్ పదవికి సూచించింది.

ఐదో రోజూ అడ్డుకున్నారు

- ఢిల్లీ అల్లర్లు, కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌పై విపక్షాల నిరసనలు
- పార్లమెంట్ ఉభయసభలు మార్చి 11వ తేదీకి వాయిదా

పార్లమెంటు ప్రాంగణంలో నిరసన సందర్భంగా చేతికి నల్ల బ్యాండ్ ధరించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలను విపక్షాలు వరుసగా ఐదో రోజూ అడ్డుకున్నాయి. ఢిల్లీ అల్లర్లపై, లోక్‌సభ నుంచి కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయడంపై శుక్రవారం విపక్ష సభ్యులు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. దాంతో, పలు వాయిదాల అనంతరం లోక్‌సభ, సభ ప్రారంభమైన పావుగంటకే రాజ్యసభ మార్చి 11వ తేదీకి వాయిదా పడ్డాయి.

లోక్‌సభ..: ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ఢిల్లీ అల్లర్లపై తక్షణమే చర్చ జరపాలని కాంగ్రెస్, డీఎంకే, ఐయూఎంఎల్ తదితర పార్టీల సభ్యులు వెల్‌లోనికి వచ్చి నినాదాలు చేశారు. ఢిల్లీ అల్లర్లపై 11న చర్చ జరుగుతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, స్పీకర్ స్థానాన్ని అవమానించారని పేర్కొంటూ గురువారం ఏడుగురు కాంగ్రెస్ సభ్యులను లోక్‌సభ నుంచి ఈ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ సహా పలు విపక్షాలు సభలో నిరసన తెలిపాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా చాలామంది విపక్ష సభ్యులు తమ చేతులకు నల్లని బ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలిపారు. గందరగోళం కొనసాగుతుండటంతో సభను స్పీకర్ స్థానంలో ఉన్న కిరిట్ సోలంకీ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత కూడా విపక్షం శాంతించలేదు. నినాదాల మధ్యనే ఖనిజ చట్టాల(సవరణ) బిల్లు, దివాలా కోడ్(సవరణ) బిల్లు ఆమోదం పొందాయి.

రాజ్యసభ..: సభ ప్రారంభం కాగానే తన శాఖకు సంబంధించిన పత్రాలను సభ ముందుంచేందుకు హోంశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ లేవగానే.. విపక్ష సభ్యులంతా గట్టిగా నినాదాలు చేశారు. ఢిల్లీ అల్లర్లపై చర్చకు పట్టుబట్టారు. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు చేసిన విజ్ఞప్తిని వారు పట్టించుకోలేదు. దీంతో సభను 11వ తేదీకి వాయిదా వేశారు.

జేబుదొంగకు ఉరిశిక్షా?

కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్‌పై ఆ పార్టీ నేత ఆధిర్ రంజన్‌చౌధురి సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చిన్న తప్పుకు పెద్ద శిక్ష వేశారన్న ఉద్దేశంతో.. 'జేబుదొంగకు ఉరిశిక్ష వేయకూడదు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యతో కాంగ్రెస్ సభ్యులు ఇబ్బందిగా ముఖం పెట్టగా, కొందరు పెద్దగా నవ్వేశారు. కాంగ్రెస్ సభ్యుడు చెప్పిన పోలిక వింతగా ఉందని, ఆ ఎంపీలను జేబుదొంగలతో పోల్చడం దురదృష్టకరమని మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. మరోవైపు, తమ ఎంపీల సస్పెన్షన్‌పై రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్లమెంట్ ప్రాంగణంల

సాక్షి
శనివారం, మార్చి, 7

యస్ బ్యాంకు సంక్షోభం

దేశవ్యాప్తంగా వేలాది శాఖలు, లక్షలాదిమంది డిపాజిటర్లు ఉన్న యస్ బ్యాంకు సంక్షోభంలో కూరుకుపోయింది. పర్యవసానంగా ఆ సంస్థ బోర్డును రద్దు చేయడంతోపాటు ఖాతాదారులు బ్యాంకు నుంచి తీసుకునే సొమ్మును రూ. 50,000కు పరిమితం చేస్తూ రిజర్వ్‌బ్యాంకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతానికైతే ఇది నెలరోజులు అమల్లో వుంటుందని ప్రభుత్వం చెబుతోంది. ఆ తర్వాతైనా పరిస్థితి చక్కబడుతుందో లేదో చూడాల్సివుంది. భారీ స్కాంతో పంజాబ్ మహారాష్ట్ర కో ఆపరేటివ్ (పీఎంసీ)బ్యాంకు కుప్పకూలి ఆర్నెల్లు దాటకుండానే ఒక పెద్ద బ్యాంకు చతికిలబడటం సాధారణ పౌరులకు బ్యాంకింగ్ రంగంపైనే సందేహాలు తలెత్తేలా చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ ప్రకటన వెలువడింది మొదలుకొని దేశవ్యాప్తంగా యస్ బ్యాంకు శాఖల ముందు వేలాదిమంది క్యూ కట్టారు. నెలంతా శ్రమించి, బ్యాంకులో పడే జీతం డబ్బులు అందుకోవడానికి సిద్ధపడుతున్న వేతన జీవులకు ఇదొక షాక్. ప్రాణావసరమైన వైద్యం కోసమో, పిల్లల ఉన్నత చదువుల కోసమో, బిడ్డ పెళ్లి చేయడానికో బ్యాంకులో పొదుపు చేసుకుంటూ వస్తున్న మధ్య తరగతి డిపాజిటర్లందరికీ ఇది ఊహించని పరిణామం. ఏ రంగంలోనైనా ప్రైవేటు నిర్వహణలో వుండే సంస్థలు సమర్థవంతంగా పనిచేస్తాయని, ప్రభుత్వ రంగ సంస్థల్లో అసమర్థత రాజ్యమేలుతుందని కొందరు నిపుణులు చేసే వాదనల్లో హేతుబద్ధత లేదని తాజా సంక్షోభం మరోసారి నిరూపించింది. యస్ బ్యాంకు సంక్షోభాన్ని గమనించి, అందులోని డిపాజిటర్ల ప్రయోజనాలు పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం తన వంతు చర్యలు మొదలుపెట్టడం సంతోషించదగ్గదే అయినా, పరిస్థితి ఇంతగా దిగజారేవరకూ పర్యవేక్షణ వ్యవస్థలు ఏం చేస్తున్నాయన్న ప్రశ్న తలెత్తుతుంది. పీఎంసీ సంక్షోభంతో ఖాతాదారులు రూ. 11,617 మేర డిపాజిట్లు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. కానీ దాంతో పోలిస్తే యస్ బ్యాంకు విస్తృతి చాలా ఎక్కువ. ఇంత పెద్ద బ్యాంకు ఉన్నట్టుండి చేతులెత్తేస్తే వ్యక్తులు మాత్రమే కాదు... దాంతో ఆర్థిక లావాదేవీలు సాగిస్తున్న అనేకానేక బ్యాంకులు, ఇతర సంస్థలు కూడా సంక్షోభంలో పడతాయి.

కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ ఆదేశాలతో ఈ నష్టజాతక బ్యాంకును ఆదుకోవడానికి ప్రభుత్వ రంగ సంస్థలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ)లు రంగంలోకి దిగుతున్నాయంటున్నారు. సంక్షోభాలు తలెత్తినప్పుడు డిపాజిటర్ల ప్రయోజనాలు పరిరక్షించడానికి చర్యలు తీసుకోవడం అవసరమే. అటు ఎస్‌బీఐ, ఇటు ఎల్‌ఐసీ పచ్చగా కళకళ్లాడుతున్నాయి గనుక ఈ బాపతు సంస్థల్ని ఆదుకోవడం వాటికి పెద్ద కష్టం కూడా కాకపోవచ్చు. యస్ బ్యాంకు చిక్కుల్లో పడింది కార్పొరేట్ నిర్వహణ సక్రమంగా లేకేనని, దాన్ని సరిచేస్తే చక్కబడుతుందని నిపుణులు కూడా చెబుతున్నారు. అది మళ్లీ పట్టాలెక్కితే ఇప్పుడు పెట్టుబడిపెట్టే సంస్థలకు లాభాల పంట పండుతుందంటున్నారు. అది నిజమే కావొచ్చు. కానీ అసలే అంతంత మాత్రంగా ఉన్న వర్తమాన ఆర్థిక మందగమనంలో అనుకోనిదేమైనా జరిగి, ఆ పెట్టుబడులు కాస్తా ఆవిరైతే? ఆ సంస్థలు పెట్టే పెట్టుబడులు కూడా ఎక్కడినుంచో ఊడిపడవు. సాధారణ డిపాజిటర్లు, పాలసీదారులు పొదుపు చేసే సొమ్ము నుంచే అవి పెట్టుబడులు పెట్టాలి. నష్టపోతే ఆ డిపాజిటర్ల, పాలసీదారుల హక్కుల్ని రక్షించేదెవరు? కనుకనే పెద్ద, చిన్న తేడా లేకుండా అన్ని రకాల ఆర్థిక సంస్థలపైనా పటిష్టమైన నిఘా వుండాలి. నిర్వాహకులు వాటిని సమర్థవంతంగా నడుపుతున్నారా లేదా అన్నది ఎప్పటికప్పుడు కనిపెడుతూ వుండాలి. యస్ బ్యాంకు డైరెక్టర్ల బోర్డులో ఆర్‌బీఐ ప్రతినిధి కూడా వుంటారు. ఆ బ్యాంకు నిర్వహణ సక్రమంగా లేదని రెండేళ్లక్రితమే బయటపడినప్పుడు, సంస్థలో వరస రాజీనామాలు జరుగుతున్నప్పుడు ఆర్‌బీఐ నిర్ణయాత్మకంగా ఎందుకు వ్యవహరించలేకపోయింది? దాన్ని పట్టాలెక్కించడానికి ఇన్నాళ్లుగా అది తీసుకున్న చర్యలేమిటి? విఫలమైవుంటే అందుకు బాధ్యులెవరు? రుణ వసూళ్లలో యస్ బ్యాంకు విఫలమవుతున్నదని, అందులో నిర్వహణపరమైన లోపాలు కొల్లలుగా వున్నాయని తేలినా, అది కొత్తగా రుణాలివ్వడాన్ని ఆర్‌బీఐ ఎందుకు నివారించలేకపోయింది? గత నాలుగైదేళ్లుగా బ్యాంకులిచ్చే రుణాలపై ఆర్‌బీఐ కఠినమైన నిబంధనలు విధించింది. సక్రమంగా, సమర్థవంతంగా బకాయిలను వసూలు చేయగలిగితేనే కొత్త రుణాల మంజూరుకు అనుమతినిస్తామని చెప్పింది. ఆ నిబంధనలతో ఇతర బ్యాంకులన్నీ సగటున 9 శాతం మించి కొత్త రుణాలివ్వలేదని గణాంకాలు చెబుతున్నాయి. కానీ యస్ బ్యాంకు మాత్రం 30 శాతం మేర రుణాలెలా ఇవ్వగలిగిందన్నది కీలకమైన ప్రశ్న. ఈ బ్యాంకు సంక్షోభం మూలాలు యూపీఏ ప్రభుత్వ హయాంలోనే వున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాట వాస్తవమే కావొచ్చు. కానీ తర్వాతైనా యస్ బ్యాంకుపై పర్యవేక్షణలో లోపాలెందుకు చోటుచేసుకున్నాయో, అందుకు బాధ్యులెవరో ప్రభుత్వం తేల్చాలి.

యస్ బ్యాంకు సంక్షోభం పర్యవసానంగానైనా మన ఆర్థిర రంగ సంస్కరణలకు చర్యలు ప్రారంభించాలి. ఇంతక్రితం గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకుతో మొదలెట్టి పలు బ్యాంకులు ఈ మాదిరిగానే సంక్షోభంలో చిక్కుకున్నాయి. అయినా వాటినుంచి మనం గుణపాఠాలు నేర్వలేదు. దానికి బదులు లాభాల్లో నడిచే సంస్థల నుంచి పెట్టుబడులు పెట్టించి తాత్కాలికంగా గండం నుంచి గట్టెక్కే మార్గాలు వెదకడం అలవాటైంది. ప్రభుత్వ రంగ సంస్థలు తమకేది ప్రయోజనమో, ఎక్కడ లాభాలొస్తాయో తెలుసుకుని పెట్టుబడులు పెట్టడం కాక, ఇలా పాలకులు చెప్పినట్టు చేయాల్సివస్తే అవి కూడా క్రమేపీ చిక్కుల్లో పడటం ఖాయం. సాధారణ పౌరుల్లో బ్యాంకింగ్ రంగంపై అవిశ్వాసం తలెత్తితే వాటిల్లో పొదుపు చేయడానికి వెనకాడతారు. అంతిమంగా ఇది ఆర్థికరంగ అవ్యవస్థకు దారితీస్తుంది. కనుక ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.ద్వాదశి ఉ.6.04 వరకు, తదుపరి త్రయోదశి తె.4.10 వరకు (తెల్లవారితే ఆదివారం), నక్షత్రం పుష్యమి ఉ.6.04 వరకు, తదుపరి ఆశ్లేష తె.4.55 వరకు (తెల్లవారితే ఆదివారం), వర్జ్యం సా.6.13 నుంచి 7.45 వరకు, దుర్ముహూర్తం ఉ.6.20 నుంచి 7.53 వరకు, అమృతఘడియలు... రా.3.21 నుంచి 4.32 వరకు.

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

మరో వ్యవసాయ విప్లవానికి బీజాలు

విశ్లేషణ

దేవీందర్ శర్మ

భారత్‌లో మొదలుకానున్న తదుపరి వ్యవసాయ విప్లవం దేశీయ ప్రాధాన్యతల మీదే ఆధారపడి ఉండాలి. దాదాపు 60 కోట్లమంది ప్రజలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నేటికీ వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్న దేశంలో, ఇప్పటికే పట్టణప్రాంతాలో ఉపాధి అవకాశాలు ఆవిరైపోయి, నిరుద్యోగం 45 ఏళ్లలో కనీవినీ ఎరుగని స్థాయికి పెరిగి ఉన్న నేపథ్యంలో ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండే వ్యవసాయాన్ని అమలు చేసినప్పుడే ఈ రంగంలో ప్రతిఏటా 12 లక్షల కొత్త ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. అధిక సంఖ్యలో రైతులను పట్టణాలకు తరిమి వారిని రోజుకూలీ కార్మికులుగా మారుస్తున్న విధానాలకు బదులుగా స్థానిక ఉత్పత్తిపై, స్థానికంగా ధాన్యసేకరణ, స్థానిక పంపిణీపై ఆధారపడిన ఆకర్షణీయమైన వ్యవసాయ నమూనాను అమలు చేయడం గురించి మన విధాన నిర్ణేతలు అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

యువతీయువకులు పూర్తిగా తమ ఆశలు, ఆకాంక్షలను వ్యక్తపరిచే వయస్సులో పంజాబ్‌లోని బర్నాలా జిల్లాకు చెందిన 22 ఏళ్ళ రైతు కూడా తనకున్న కొద్ది పాటి భూమిని విజయవంతమైన వెంచర్‌గా మార్చడానికి ప్రయత్నించారు. ఇప్పటికే రూ. 8 లక్షల రుణ భారంతో, తమ కుటుంబంలో వ్యవసాయం ప్రమాదఘంటికలను మోగిస్తోందని తెలిసినప్పటికీ, ఆ యువరైతు ఈ సవాలును చేపట్టాలని నిర్ణయించుకున్నారు. వ్యవసాయ వాణిజ్యం అనేది అనేక ప్రమాదాలతో కూడి ఉందని తెలుస్తున్నప్పటికీ సంవత్సరానికి రూ.50 వేల అద్దె చొప్పున మరో 8 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. కానీ 2017లో ఏపుగా పెరిగిన తన గోధుమ పంట ఆకస్మికంగా వచ్చిపడిన తుపానుకు దెబ్బతినిపోయింది. తన కలలు చెల్లాచెదురయ్యాయి. తనకు తగిలిన ఎదురుదెబ్బల నుంచి ఇక కోలుకోలేకపోయాడు. తీసుకున్న రుణం చెల్లించలేకపోయాడు. అప్పుఇచ్చినవారు వచ్చి గొంతుమీద కూర్చున్నారు. చివరకు ప్రాణాలు తీసుకోవడం తప్ప మరే దారీ లేదనుకున్నాడు.

అతడి పేరు లవ్‌ప్రీత్ సింగ్ తన వ్యవసాయ కుటుంబంలో మూడుతరాల్లో ప్రాణాలు తీసుకున్న అయిదో వ్యక్తి కావడం గమనార్హం. ఒకటిన్నర సంవత్సరం క్రితం తన తండ్రి కుల్వంత్ సింగ్ తనకు తాను ఉరివేసుకున్నాడు. అంతకుముందే తన తాత కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక పంజాబీ వ్యవసాయ కుటుంబంలో మూడు తరాలకు చెందిన వారు వ్యవసాయరంగ దుస్థితి కొనసాగింపు కారణంగా బలైపోయారు. అంటే మన దేశంలో వ్యవసాయరంగ సంక్షోభం ఎంత పాతుకుపోయిందో తెలుస్తోంది. చాలామంది ఇప్పటికీ నమ్మలేకపోవచ్చు కానీ హరిత విప్లవానికి కేంద్రంగా నిలిచిన పంజాబ్ మెల్లగా రైతుల ఆత్మహత్యల మృత్యుశయ్యగా మారిపోయింది.

పంజాబ్‌లోని మూడు ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలు జరిపిన అధ్యయనం ప్రకారం 2000 నుంచి 2015 వరకు పంజాబ్‌లో ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, కూలీల సంఖ్య 16,606 అని తేలింది. రాష్ట్రంలో ప్రతి ముగ్గురు రైతుల్లో ఒకరు దారిద్ర్య రేఖకు దిగువన ఉంటున్నారు. మహారాష్ట్రలో 2013-18 మధ్య ఆరేళ్లలో 15,356 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. జాతీయ స్థాయిలో 2016లో మొత్తం 11,379 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి ప్రతి ఏడాది జరుగుతున్న ఈ వరుస ఆత్మహత్యలు పంటపొలాల్లో మృత్యుదేవత విలయతాండవాన్ని నిత్యం ప్రదర్శిస్తూనే ఉన్నాయి.

రైతుల ఆత్మహత్యలు వ్యవసాయ రంగంలోని దుస్థితికి ప్రతిబింబం కాగా, దానికి దేశవ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్న ఆర్థిక రంగ విధానాల ఫలితమే కారణమని చెప్పాలి. ఆర్థిక సంస్కరణలు చెల్లుబాటు కావడానికి దేశంలో ఆహార ధరలను మొదటినుంచి తగ్గించివేశారు. వ్యవసాయ పంటల ధరలను క్షేత్రస్థాయిలో తగ్గిస్తే వినియోగదారులకు సరసమైన ధరల్లో అందించవచ్చు. పైగా రాజకీయ ప్రాధమ్యంలో భాగంగా పరిశ్రమకు ముడిపదార్థాల సరఫరా నిరంతరం తక్కువ ధరల్లో లభించేలా చూడవచ్చు. ఈ క్రమంలో ఆర్థిక భారం మొత్తంగా రైతులకు బదలాయించవచ్చు. వ్యవసాయ

రంగ నిజ ఆదాయాలు దశాబ్దాలుగా స్తబ్దంగా ఉండటం లేక మరింతగా పతనమవుతున్న నేపథ్యంలో వాస్తవానికి పోటీని మొత్తంగా రైతులకు వ్యతిరేకంగా ఫిక్స్ చేస్తున్నారు. హరిత విప్లవం ప్రారంభమైన 50 ఏళ్ల తర్వాత 2016 ఆర్థిక సర్వే చేదు వాస్తవాన్ని ముందుకు తీసుకొచ్చింది. దేశంలోని 17 రాష్ట్రాల్లో సగటు వ్యవసాయ కుటుంబం సగటు ఆదాయం సంవత్సరానికి రూ. 20 వేలుగా మాత్రమే ఉంటోంది. అంటే నెలకు రైతు సగటు ఆదాయం రూ.1,700లు మాత్రమే. ఏడాది కేడాది మన దేశ రైతు కుటుంబాలు ఇంత తక్కువ ఆదాయంతో ఎలా మనుగడ సాధిస్తున్నాయన్నది నివ్వెరపరుస్తుంది. అయితే ఆర్థిక సర్వే తెలిపింది సైతం రైతు అమ్ముతున్న పంటమీద వచ్చిన ఆదాయం మాత్రమే కాదు. గృహవినియోగం కోసం వారు ఆదా చేస్తున్న పంటను కూడా కలుపగా వచ్చే ఆదాయం అన్నమాట. వ్యవసాయ సంక్షోభం ఎంత లోతుగా ఉందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ ఆదాయాలు రానురాను పడిపోతున్నాయని అనేక ఇతర అధ్యయనాలు కూడా తెలుపుతున్నాయి.

భారతదేశంలో చిన్న కమతాలు అధికంగా ఉన్నాయన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే సన్నకారు రైతుల సమిష్టీకరణ జరిగితే రైతులకు బేరమాడే శక్తి పెరుగుతుంది. దీంతోపాటు వ్యవసాయ ఖర్చులను సామూహికంగా పంచుకోవడం, మెరుగైన వనరులు అందుబాటులోకి రావడం జరిగి రైతుపరిస్థితి బాగుపడుతుంది. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా కానీ, సహకార వ్యవసాయం ద్వారా కానీ చిన్నకమతాలు అభివృద్ధిపథంలో ముందుకెళతాయి. దృక్పథం ఏదైనప్పటికీ రైతులకు లాభదాయకంగా ఉండే ధరలను కల్పించడమే ఆదాయ భద్రతను కల్పిస్తుంది. రైతుల ఆదాయం, సంక్షేమం కోసం జాతీయ కమిషన్‌ని ఏర్పర్చడం ద్వారా దీన్ని సాధించవచ్చు. రైతు అందుకునే కనీస ఆదాయం ప్రభుత్వంలోని అత్యంత దిగువ తరగతిలో ఉన్న ఉద్యోగి పొందే కనీస ఆదాయం కంటే తక్కువగా ఉండకూడదన్నది దృష్టిపెట్టుకోవాలి. సమాజంలోని ఇతర సెక్షన్లతో ఆదాయాల్లో సమానత్వాన్ని తీసుకురావడం జరగాలంటే ప్రత్యక్ష నగదు మద్దతు, కొరత చెల్లింపులు అనేవి మంచి ప్రయత్నాలుగానే చెప్పాలి. ఏ దశలోనూ మార్కెట్లలోని అస్థిరత్వానికి రైతులు బలికాకూడదు.

పాశ్చాత్య దేశాల్లోని వ్యవసాయ విధానాల భారతదేశ వ్యవసాయ రంగానికి అవసరం లేదు. భారత్‌లో మొదలుకానున్న తదుపరి వ్యవసాయ విప్లవం దేశీయ ప్రాధాన్యతల మీదే ఆధారపడి ఉంటుంది. దాదాపు 60 కోట్లమంది ప్రజలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నేటికీ వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్న దేశంలో, ఇప్పటికే పట్టణప్రాంతాలో ఉపాధి అవకాశాలు ఆవిరైపోయి, నిరుద్యోగం 45 ఏళ్లలో కనీవినీ ఎరుగని స్థాయికి పెరిగి ఉన్న నేపథ్యంలో ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండే వ్యవసాయాన్ని అమలు చేసినప్పుడే ఈ రంగంలో ప్రతిఏటా 12 లక్షల కొత్త ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. అప్పుడు వ్యవసాయంపై అత్యధిక జనాభా ఆధారపడటం పెద్దగా భారమేమీ కాదు. అధిక సంఖ్యలో రైతులను పట్టణాలకు తరిమి వారిని రోజుకూలీ కార్మికులుగా మారుస్తున్న విధానాలకు బదులుగా స్థానిక ఉత్పత్తిపై, స్థానికంగా ధాన్యసేకరణ, స్థానిక పంపిణీపై ఆధారపడిన ఆకర్షణీయమైన వ్యవసాయ నమూనాను అమలు చేయడం గురించి మన విధాన నిర్ణేతలు అర్థం చేసుకోవలసి ఉంది.

మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా స్వావలంబనతో కూడిన వ్యవసాయ విప్లవానికి పథక రచన చేయడం చాలా ప్రాధాన్యత కలిగివుంటుంది. ప్రజారాశుల కోసం ఉత్పత్తి వ్యవస్థను ఏర్పర్చడం కాకుండా ప్రజారాశుల ద్వారా ఉత్పత్తి వ్యవస్థను ఏర్పర్చే పద్ధతి భారత్‌కు అవసరమని గాంధీ అప్పట్లోనే చెప్పారు. దేశంలోని సన్నకారు రైతులు ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే కోట్లాది వ్యవసాయ దారుల జీవితాన్ని నిలబెట్టడానికి ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికసించాలంటే, అన్నిటికంటే ముందుగా చేయవలసింది వ్యవసాయాన్ని లాభదాయకంగా, చెల్లుబాటయ్యే విధంగా మల్చాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే ఆర్థిక పురోగతి పేరిట వ్యవసాయాన్ని బలిపెడుతున్న విధానాలను దాటి పాలకులు ఆలోచించగలగాలి. ప్రభుత్వ రంగ మదుపులపై కోత విధించి వ్యవసాయ ధరలను కుదించి, బలవంతంగా వ్యవసాయ రంగనుంచి రైతులను తప్పించి నగరాలకు వలస వెళ్లేలా చేస్తున్న ప్రస్తుత విధానాలు స్వావలంబనతో కూడిన వ్యవసాయ అభివృద్ధికి ఏమాత్రం సరిపోవు.

ఆంధ్రప్రదేశ్ ఈ వైపుగా ఒక మార్గాన్ని ఇప్పటికే చూపించింది. కమ్యూనిటీ పరంగా నిర్వహించే స్వావలంబనతో కూడిన వ్యవసాయం, దానికనుగుణంగా జీరో బడ్జెట్ సహజ వ్యవసాయ విధానాల ద్వారా ఏపీలో ఇప్పటికే 5 లక్షలమంది రైతులు పునరుత్పాదక వ్యవసాయ విధానాలవైపు మొగ్గు చూపారు. అలాగే ఈశాన్య భారతాన్ని ఆర్గానిక్ వ్యవసాయ హబ్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉంది. వ్యవసాయ, పర్యావరణ అనుకూల సేద్య విధానాలను క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు కూడా అనువర్తింపజేయాలి. అలాంటి పరివర్తన జరగాలంటే కచ్చితంగా సవాలుతో కూడుకుని ఉంటుంది. కానీ స్వావలంబన, ఆర్థికపరంగా లాభదాయకతతో కూడిన సరికొత్త వ్యవసాయ విప్లవం మాత్రమే దేశీయ ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజం చేయగలుగుతుంది. నెల్సన్ మండేలా అన్నట్లు ఏ పనైనా సరే పూర్తి చేసేంతవరకు అది అసాధ్యమైనదిగానే కనిపిస్తుంది.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ-మెయిల్ : hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తీరు

"ఒక్కొక్కళ్ల విశ్లేషణ తీరు ఇలా ఉంటుంది. ఎస్ బ్యాంక్ సమస్యల్లో చిక్కుకుందని వార్త రాగానే..

రిపబ్లిక్ టీవీ: మన్మోహన్ బాధ్యుడు అనడానికి పది కారణాలు

జీ న్యూస్: ఎస్ బ్యాంక్‌లో డబ్బులను పోగొట్టుకోవడం వల్ల ఐదు ప్రయోజనాలు

ఏఎన్ఐ: ఎస్ బ్యాంక్ ఎగవేతదారుల్లో చాలామంది షహీన్‌బాగ్‌కు చెందినవారని తెలుస్తోంది:

టైమ్స్ నౌ: ఇప్పటికీ పాకిస్తాన్‌లో కంటే మన దగ్గరే ఎక్కువ బ్యాంకులు ఉన్నాయి"

– సుమంత్ రామన్, యాంకర్

నలుపు

"ఆ నల్ల మనిషి పోలీసులకు ఏమీ ఎదురు తిరగలేదు. కేవలం సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తిని పోలీసు అని ఎలా నమ్మాలని మాత్రమే అతను ప్రశ్నించాడు. అంతమాత్రానికే ఇతర పోలీసులంతా వచ్చి అతడిని దారుణంగా చితకబాదారు. ఈ దేశంలో నల్లవాళ్లు అసలు బతకడమే కష్టమైపోతోంది"

– స్టేన్స్ గ్రౌండెడ్, పౌరహక్కుల కార్యకర్త

వడ్డీ

"రెండేళ్ల క్రితం నా ఎస్ బ్యాంక్ అకౌంట్‌ను సకారణంగానే మూసివేశాను. వాళ్ల బ్యాంకులో నేను అకౌంట్‌ను కొనసాగించిన స్వల్పకాలంలో నాకు తగినంత వడ్డీ కూడా లభించిందని మా మేనేజర్ చెప్పాడు. ఆ తరువాత ఆ చెక్ కూడా అందింది. ఓ జ్ఞాపకంగా దాన్ని ఇప్పటివరకూ దాచి ఉంచా"

– సానియా అహ్మద్, రచయిత

దాడి

"డీసీపీ అమిత్ శర్మ మీద ముస్లిం గుంపులు దాడి చేసి ఎలా గాయపరిచాయో చూడండి. ఈయన్ని కాపాడబోయిన కానిస్టేబుల్ రతన్ లాల్‌ను వాళ్లు హతమార్చారు. చర్చలకు రమ్మని పిలిచిన ముస్లిం మహిళలు తన భర్తపై దాడి చేశారని డీసీపీ భార్య చెప్పారు. డీసీపీ స్థాయి అధికారికి పరిస్థితి ఇది. మీకు అర్థమవుతోందా?"

– షేఫాలీ వైద్య, రచయిత్రి

పరిస్థితి

"తరచూ జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రయాణిస్తూ, ఎస్ బ్యాంకులో లావాదేవీలు జరుపుతూ, డీహెచ్ఎఫ్ఎల్‌లో గృహరుణం తీసుకుని, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీలో పెట్టుబడులు పెట్టి, ఎస్సార్ స్టీల్, అనిల్ అంబానీ రిలయన్స్ కంపెనీ షేర్లు కొనుగోలు చేసి, వొడాఫోన్-ఐడియా నుంచి ఫోన్లు చేసుకునేవారి పరిస్థితి ఎలా ఉంటుందో ఓసారి ఊహించండి"

– రోహన్ వెంకట్, జర్నలిస్ట్

మరో ప్రపంచం

"వినియోగదారులు ఎస్ బ్యాంక్‌ను తప్పుబడుతున్నారు. బ్యాంక్ వినియోగదారులదే తప్పు అంటోంది. ఆర్బీఐ ఏమో ఇద్దరిదీ సమాన బాధ్యత అంటోంది.. ఇదంతా వేరే మరో ప్రపంచంలో కాదుగదా"

– సానియా సయ్యద్, రచయిత్రి

ఇన్‌బాక్స్

సంఘటిత మహిళా స్ఫూర్తి

ఈనాటికీ మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లేదు. సామాజిక మత సాంప్రదాయాలు కట్టుబాట్లు స్త్రీల ఆత్మగౌరవాన్ని అడుగడుగునా దెబ్బతీస్తూనే ఉన్నాయి. సమాజంలో పురుషాధిపత్య రూపం మారుతూ వస్తోంది. ప్రతిభ సామర్థ్యం ఉన్నా ఏ రంగంలోనూ ప్రాధాన్యత ఇవ్వరు. నిర్ణయాధికార చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు అటకెక్కించారు. ఇక ఉద్యోగ ఉపాధి రంగాల్లో పురుషుల కంటే ఎక్కువ సమర్థవంతంగా పని చేసినా పురుషులతో సమానమైన పదోన్నతులు ఉండవు. ఇటీవల సైనిక కమెండోలుగా పదోన్నతుల కోసం కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి మహిళలకు ఎదురయింది. దానికి ప్రభుత్వమే సామాజిక స్థితి కారణంగా ఇవ్వలేక పోతున్నామని సుప్రీంకోర్టులో సమాధానం చెప్పింది. సామాజిక స్థితి గురించి ప్రభుత్వాలు మాట్లాడితే మరి భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన జాతి, మత, లింగ వివక్షత లేకుండా అందరికీ సమాన అవకాశాలు అటక ఎక్కాల్సిందేనా? అంతులేని లైంగిక హింస మహిళలపై బాలికలపై కొనసాగుతున్నది. స్త్రీలకు రక్షణ చట్టాలు చేయడంతోనే సరిపోతుందని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఆ చట్టాల అమలు కోసం, సత్వర న్యాయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టడం లేదు.

బేటీ బచావో.. బేటీ పడావో లాంటి నినాదాలు తప్పితే స్త్రీల హక్కుల రక్షణకు నిర్దిష్ట కార్యాచరణ లేదు. కఠినంగర్లో తొమ్మిదేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగి తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉంది. ఆ బాలిక ఆరోగ్యం కోసం వారికి ఆర్థిక సహకారం అందలేదు. రాజ్యాంగ హక్కులను రక్షించాలని, రాజ్యాంగ విరుద్ధ పౌరసత్వ చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో మహిళలు ఉద్యమిస్తున్నారు. షాహీన్ బాగ్‌లో మహిళలు చూపుతున్న సంఘటిత పోరాట స్ఫూర్తి అనేక ప్రాంతాల్లోని మహిళలు ఎత్తి పడుతున్నారు. స్వేచ్ఛా, సమానత్వం పోరాడి సాధించుకోవాలని స్ఫూర్తినిచ్చిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం వర్ధిల్లాలి అంటూ నినదిస్తున్నారు.

– ఝాన్సీ,
సీపీఐఎమ్ఎల్ న్యూడెమోక్రసీ

దోపిడీదారులు

శ్రీరమణ

క్షణానికి వచ్చేది తెలియదంటారు. అది శంకరుడు అంతా మిథ్య అన్నాడు. అయితే రోల్స్ రాయిస్ కారు, ఫైవ్‌స్టార్ రిసార్టు, అందలి సుఖాలు మాయం టావా? మిథ్యంటావా? నా ముద్దుల వేదాంతీ అని శ్రీశ్రీ సూటిగా ప్రశ్నించాడు. మనల్ని కొన్ని వైరాగ్యాలు ఆవహిస్తూ ఉంటాయ్. గొప్ప జీవితం గడిపి ఆఖరికి గుప్పెడు బూడిద అయినప్పుడు చూపరులకు శ్మశాన వైరాగ్యం ఆవరిస్తుంది. విపరీతంగా ప్రసవ వేదన అనుభవించిన తల్లికి ప్రసూతి వైరాగ్యం పూనుతుంది. మంచి పౌరాణికుడు ప్రవచనం ఆర్ద్రంగా వినిపించినపుడు ఇంటికి వెళ్లేదాకా పురాణ వైరాగ్యం మనసును వేధిస్తుంది.

కరోనా వైరస్ మొన్న ప్రపంచాన్ని చుట్టుముట్టినపుడు మనిషికి వైరాగ్యం కూడా వైరస్‌లా అంటుకుంది. చూశారా నిరంకుశ పాలన సాగేచోట కరోనా తీవ్రంగా ఉందని కొందరు విశ్లేషించారు. దేవుణ్ణి బొత్తిగా నమ్మనిచోట కరోనా విజృంభిస్తోందనీ మరికొందరన్నారు. ఇండియాలో దేవీదేవతలనైనా, పెద్దవారినైనా చేతులు చోడించి వినమ్రంగా పలకరిస్తాం. ఇది మన సంప్రదాయం. ఇదే కరోనాకి శ్రీరామ రక్ష అంటున్నారు శాస్త్రవేత్తలు. షేర్ మార్కెట్ చిగురుటాకులాంటిది. ఎండకాస్తే, నాలుగు చినుకులు పడితే షేర్ మార్కెట్ చలించిపోతుంది. ఇక కరోనా లాంటి మందులేని జాడ్యం ఆవరించినపుడు చెప్పేదేముంది. భారతదేశం

అక్షర తూణీరం

గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రం. చిల్లర రాళ్లని మొక్కే దేశం. అప్పుడొకసారి అంతరిక్షం నించి లాబొరేటరీ గింగిరాలు తిరుగుతూ వచ్చి పడ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 7-3-2020

ఫొటో: శివ మల్లాల
తల్లీకూతుళ్లు కృష్ణవేణి, అనురాధ

స్త్రీకి ఉండనిదే ఆర్థిక స్వాతంత్ర్యం.
అదుంటే అన్ని స్వాతంత్ర్యాలూ వచ్చేస్తాయి.
ఆర్థిక స్వాతంత్ర్యం అంటే..
చేతి నిండా డబ్బు ఉండటం కాదు.
ఆ డబ్బును ఇష్టానికి ఖర్చు చేసే స్వేచ్ఛ ఉండటం.
కృష్ణవేణి, ఆమె కూతురు అనురాధ..

స్వప్నాదత్, ప్రియాంకాదత్, లక్ష్మీ మంచు ..
వీళ్లకు.. సినిమాలు నిర్మించడం ఇష్టం.
నిర్మిస్తే డబ్బు రావచ్చు.. పోవచ్చు.
పోతుందేమోనని ఇష్టాన్ని చంపుకోలేదు వీళ్లు!
మంచి మంచి సినిమాలు తీశారు. తీస్తున్నారు.
రేపు మహిళా దినోత్సవం.
ఈ సందర్భంగా..
మగవాళ్ల రాజ్యంలో 'స్త్రీ మహాలక్ష్మి'గా వెలిగిన..
వెలుగుతున్న.. సినీ మహిళా నిర్మాతలతో
సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలు ఇవి.

వెండితెర వెనుక

స్త్రీ మహాలక్ష్మి

భానుమతి డైనమిక్
కృష్ణవేణి

కోట్లుంటే సరిపోదు
అనురాధ

■ **చిత్రసీమకు సంబంధించిన తొలి తరం తారల్లో గాయనిగా, నటిగా, నిర్మాతగా మీకు మంచి పేరు ఉంది. నటిగా కెరీర్ ఎలా మొదలైందో చెబుతారా?**

కృష్ణవేణి: 'సతీ అనసూయ' (1936)లో బాల నటిగా నటించాను. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా చేశాను. అంతకుముందు డ్రామాల్లో నటించాను. అప్పట్లో మా పాత్రలకు మేమే పాడుకోవాలి. అలా గాయనిగా కూడా మంచి పేరు వచ్చింది. మీర్జాపురం రాజా మేకా వెంకటరామయ్య అప్పారావుగారు నిర్మించిన 'భోజ కాళిదాసు'కి నన్ను సెకండ్ హీరోయిన్‌గా తీసుకున్నారు. అందులో కన్నాంబ ఫస్ట్ హీరోయిన్. ఆ తర్వాత ఆయన బేనర్‌లోనే 'జీవన జ్యోతి' సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా చేశాను. నటిగా నన్ను బాగా ఎస్టాబ్లిష్ చేసిన సినిమా అది. 15 సినిమాలకు పైగా హీరోయిన్‌గా నటించాను.

■ **మరి నిర్మాణరంగంవైపు ఎలా వచ్చారు?**

కృష్ణవేణి: 'జీవనజ్యోతి' తర్వాత మీర్జాపురం రాజాగారితో నా పెళ్లయింది. మాది ప్రేమ వివాహం. అప్పుడు నాకు 17 ఏళ్లు. జయా పిక్చర్స్‌పై నా భర్త తీసిన సినిమాలకు నిర్వహణ బాధ్యతలు చూసుకునేదాన్ని. అలా నిర్మాణ రంగంవైపు వచ్చాను. ఆ సంస్థ పేరుని ఆ తర్వాత 'శోభనాచల పిక్చర్స్'గా మార్చాం. 'గొల్లభామ' (1947), 'మన దేశం' (1949), 'లక్ష్మమ్మ' (1950), 'దాంపత్యం' (1957) వంటి సినిమాలు నిర్మించాం. కొన్నింటిలో నేను కూడా నటించాను. 'మన దేశం'తో ఎన్టీఆర్‌ని ఇండస్ట్రీకి పరిచయం చేశాం. ఇది నిర్మాతగా నాకు కంప్లీట్ సినిమా. ఎన్టీఆర్‌తో 'పల్లెటూరి పిల్ల' కూడా తీశాం. నా భర్తతో కలిసి ప్రొడక్షన్ చూసుకునేదాన్ని. స్టోరీ సిట్టింగ్స్, మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూడా కూర్చునేదాన్ని. షూటింగ్ షెడ్యూల్స్ ప్లాన్ అంతా చేసేదాన్ని.

■ **భానుమతిగారు, విజయ నిర్మలగారు, మీరు.. ఇలా కొందరు నిర్మాతగా చేశారు. తర్వాత మీ అమ్మాయి (అనురాధా దేవి). ఇప్పుడు కూడా వేళ్ల మీద లెక్కపెట్టేంత మంది మహిళా నిర్మాతలే ఉన్నారు...**

కృష్ణవేణి: భానుమతి డైనమిక్. ఆవిడని చూసి అందరూ గడగడలాడేవాళ్లు. అంత ధైర్యం ఉంటే ఇక్కడ నిర్మాతగా రాణించవచ్చు. లేకపోతే కష్టం. ఇక విజయనిర్మల కూడా చాలా ధైర్యవంతురాలు. చాలా స్వీట్ పర్సన్. భానుమతి, విజయనిర్మల లది ఒక మొండి వైఖరి. అలా ఉంటే నిర్మాతలుగా చేయొచ్చు. నిర్మాత అంటే మగవాళ్లే అనే ఫీలింగ్ ఏదో పడిపోవడం వల్ల కొందరు రావడంలేదేమో.

అనురాధ: అమ్మాయి అంటే నటిగా ఓకే కానీ నిర్మాతలుగా రానివ్వరు. బ్యాకింగ్ ఉంటే ఓకే. కోట్లు ఉన్నాయి.. నిర్మాత అయిపోవచ్చు కదా అనుకుంటే కుదరదు. ర్యాపో ఉండాలి. ఎంతో మంది నా దగ్గరకు సినిమాలు తీస్తామని వస్తారు. కానీ ఎంకరేజ్ చేయను. ఎందుకంటే బ్యాగ్రౌండ్ లేకపోతే కష్టం.

■ **మీరన్నట్లు నిర్మాతలంటే పురుషులే అనే ఫీలింగ్ చాలామందిలో ఉంది. అలాంటి పరిస్థితిలో మీకు నిర్మాణం ఏమైనా అసౌకర్యంగా అనిపించేదా?**

కృష్ణవేణి: చాలా హ్యాపీగా ఉండేది. కాశీమజిలీ కథలు చదివేదాన్ని. ఇంకా చాలా పుస్తకాలు చదివి, వాటిలో ఉన్న మంచి పాయింట్స్‌తో సినిమాలు నిర్మించేవాళ్లం. అంతా సాఫీగా సాగేది. కొన్ని సినిమాల్లో డబ్బులు పోయినా అదేం పెద్ద బాధ అనిపించలేదు.

అనురాధ: శోభనాచల స్టూడియో మాదే. నాన్నగారు పెద్ద బ్యాకింగ్. ఇక అసౌకర్యంగా ఎందుకు ఉంటుంది? (నవ్వుతూ). చెప్పాలంటే చాలామంది అవకాశాల కోసం అమ్మని కాకాపట్టేవాళ్లు. స్ట్రాంగ్ బ్యాగ్రౌండ్ ఉంటే ఎలాంటి అసౌకర్యం ఉండదు.

■ **అమ్మ తర్వాత మీరు నిర్మాతగా మారారు. మీరు ఇష్టపడి వచ్చారా? వారసత్వాన్ని కంటిన్యూ చేయాలనా?**

అనురాధ: నాన్నగారికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో నన్ను నిర్మాతగా కంటిన్యూ అవ్వమన్నారు. నిజానికి సినిమా ఇండస్ట్రీకి రావాలనే ఆలోచన నాకంతగా లేదు. అయితే అప్పటికి కన్నడంలో రాజ్‌కుమార్‌గారితో 'భక్త కుంభార' అనే సినిమాని నాన్నగారు నిర్మిస్తున్నారు. ఆరోగ్య సమస్యలతో కంటిన్యూ చేయలేనని నన్ను, నా భర్త (నంగనూరు శ్రీనివాసరావు) ను ఆ సినిమా ప్రొడక్షన్ చూసుకోమన్నారు. ఆ సినిమాని నాగేశ్వరరావుగారితో తెలుగులో 'చక్రధారి'గా రీమేక్ చేశాను. ఆ తర్వాత ఆయనతోనే 'రాముడే రావణుడైతే' సినిమా తీశాం. ఈ సినిమాకి దాసరి గారు డైరెక్టర్. మా బేనర్‌లో ఆయనకు ఫస్ట్ సినిమా. ఏయన్నార్‌గారికి ఇది ఫస్ట్ సినిమా స్కోప్ పిక్చర్. ఆ తర్వాత ఏయన్నార్–దాసరిగార్ల కాంబినేషన్‌లో 'శ్రీవారి ముచ్చట్లు' అనే సినిమా తీశాం.

ఈ ఇద్దరి కాంబినేషన్‌లోనే తీసిన 'రాముడు కాదు కృష్ణుడు' కూడా సూపర్ హిట్ అయింది. అలాగే ఏయన్నార్ హీరోగా కోదండరామిరెడ్డి డైరెక్షన్‌లో తీసిన 'అనుబంధం' సూపర్ హిట్ అయింది. మురళీమోహన్, శోభన్‌బాబులతో కూడా సినిమాలు తీశాం.

■ **నిర్మాణం మీకెలా అనిపించింది? ఏవైనా చేదు అనుభవాలు?**

అనురాధ: నేను పెరిగిందే సినిమా ఇండస్ట్రీలో. నాగేశ్వరరావు గారు నన్ను బాగా ఎత్తుకునేవారు. ఎన్టీఆర్‌గారు బాగా తెలుసు. మా బేనర్‌లో శోభన్‌బాబుగారు నటించారు. అందరూ తెలిసినవాళ్లే కావడంతో నిర్మాతగా ఇబ్బందిపడలేదు. పైగా దాసరి నారాయణరావు గారు నన్ను సొంత సిస్టర్‌లా అనుకునేవారు. ఆయన నాకు 'రాఖీ బ్రదర్'.

■ **బ్యాగ్రౌండ్ లేనివాళ్లకయితే ఇబ్బందులు ఎదురవుతాయా?**

అనురాధ: బ్యాడ్ సైడ్ ఆఫ్ ది ఇండస్ట్రీ నాకు తెలియదు. ఎందుకంటే నా లైఫ్ అంతా బాగా గడిచింది. అయితే ఇక్కడ పురుషాధిక్యం ఉంటుంది. నిర్మాత పురుషుడైతే ఒక రకంగా, ఆడవాళ్లయితే ఒకరకమైన ట్రీట్‌మెంట్ ఉంటుంది. బేసిక్‌గా మేల్ డామినేషన్. అంత ఈజీగా స్త్రీలను నిర్మాతలుగా అంగీకరించే పరిస్థితి లేదు. చెప్పుకోవాలంటే ఎన్నో ఉంటాయి. కానీ ఎక్కడ లేవని సినిమా పరిశ్రమ విషయాలను బయటకు చెప్పమంటారు? ప్రపంచం మొత్తం జరుగుతున్నదే సినిమా పరిశ్రమలోనూ జరుగుతోంది.

■ **అయితే ఒక లేడీ నిర్మాత ఉన్నప్పుడు ఫీమేల్ టెక్నీషియన్స్‌కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే వీలు ఉంటుంది కదా?**

అనురాధ: అది కరెక్ట్. నా బేనర్‌లో సినిమా చేసిన ఎవరూ ఇబ్బందిపడలేదు. వాళ్లు సురక్షితంగా పని చేసుకునే వాతావరణం కల్పించేవాళ్లం. అయితే హీరోయిన్ సాక్షీ శివానంద్ లాంటి వాళ్లు మమ్మల్నే ఇబ్బందిపెట్టేవాళ్లు. వాళ్లంతట వాళ్లు కాస్ట్యూమ్స్ తెచ్చుకుని, డైరెక్టర్‌కి కూడా చూపించకుండా నేరుగా లొకేషన్‌కి వచ్చేయడం వంటివి చేసేవాళ్లు.

■ **17 సినిమాలు నిర్మించిన క్రెడిట్ మీది. ఎక్కువ సినిమాలు నిర్మించిన లేడీ ప్రొడ్యూసర్‌గా 'లిమ్కా బుక్' రికార్డ్‌ని సొంతం చేసుకున్నారు.. ఇప్పుడు ఎందుకు సినిమా నిర్మాణం ఆపేశారు?**

అనురాధ: ఆలయ దీపం (1984), ఇల్లాలే దేవత (1985) వంటి సినిమాలు తీశాం. 'ఇల్లాలే దేవత' సినిమా సరిగ్గా ఆడలేదు. ఆ తర్వాత ఓ పదేళ్లు నిర్మాణం మానుకున్నాం. నవీన్, అబ్బాస్, సిమ్రాన్ హీరో హీరోయిన్లుగా 'ప్రియా ఓ ప్రియా' (1997) సినిమాతో మళ్లీ నిర్మాణం మొదలుపెట్టాను. ఆ తర్వాత నవీన్, రవితేజతో 'ప్రేమించే మనసు', జేడీ చక్రవర్తి, సాక్షీ శివానంద్ జంటగా 'మా పెళ్లికి రండి' సినిమాలు నిర్మించాను. అయితే 'మా పెళ్లికి రండి' (2001) సినిమా అప్పుడు చాలా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఆ సినిమా థియేటర్‌లో ఉండగానే మాకు తెలియకుండా ఎవరో అమ్మేశారు. దాంతో కేబుల్‌లో వచ్చింది. సినిమా బాగున్నా నిర్మాతగా నష్టపోయాను. ఇక ఆ తర్వాత నిర్మాతగా ఫుల్‌స్టాప్ పెట్టేశాను. ఆ సినిమా అప్పుడు నిర్మాతగా నన్ను అణగదొక్కాలని చాలామంది ప్రయత్నించారు. సినిమా విడుదల చేయకుండా అడ్డుకోవడానికి ట్రై చేశారు. దాసరిగారి సహాయంతో ఎలాగో విడుదల చేశాను. 2005లో మావారు చనిపోయారు. నాకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు కూతుళ్లు చనిపోయారు. మూడో అమ్మాయి మ్యారీడ్ లైఫ్ బాగుంది. అయితే భర్త, ఇద్దరు కుమార్తెలు చనిపోవడంతో ఇక నేను ప్రొడక్షన్ కొనసాగించలేక పోయాను.

సౌత్ అంటే చిన్నచూపు - అనురాధ

నాకు ఇందిరా గాంధీ ప్రియదర్శిని అవార్డు వచ్చింది. ఆ అవార్డుకి ఎవరో ఒకరు నా పేరుని రిఫర్ చేయాలి. అవార్డు తీసుకుని వచ్చేశాక ఎవరు రిఫర్ చేసి ఉంటారా? అని అడిగితే.. మన తెలుగు పరిశ్రమ నుంచి నా పేరుని ప్రతిపాదించలేదు. కన్నడ పరిశ్రమ తరపున నాకు వచ్చిన అవార్డు అది. కన్నడంలో మమ్మల్ని చాలా గౌరవిస్తారు. రాజ్‌కుమార్‌గారితో తీసిన 'భక్త కుంభార'కి బోలెడన్ని అవార్డులు వచ్చాయి. కన్నడ స్టేట్ అవార్డు కూడా వచ్చింది. అయితే నేషనల్ అవార్డు విషయంలో చిన్న చేదు అనుభవం ఎదురైంది. మన దక్షిణాది పరిశ్రమవారంటే ఉత్తరాదివారికి చిన్న చూపు. 'భక్త కుంభార' సినిమాని నేషనల్ అవార్డుకి పంపించాం. అయితే అవార్డు దక్కలేదు. తర్వాత తెలిసిన విషయం ఏంటంటే.. అసలు ఆ సినిమా బాక్సుని అవార్డు కమిటీవాళ్లు ఓపెన్ కూడా చేయలేదట. సౌత్ సినిమా ఇండస్ట్రీ అంటే అక్కడివారికి అంత చిన్న చూపు.

– డి.జి. భవాని, గౌతమ్ మల్లాది

నాన్నను చూసి ఎంచుకున్నాం

స్వప్నా దత్, ప్రియాంకా దత్

■ **స్క్రీన్ మీద స్త్రీలు కనిపించడం సాధారణమే. కానీ కెమెరా వెనక పని చేస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. కారణం?**

స్వప్నా దత్: సినిమా నిర్మాణం ఎందుకు ఎంచుకున్నాం అంటే మా నాన్నగారిని (అశ్వనీదత్) చూశాం. ఆయన ప్యాషన్‌తో సినిమాలు నిర్మించడం చూశాం. కథను ఎంచుకోవడం, నటీనటులను, దర్శకుడిని ఎంపిక చేసుకోవడం వంటి విషయాలు చూసి ప్రొడక్షన్ మీద ఇంట్రెస్ట్ పెరిగింది. సాధారణంగా అమ్మాయిలు ఎక్కువగా యాక్టింగ్ అయినా, డిజైనింగ్ పైన అయినా ఆసక్తి చూపుతారు. కానీ మా ఇంట్లో అంత మంచి ఎగ్జాంపుల్ ఉన్నప్పుడు నిర్మాణం కాకుండా ఏం చేస్తాం చెప్పండి. సినిమా నిర్మాణమే అన్నింటికంటే సాహసమైనది అనిపించింది. అదే చేస్తున్నాం (నవ్వుతూ).

■ **స్త్రీలు నిర్మాతలైతే షూటింగ్ లొకేషన్‌లో ఎలాంటి వాతావరణం ఏర్పడుతుంది?**

ప్రియాంకా దత్: నిర్మాత ఆడవారైనా మగవారైనా సరే అందరూ సురక్షితంగా పని చేసుకునే వాతావరణం కల్పించాలి. లేడీ నిర్మాత లంటే.. మేం కొంచెం ఎక్కువ సెన్సిటివ్‌గా ఉంటాం కాబట్టి సెట్లో అమ్మాయిలు ఉంటే వాళ్లు సేఫ్‌గా ఇంటికి వెళ్లగలుగుతున్నారా? వాళ్ల బాత్‌రూమ్స్ సరిగ్గా ఉంటున్నాయా? అని చూస్తాం. అలాగే ఏదైనా ఇష్యూలు వస్తే వెంటనే మాతో చెప్పగలిగే వాతావరణం ఉంటుంది. మా మేనేజర్లతో అన్నీ సరిగ్గా చూసుకోమని చెబుతాం. నిర్మాత ఆడైనా మగైనా ఎవ్వరైనా సరే సెట్లో అమ్మాయిల్ని జాగ్రత్తగా చూసుకోవాలి.

■ **రామానాయుడుగారు నిర్మాతగా వంద సినిమాలుపైనే నిర్మించారు. లేడీ ప్రొడ్యూసర్స్ కూడా ఆ రికార్డుని అందుకోగలుగుతారా?**



స్వప్నా: ఇది ఆడా మగా సమస్య అని చెప్పను. కొంచెం మేల్ డామినేటెడ్ ప్రపంచంలో ఉమెన్‌కి కచ్చితంగా చాలెంజెస్ ఉంటాయి. కష్టం అయితే అందరికీ ఒకటే. రామానాయుడిగారి అంత విజన్ ఉంటే ప్రయత్నించొచ్చు అనుకుంటా.

■ **నాన్నగారి బాటలో నిర్మాతలు అయి ఎవడే సుబ్రహ్మణ్యం, మహానటి, దేవదాస్ వంటి సినిమాలు నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ లెగసీని మోయడం ఒత్తిడి ఏమైనా?**

స్వప్నా: అవును. ఏదైనా పెద్ద పెద్ద పనులు చేస్తున్నప్పుడు కచ్చితంగా ఉంటుంది. అలాంటిది 50 ఏళ్ల హిస్టరీ ఉన్న సంస్థ (వైజయంతీ మూవీస్)ను ముందుకు తీసుకెళ్లడం కచ్చితంగా ప్రెషరే. అలాగే ప్లెషర్ కూడా.

■ **లేడీ ప్రొడ్యూసర్స్ ఎదుర్కొనే చాలెంజ్‌లు?**

స్వప్నా: ప్రొడక్షన్ అంటేనే చాలెంజ్. ప్రొడ్యూసర్స్ అంటేనే చాలెంజెస్ ఎదుర్కొనేవారు. అందులో ఆడామగా అని ఉండదనుకుంటున్నాను. జెన్యూన్‌గా సినిమా తీసేవాళ్లకు ఇబ్బంది ఎదురవుతూనే ఉంటుంది.

ఆర్థిక అవగాహన స్త్రీలకే ఎక్కువ



లక్ష్మీ మంచు

● **స్క్రీన్ మీద స్త్రీలు కనిపించడం సాధారణమే. కానీ కెమెరా వెనక పని చేస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. కారణం?**

లక్ష్మి: లేడీ ప్రొడ్యూసర్స్ మరింతమంది రావాలి. ఎందుకంటే ఆర్థిక అవగాహన వాళ్లకు చాలా ఉంటుంది. అది మనకు తెలియక ఉమెన్ ప్రొడ్యూసర్స్‌ని తీసుకురావడం లేదు. ఎక్కువ మంది స్త్రీలు నిర్మాతలుగా ఉంటే ఇండస్ట్రీ ఇంకా సాలిడ్‌గా ఉంటుంది.

● **స్త్రీలు నిర్మాతలైతే షూటింగ్ లొకేషన్‌లో ఎలాంటి వాతావరణం ఏర్పడుతుంది?**

స్త్రీలు ఏ రంగంలో ఉన్నా వాళ్లకు తెలియకుండానే ఓ రకమైన సున్నితత్వం, సురక్షితమైన వాతావరణం తీసుకువస్తారు. అఫ్‌కోర్స్... ఇండస్ట్రీలోకి ఇంకా ఎక్కువమంది స్త్రీలు రావాలి. మెల్లిగా మార్పు వస్తుంది.

● **రామానాయుడుగారు నిర్మాతగా వంద సినిమాలుపైనే నిర్మించారు. లేడీ ప్రొడ్యూసర్స్ కూడా ఆ రికార్డుని అందుకోగలుగుతారా?**

సినిమాలు నిర్మించడం అనేది మాములు విషయం కాదు. 500 సినిమాల్లో యాక్ట్ చేశాను.. 1000 సినిమాలు చేశాను అని చెప్పుకునే ఘనత మాకుంటుందో ఉండదో! ఇంతకు ముందు ఓ సినిమా 20–30 రోజుల్లో పూర్తయ్యేది. ఇప్పుడు మూడొందల రోజులయినా అవ్వడం లేదు. అన్ని సినిమాలు నిర్మించడం రామానాయుడు అంకుల్‌కే సాటి.

● **నిర్మాణంలో మగవాళ్లకి, ఆడవాళ్లకి ఉండే తేడా ఏంటి?**

నిర్మాతగా నేను సెట్స్‌లోకి వెళ్తే చాలామంది ఉమెన్ నా సెట్లో ఉండాలనుకుంటాను. స్క్రిప్ట్ రాసేవాళ్లలో కానీ, ప్రొడక్షన్‌లో కానీ ఎక్కువమందిని ప్రోత్సహించాలనుకుంటాను. ఫిమేల్ టెక్నీషియన్స్ ఎంత ఎక్కువమంది ఉంటే అంత మంచిది అనుకుంటాను.

● **నిర్మాణంలో మీరు ఎదుర్కొనే చాలెంజ్‌లు ఏంటి?**

ఛాలెంజ్‌లు ప్రతీ రంగంలోనూ ఉంటాయి. నేను సామర్థ్యాన్ని బట్టి పని రావాలని కోరుకుంటాను కానీ ఆడపిల్ల అయినందువల్లో, పెద్ద బ్యాగ్రౌండ్ ఉన్నందువల్లో నాకు పని ఇవ్వాలని కోరుకోను.

● **ఝుమ్మంది నాదం, ఊ కొడతారా ఉలిక్కిపడతారా, గుండెల్లో గోదారి, దొంగాట వంటి సినిమాలు నిర్మించారు. ఈ మధ్య నిర్మాతగా స్లో అయ్యారెందుకని?**

ఈ కథను కచ్చితంగా చెప్పాలి అని నేను భావించినప్పుడు సినిమా నిర్మించాలనుకుంటాను. అలా అనిపించినప్పుడు సినిమా నిర్మిస్తూనే ఉంటాను. సినిమా నిర్మించకపోయినా టెలివిజన్‌లో ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాను. అన్నీ ఒకే సమయంలో చూసుకోలేను. కాబట్టి ఒక్కొక్కటీ ఒక్కో సమయంలో చేస్తున్నాను.

● **మీకు బ్యాగ్రౌండ్ ఉంది కాబట్టే సినీ నిర్మాణంలో కొనసాగగలుగుతున్నారని అనుకోవచ్చా?**

ప్రొడ్యూసర్ అవడానికి బ్యాగ్రౌండ్ కాదు. మనకు ఇంట్రెస్ట్ ఉందా? లేదా అన్నది ముఖ్యం.

● **ఫ్యామిలీ లెగసీని మోయడం ఒత్తిడికి గురి చేస్తుందా?**

లెగసీ అనేది సమస్య అని నేను అనను. వారసత్వం అనేది మనకు ఫస్ట్ రెడ్ కార్పెట్ వేస్తుందేమో కానీ దానికింద ముళ్లు మాత్రం ఉంటాయి. మనం జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే బ్యాగ్రౌండ్‌కి మచ్చ తెచ్చినవాళ్లం అవుతాం. నేను నటించినా, నిర్మించినా లెగసీని గుర్తుపెట్టుకుంటాను.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
7-3-2020

రుతువు మారింది రుచి మార్చండి

శిశిరం పోయి వసంతం వస్తోంది. చెట్లు కొత్త చిగుళ్లు వేస్తాయి అవి కొత్తదనం తెచ్చుకున్నప్పుడు మన వంట గిన్నెలోకి కూడా కొత్తదనం రావాలి కదా. రుతువు మారేటప్పుడుకొన్ని పదార్థాలు తప్పక తినాలంటారు పెద్దలు. ఎందుకు చెప్పారో. కూపీ లాగేబదులు కిచెన్‌లోకి నడిస్తే సరిపోదూ!!!

ఖర్జూరాల లడ్డు

కావలసినవి: వేయించిన సెనగ పప్పు (పుట్నాల పప్పు) – ఒక కప్పు; ఖర్జూరాలు – పావు కప్పు (గింజలు తీసేయాలి); ఎండు కొబ్బరి తురుము – ఒక టేబుల్ స్పూను

తయారీ: ● వేయించిన సెనగ పప్పు, ఖర్జూరాలు మిక్సీలో వేసి మెత్తగా చేసి, ఒక ప్లేటులోకి తీసుకోవాలి ● ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతిలోకి తీసుకుని ఉండలు చేయాలి ● ఎండు కొబ్బరి తురుములో దొర్లించాలి ● కొద్దిగా ఆరాక గాలి చొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి ● ఇవి వారం రోజుల దాకా నిల్వ ఉంటాయి (ఇష్టమైన వారు రంగులు కూడా జత చేసుకోవచ్చు. తాజాగా ఎప్పటికప్పుడు చేసుకోవటం మంచిది)

కర్ర పెండలం బాల్స్

కావలసినవి: కర్ర పెండలం – అర కిలో; చిలగడ దుంప – పావు కేజీ; కొత్తిమీర – ఒక కట్ట; వెల్లుల్లి ముద్ద – అర టేబుల్ స్పూను; పచ్చి మిర్చి ముద్ద – పావు టీ స్పూను; నిమ్మ రసం – ఒక టేబుల్ స్పూను; అల్లం ముద్ద – అర టీ స్పూను; నువ్వులు – ఒక టీ స్పూను; ఆవాలు – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; కిస్‌మిస్ – 15; నూనె – ఒక టేబుల్ స్పూను

సాధారణంగా ఈ వంటకాన్ని హోలీ పండుగకు తయారు చేస్తారు. హోలికను దహనం చేసిన మంట బాగా చల్లారాక, ఆ సన్నని మంట మీద దుంపలను రాత్రంతా వండుతారు. ఒక్కోసారి ఆవిరి మీద ఉడికించి కూడా తయారుచేస్తారు.

తయారీ: ● కర్ర పెండలాన్ని శుభ్రం చేసి, పెద్ద పెద్ద ముక్కలుగా తరగాలి ● తగినన్ని నీళ్ల జత చేసి స్టా మీద ఉంచి సుమారు అర గంట సేపు ఉడికించాలి ● చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి, ముక్కలు చేసి, తగినంత నీరు జత చేసి సుమారు పావు గంట సేపు ఉడికించాలి ● ఇవి కొద్దిగా చల్లారాక, రెండు రకాల దుంపలకు తొక్కు తీసి, సన్నగా తురమాలి ● స్టా మీద బాణలిలో నూనె కాగాక, ఆవాలు వేసి చిటపటలాడించాలి ● నువ్వులు వేసి మరోమారు వేయించాలి ● పచ్చిమిర్చి ముద్ద, అల్లం ముద్ద జత చేసి రెండు నిమిషాల పాటు బాగా వేయించాలి ● కిస్‌మిస్, కర్ర పెండలం తురుము, చిలగడ దుంప తురుము, కొత్తిమీర, వెల్లుల్లి ముద్ద, ఉప్పు వేసి బాగా కలిపి, ఐదు నిమిషాల పాటు ఉడికించి దింపేయాలి ● నిమ్మ రసం జత చేసి బాగా కలిపి ఉండలు చేసి అందించాలి.

హెల్తీ రంగైటె

కావలసినవి: ఏలకులు – 5; సోంపు – ఒకటి న్నర టీ స్పూన్లు; ధనియాలు – పావు టీ స్పూను; మిరియాలు – అర టీ స్పూను; పొడ్డు తిరుగుడు గింజలు – ఒక టీ స్పూను; బాదం పప్పులు – 50 గ్రా.; బ్రౌన్ సుగర్ – 5 టేబుల్ స్పూన్లు; గులాబీ రేకలు – 3 టేబుల్ స్పూన్లు; రోజ్ వాటర్ – 2 టేబుల్ స్పూన్లు; పాలు – ముప్పావు లీటరు; కుంకుమ పువ్వు – చిటికెడు.

తయారీ: ● స్టా మీద బాణలి వేడి చేశాక, ఏలకులు, సోంపు, ధనియాలు, మిరియాలు, పొడ్డుతిరుగుడు గింజలు, బాదం పప్పులను విడివిడిగా వేసి దోరగా వేయించాలి ● తగినన్ని నీళ్లలో రెండు గంటలు నానబెట్టాక, మిక్సీలో వేసి మెత్తగా చేయాలి ● బ్రౌన్ సుగర్, గులాబీ రేకలు, రోజ్ వాటర్ జత చేసి మరోమారు మిక్సీ తిప్పి ఒక పాత్రలోకి తీసుకోవాలి ● పాలు జత చేసి బాగా కలియ బెట్టి, వడకట్టి, గ్లాసులలో పోయాలి ● గులాబీ రేకలు, కుంకుమ పువ్వులతో అలంకరించాలి.

జొన్నల చట్‌పట్



కావలసినవి: జొన్న పేలాలు – 5 కప్పులు; నూనె – 2 టీ స్పూన్లు; ఆవాలు – ఒక టీ స్పూను; కరివేపాకు – ఒక రెమ్మ; ఇంగువ – పావు టీ స్పూను; పుట్నాల పప్పు – 2 టేబుల్ స్పూన్లు; పసుపు – అర టీ స్పూను; మిరప కారం – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: ● స్టా మీద బాణలి వేడి చేశాక, జొన్న పేలాలు వేసి రెండు మూడు నిమిషాలు వేయించి, ఒక ప్లేటులోకి తీసుకోవాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి ఆవాలు వేసి చిటపటలాడించాలి ● కరివేపాకు, ఇంగువ వేసి వేయించాలి ● వేయించిన సెనగ పప్పున్న జత చేసి కొద్ది సేపు ఉంచాలి ● పసుపు, మిరపకారం, ఉప్పు జతచేసి కొద్దిసేపు ఉడికించాలి ● వేయించిన జొన్న పేలాలు, పుట్నాల పప్పు జత చేసి సుమారు రెండు నిమిషాల పాటు వేయించి దింపేయాలి ● బాగా చల్లారాక గాలిచొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి।

మా ఊరి మహా వంటగత్తె

బిగెస్ట్ స్పెషల్ పిజా గ్రాండ్ మా

ఈ అవ్వ ప్రత్యేకంగా తయారుచేసిన అతి పెద్ద పిజ్జాను ఇప్పటి వరకు 72,45,705 మంది చూశారు. ఈ అవ్వేమీ సెలబ్రిటీ కాదు. వయసు తొంభై పైమాటే. మట్టి పాత్రలు, కట్టెల పొయ్యి, ఇనుప వస్తువులు, ఆరుబయట ప్రకృతిలో పక్షుల కిలకిలల మధ్య, ఆకుల గలగలల మధ్య అతి సామాన్యంగా అవలీలగా కిలోలుకిలోలు వండుతుంది. సెలబ్రిటీలకు ధీటుగా ఉంటారు ఈ అవ్వ వంటలకు ప్రేక్షకులు. బోసి నవ్వుల అవ్వ ఎంతో రుచికరంగా తయారు చేసిన వంటను తనే రుచి చూసుకుంటూ చిరునవ్వులు చిందిస్తుంది. అవ్వ తయారుచేసిన వంట కంటె, అవ్వను చూస్తే, 'ఈవిడ మన అవ్వ అయితే బాగుంటుంది' అనిపిస్తుంది.

చికెన్ డ్రమ్‌స్టిక్ మస్తానమ్మ

మస్తానమ్మ చేసిన చికెన్ డ్రమ్‌స్టిక్ రెసిపీని 66,58, 359 మంది చూశారు. మాంసాహారపు వంటకాలను ప్రత్యేకంగా తయారుచేసిన మస్తానమ్మ 105 సంవత్సరాలు జీవించారు. ఆ వయసులోనూ ఐదు కేజీల బరువును మోశారు. ఆరుబయట కట్టెల పొయ్యి ముందు కూర్చుని, స్వయంగా అన్నీ తరుగుతూ, ఎంతో ఓపికగా వంటలు చేశారు. ఈ తాతమ్మ వంటలను లక్షలమంది మాంసాహార ప్రియులు చూస్తున్నారు. అన్నిటి కంటె చికెన్ డ్రమ్‌స్టిక్ వంటకాన్ని ఎక్కువ మంది చూశారు. కుడి వైపు పమిటతో ఉన్న మస్తాన్మ వంటకాలను ఎంతో ప్రేమగా వండింది. వయసుతో సంబంధం లేకుండా తయారుచేసుకున్న వంటకాలను ఎంతో సరదాగా రుచి చూశారు మస్తానమ్మ. దంతాలు లేకపోతేనేం, చిగుళ్లు ఉన్నాయిగా రుచి చూడటానికి అనే మస్తానమ్మ 105 సంవత్సరాల వయసులో కన్నుమూశారు.

మ్యాగీ నూడుల్స్ , బ్రెడ్ ఆమ్లెట్

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్, తేజ్ మండీ చౌక్ దగ్గర ఈ అవ్వ వేగంగా మ్యాగీ నూడుల్స్, బ్రెడ్ ఆమ్లెట్ తయారుచేస్తూ కనిపిస్తారు. వాటిని తినటానికి ఎంతో మంది ఓపికగా నిరీక్షిస్తుంటారు. ఈ అవ్వ వంటకాలను వీడియోలో బంధించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. రెండు నెలల కాలంలోనే 11,15,975 మంది వీక్షించారు. కుటుంబాన్ని పోషించుకోవటం కోసం వీటిని తయారుచేస్తున్న ఈ అవ్వ చేతి వంటను ఇష్టపడనివారు ఉంటారా. అందునాతల్లిదండ్రులకు దూరంగా, ఉద్యోగాల కోసం నగరాలకు వస్తున్నవారికి ఇంటి భోజనం, ఇంటి ఆప్యాయతలు తలపించేలా ప్రేమతో నిండిన ఆహారం దొరికితే విడిచి పెడతారా. అవ్వ ఇచ్చేవరకు ఓపికగా నిరీక్షిస్తున్నారు ఇక్కడకు వచ్చేవారంతా. అవ్వను హడావుడి పెట్ట కూడదని వారికి తెలుసుగా.

వేగంగా రగడా

కవితకు నిండా ముప్పై సంవత్సరాలు లేవు. పనిలో చాలా చురుకు. ముంబైలోని చించ్‌పోక్లీ స్టేషన్‌కి సమీపంలో కవిత రగడా పట్టీస్ పావ్ వేగంగా తయారుచేస్తూ హుషారుగా కనిపిస్తారు. కవిత రగడాలు తయారుచేయటంలోనే కాదు, ప్యాకింగ్ చేయడంలోనూ అత్యంత వేగం చూపుతారు. ఈమె పని నైపుణ్యాన్ని వీడియో తీసి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఆరు నెలలకే 33,31,272 మంది చూశారు. ఎంతో చురుకుగా అలసట కనపడనీయకుండా, అతి వేగంగా రగడా తయారుచేసి అందిస్తూ, మరో వైపు పార్సిల్స్ కడుతూ ఎవ్వరినీ ఎక్కువసేపు నిరీక్షించకుండా పని చేస్తున్న కవిత, 'మేం సామాన్య మహిళలం కాదు, మేం కూడా సెలబ్రిటీలమే' అంటున్నట్లుగా అనిపిస్తారు.

నందిని వంట

హైదరాబాద్ చందానగర్ స్వాగత్ హోటల్ పక్కన, రోడ్డు మీద చికెన్ బోటీని అతి తక్కువ ధరకు అందిస్తున్నారు మూడు పదులు కూడా నిండని నందిని. వెజ్ మీల్స్, నాన్ వెజ్ మీల్స్ తాను ఒక్కర్తే స్వయంగా తయారు చేసి, పన్నెండు గంటలకు వంటకాలను మోసుకొచ్చి, ఆకలితోఉన్నవారికి సాయంత్రం నాలుగు గంటల వరకు అతి తక్కువ ధరలో భోజనం పెడుతున్నారు నందిని. ఆమెను వీడియోలో బంధించి అప్‌లోడ్ చేశారు. ఆమె చలాకీగా వంటలు వడ్డించటం, వచ్చిన వారిని నవ్వుతూ పలకరించటాన్ని ఇప్పటి వరకు 40,48,611 మంది చూశారు.

ఇందులో ఒక్కరూ సెలబ్రిటీలు కాదు. సంపన్న కుటుంబాల వారు కాదు, అందంగా అలంకరించుకుని, మేకప్ వేసుకుని కూడా ఉండరు. మన ఇంట్లో ఉండే అమ్మ, అవ్వ, అక్క, వదిన, చెల్లి వంటివారు వీరందరిలో నిండుగా కనిపిస్తారు. వీరంతా కుటుంబాలను చక్కగా పోషించుకుంటున్న స్వాభిమానులు. శక్తిమూర్తులు, ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నవారు. కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా, ఆకలితో ఉన్న ఎంతోమందిని సంతృప్తులను చేస్తున్నారు.

ఆయుర్వేదం

కరోనాని నిలువరిద్దాం! సరేనా!

మానవుని ఆరోగ్యానికి సంబంధించి ఆయుర్వేదం వివరించిన అనేక అంశాల్లో 'ఋతుచర్య' ఒకటి. వివిధ ఋతువుల్లో చూపే సూర్యుడి ప్రభావం వల్లనే మానవుని బలం, వ్యాధి క్షమత్వక శక్తి మారుతుంటుంది. శిశిర, వసంత, గ్రీష్మ ఋతువుల్ని (సుమారుగా జనవరి 15 నుంచి జూలై 15 వరకు) ఆయుర్వేదం 'ఆదాన కాలం' గా వర్ణించింది. ఇదే ఉత్తరాయణ కాలం. ఈ కాలంలో సూర్యుడు భూమి మీద నుంచి, ప్రకృతిలో నుంచి శక్తిని గ్రహిస్తాడు. కనుక మనిషి నీరసపడతాడు. వర్ష, శరత్, హేమంత ఋతువులు దక్షిణాయన కాలం. ఇది విసర్గ కాలం. సూర్యుడు తన శక్తిని ప్రసాదిస్తాడు. చంద్రుని ఆధిపత్యం వల్ల మనిషిలో శక్తి వృద్ధి చెందుతుంది. ఒక ఋతువు మారి ఇంకొక ఋతువు ప్రవేశించే మధ్య కాలాన్ని 'ఋతు సంధి' అంటారు. ఇటువంటి వాతావరణపు మార్పును తట్టుకునేందుకు ఆయుర్వేదం కొన్ని ఆహారవిహార నియమాలతో పాటు మరి కొన్ని జాగ్రత్తలు సూచించింది. ప్రస్తుతం శిశిర వసంతాల మధ్యనున్న ఋతు సంధి. ఇది కఫ ప్రకోపకాలం.

ఋతుచర్య: లఘు, రూక్షాహారం సేవించాలి. అంటే తేలికగా జీర్ణమై, శరీరాన్ని తేలికపరచే ఆహారం. వంకాయ, దొండ, కాకర, బీర మొదలైన శాకాహారం, ఆకు కూరల్ని ఉడికించి వండుకుని వేడివేడిగా భుజించాలి. నూనెలు, నెయ్యి వంటి స్నిగ్ధ పదార్థాలు, పాయసాల వంటి బరువైన ఆహారం విడిచిపెట్టి, సెనగలు, బఠాణీల వంటి శాకాలను వండుకు తినాలి. తీపి, పులుపు తగ్గించి, కారంగా ఉన్న ఊరగాయలు తింటే మంచిది. శరీరానికి నలుగు పెట్టుకుని సాన్నం (ఉద్వర్తనం), వ్యాయామాలు మంచిది. స్నానానంతరం 'కుంకుమ పువ్వు, కర్పూర చందనం' వంటి సుగంధ్ర ద్రవ్యాలు శరీరానికి మంచివి. ఇవి క్రిమి హరంగా ఉపకరిస్తాయి.

అల్లం లేక శొంఠి (శృంగవేర) వేసి మరిగించిన నీటిని తాగాలి. స్వచ్ఛమైన తేనె వాడుకోవాలి.

(వాగ్భటాచార్యుని శ్లోకంలో: తీక్ష్ణ, లఘు, రూక్ష భోజనైః, వ్యాయామ ఉద్వర్తన; శృంగవేరాంబు వంటి పదాలు కనిపిస్తాయి)

ప్రాచీన ఆయుర్వేద వైద్య ఆచార్యులు వైరస్, బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిములను వివరిస్తూ క్రిమి/కృమి శబ్దంతో పాటు 'గ్రహ, భూత, పిశాచ, రాక్షస' పదాలను కూడా ఉపయోగించారు. ఋతు సంధి సమయాలలో వీటి ప్రాబల్యం అధికమౌతుంది. ఇవి హాని చేసే స్రోతస్సుల (సిస్టమ్స్) నుబట్టి కలిగే లక్షణాలను వివరించారు. ప్రాణావహ స్రోతస్సు (ముక్కు నుంచి ఊపిరి తిత్తుల వరకు) నకు సంబంధించి, 'తుమ్ములు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఆయాసం, జ్వరం' వంటి లక్షణాలను వర్ణించారు. కొన్నిరకాల సూక్ష్మాంగ జీవులు వాయు కాలుష్యం ద్వారా సంక్రమించి ప్రజా వినాశనానికి (ఎండెమిక్స్/ఎపిడెమిక్స్) దారి తీస్తాయని చెప్పారు. అటువంటి క్రిములకు మనం పెట్టే పేరు ఏదైనా లక్షణాలను బట్టి చికిత్స వర్ణించారు. పరిశుభ్రత, వ్యాధి క్షమత్వక శక్తిని పెంపొందించుకోవటం నివారణా సూత్రాలలో ప్రాధాన్యత వహిస్తాయి.

ప్రస్తుతపు కొరోనా వ్యాధికి సంబంధించి నివారణ, చికిత్సల గురించి చూద్దాం.

నివారణ:

ఆహారం: పైన చెప్పినట్లు తేలికపాటి ఆహారం, వేడివేడిగా ఉండే తాజా శాకాహారం మంచిది. బయటి పదార్థాలు, ముఖ్యంగా జంక్, ఫాస్ట్ ఫుడ్స్, పానీయాలు, ఐస్ క్రీములు విడిచిపెట్టాలి.

విహారం: తేలికపాటి వ్యాయామం. ఇంట బయట పరిశుభ్రత ముఖ్యం. సాంబ్రాణి ధూపాన్ని ప్రతి నిత్యం రెండు సార్లు ప్రయోగించి ఇంటిని, దుస్తుల్ని పరిశుభ్రం చేసుకోవాలి. ముక్కుకు గుడ్డను అడ్డు పెట్టుకోవటం, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండటం మంచిది. వేప కొమ్ములు, మామిడి ఆకుల తోరణాలు ఇంట్లో ఉంటే అవి సూక్ష్మక్రిముల్ని పీల్చేసుకుంటాయన్నది పరిశోధనా ఫలితాలలో ఒకటి.

ఔషధాలు: 'లశునాది కషాయం' : 30 మి.లీ. (ఆరు చెంచాలు) రెండు పూటలా తాగాలి.

తయారీ విధానం: ఐదు గ్రాముల అల్లం ముక్క, ఐదారు వెల్లుల్లి రెబ్బలు కొద్దిగా దంచి పావు లీటరు నీళ్లలో మరిగించాలి. మరుగుతున్నప్పుడు రెండు చిటికెల పసుపు, ఆరు చిటికెలు దాల్చిన చెక్క చూర్ణం దాంట్లో వేసి, మూడు వంతులు ఇగర గొట్టాలి. మిగిలినదాన్ని వడగట్టి రెండు భాగాలుగా ఉదయం, సాయంత్రం తాగాలి. ఎంతకాలం తాగినా పరవాలేదు.

ఉసిరికాయ: దేశీ ఉసిరి (ఆమలకి) మంచిది. ఒక కాయ రోజూ తినటం మంచిది లేదా 5.మి.లీ. (ఒక చెంచా) రసం తేనెతో సేవించాలి లేదా ఎండబెట్టి తయారుచేసిన పొడి (ఆమలకీ చూర్ణం) 3 గ్రా.లు తేనెతో రోజూ ఒకసారి సేవించాలి.

వ్యోషాదివటి లేదా కంఠసుధారస మాత్రలు (ఆయుర్వేద షాపులలో దొరుకుతాయి): ఒక్కొక్క మాత్రను చప్పరిస్తూ తినాలి. రోజులో ఐదారు వరకు తినవచ్చు.

చికిత్స: *1. త్రిభువన కీర్తి రస మాత్రలు:* ఉదయం ఒక మాత్ర

2. **మహాలక్ష్మీవిలాసరస మాత్రలు:** రాత్రి ఒక మాత్ర మూడు వారాల వరకు వాడుకోవచ్చు.

వైద్యుని పర్యవేక్షణ ముఖ్యం

గమనిక: నివారణకు చెప్పినవి కూడా చికిత్సకు ఉపకరిస్తాయి. మహాలక్ష్మీవిలాసరస మాత్రలు నివారణకు కూడా వాడుకోవచ్చు. ఊపిరితిత్తుల క్షమత్వం పెరుగుతుంది.

- డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

మహిళ చేతిలో మెగాఫోన్

డైరెక్టర్‌ని కెప్టెన్ ఆఫ్ ది షిప్ అంటారు. సినీ నావకు ఎప్పుడూ మగాళ్లే కెప్టెన్‌లుగా ఉంటారు. కాని ఈ నాయకత్వం మాకూ వచ్చు అని నిరూపించారు మహిళా డైరెక్టర్లు. మీరా నాయర్, దీపా మెహతా వంటి తొలితరం దర్శకుల తర్వాత దాదాపు డజను మంది డైరెక్టర్లు మెగాఫోన్‌ను చేత ధరించారు. వీరు హిట్స్, సూపర్‌హిట్స్ మాత్రమే కాదు బ్లాక్‌బస్టర్స్ ఇస్తున్నారు.

మహిళా దినోత్సవం స్పెషల్/ బాలీవుడ్ ఉమన్ డైరెక్టర్స్

'చపాక్' సెట్‌లో మేఘనా గుల్జార్, దీపిక

హిందీ సినిమా పరిశ్రమలో హీరోలు పంజాబీ నేపథ్యం నుంచి వస్తే హీరోయిన్లు ముస్లిం నేపథ్యం నుంచి వచ్చేవారు. హిందీ సినిమాలలో స్త్రీలను నటనకు మాత్రమే అనుమతించారు– గత్యంతరం లేదు కాబట్టి. సాంకేతిక రంగంలో కాని, దర్శకత్వ రంగంలో కాని స్త్రీ రావడం హిందీలో ఏమిటి మిగిలిన ఏ భాషలో అయినా 1980ల వరకూ చాలా కష్టంగా ఉండేది. ఇందుకు కారణం సినిమా షూటింగ్ శారీరక శ్రమతో కూడినది. లొకేషన్లను బట్టి దూర ప్రాంతాలకు వెళ్లాలి. సాంకేతిక రంగం అంటే చాలా రకాల పనులు సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అందుకని స్త్రీలకు ప్రవేశం లేకుండా పోయింది. కాని ఈ పరిస్థితి మెల్లగా మారింది. హిందీలో మహిళలు మెగాఫోన్ పట్టడానికి ముందుకు వచ్చారు. మీరా నాయర్ 'సలామ్ బాంబే', సాయి పరాంజపె 'స్పర్శ్', దీపా మెహతా 'ఫైర్' చిత్రాలతో స్త్రీలు మేలిమి సినిమాలు తీయగలరని, యూనిట్‌ని హ్యాండిల్ చేయగలరని, కెమెరాతో కథ చెప్పగలరని నిరూపించారు. వీరి స్ఫూర్తి కొనసాగినా స్త్రీలు కొంచెం మెల్లగానే దర్శకులుగా స్థిరపడుతూ వచ్చారు. ముఖ్యంగా గత పదేళ్లుగా చాలామంది మహిళా దర్శకులు సినిమాలు తీస్తూ సక్సెస్ అవుతున్నారు.

నందితా దాస్: నటి నందితా దాస్ డైరెక్టర్‌గా రెండు సినిమాలు తీశారు. రెండూ కూడా సందేశాత్మకమైనవే. ఒకటి గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో 'ఫిరాక్'. రెండు దేశ విభజన సమయంలో ఒక కథకుని కథ 'మంటో'. 'ఫిరాక్'లో ఒక ముసలి గాయకుడిగా ముఖ్యపాత్ర పోషించిన నసీరుద్దిన్ షా అల్లర్ల సమయంలో మనుషులలో బయటికి వచ్చే క్రూరత్వానికి చలించిపోతాడు. హిందూ ముస్లింల మధ్య అంతరం పెంచుతున్నది ఎవరు అని ఈ సినిమా ప్రశ్నిస్తుంది. నాగరికులుగా కనిపించేవారు కూడా ఎంత ద్వేషాన్ని లోపల గూడు కట్టుకుని ఉంటారో చూపుతుంది ఈ సినిమా. ఆ తర్వాత నందితా దాస్ 'మంటో' సినిమా తీశారు. ఇది దేశ విభజనకు ముందు మన దేశంలో ఉన్న ప్రఖ్యాత కథకుడు సాదత్ హసన్ మంటో బయోపిక్. మంటోగా నవాజుద్దీన్ సిద్దిఖీ నటించాడు.



జోయా అఖ్తర్: 'లక్ బై చాన్స్' సినిమాతో దర్శకురాలైంది జోయా అఖ్తర్. జావేద్ అఖ్తర్ కుమార్తె, ఫర్హాన్ అఖ్తర్ సోదరి అయిన జోయా తన రెండవ సినిమా 'జిందగీ నా మిలేగీ దుబారా' సినిమాతో బ్లాక్‌బస్టర్ ఇచ్చారు. ముగ్గురు స్నేహితులు బ్యాచిలర్ పార్టీకి బయలుదేరి తమ తమ గమ్యాలను కనుగొనడమే ఈ కథ. హృతిక్ రోషన్, అభయ్ డియోల్, ఫర్హాన్ అక్తర్ నటించారు. ఈ సినిమాతో జోయా టాప్ డైరెక్టర్‌గా మారారు. ఆ తర్వాత తీసిన 'దిల్ ధడక్ నే దో' హిట్ అయ్యింది. మొన్నటి 'గల్లీ బాయ్' అయితే 2019లో టాప్ గ్రాసర్‌గా నిలిచింది. మురికివాడల్లో రాప్ సింగర్‌గా ఉండే ఒక కుర్రాడి కథ ఇది. రణ్‌వీర్ సింగ్ నటించాడు. కొత్త తరహా కథనం అనే పేరు తెచ్చుకుందీ సినిమా.



మేఘనా గుల్జార్: 2002లో 'ఫిల్హాల్' సినిమాతో దర్శకురాలిగా మారింది మేఘనా గుల్జార్. నటి రాఖి, గీతకర్త గుల్జార్ కుమార్తె అయిన మేఘనా 'జస్ట్ మేరీడ్', 'దస్ కహానియా' (ఒక ఎపిసోడ్) సినిమాలకు దర్శకత్వం వహించినా దాదాపు 10 ఏళ్ల విరామం తర్వాత 'తల్వార్' సినిమాతో రీఎంట్రీ ఇచ్చారు. సంచలనం సృష్టించిన ఢిల్లీ ఆరుషీ కేసు నేపథ్యం ఆధారంగా 'తల్వార్' తయారైంది. మేఘనా గుల్జార్‌కు మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇక ఆలియా భట్ లీడ్ రోల్‌లో ఆమె పాకిస్తాన్‌లో భారతీయ ఏజెంట్‌గా నటించిన సినిమా 'రాజీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక ఇటీవల దీపికా పడుకోన్‌తో తీసిన 'చపాక్' వార్తలలో నిలిచింది. యాసిడ్ దాడి నుంచి బయట పడి ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్న లక్ష్మీ అగర్వాల్ జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమా దీపికాకే కాక, మేఘనాకు కూడా మంచి పేరు తెచ్చి పెట్టింది.

ఫర్హా ఖాన్: ఒక మహిళా దర్శకురాలు కమర్షియల్ సక్సెస్‌లను తీయగలదు అని తిరుగులేని విధంగా నిరూపించారు ఫర్హా ఖాన్. కొరియోగ్రాఫర్‌గా తన కున్న అనుభవం మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా తీసేందుకు ఉపయోగపడింది. షారూక్ ఖాన్‌తో ఈమె తీసిన సినిమాలు సూపర్ డూపర్ హిట్స్‌గా నిలిచాయి. 'మై హూ నా', 'ఓమ్ శాంతి ఓమ్', 'హాపీ న్యూ ఇయర్' సినిమాలు కాసుల వర్షం కురిపించాయి. ఓమ్ శాంతి ఓమ్ సినిమా దీపికా పడుకోన్‌ను రాత్రికి రాత్రి సూపర్‌స్టార్‌ని చేసింది. మంచి పాటలు, కామెడీ ఉండేలా ఫర్హా జాగ్రత్త పడటం సక్సెస్‌కు ఒక కారణం. అక్షయ్ కుమార్‌తో తీసిన 'తీస్ మార్ ఖాన్' యావరేజ్‌గా నిలిచింది. అయితే ఇందులోని పాట 'షీలా కి జవానీ' టాప్ ఐటమ్ నంబర్ అయ్యింది.





గౌరీ షిండే: శ్రీదేవితో 'ఇంగ్లిష్ వింగ్లిష్' తీసి దేశవ్యాప్త ప్రేక్షకులను ఆకర్షించిన దర్శకురాలు గౌరీ షిండే. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే కూడా ఆమే సమకూర్చారు. స్త్రీకి చదువు లేకపోతే, ఇంగ్లిష్ వంటివి మాట్లాడకపోతే ఆమెకు కుటుంబంలో దొరికే మర్యాద, తద్వారా సంఘంలో లభించే మర్యాద ఎలా ఉంటుంది... ఆ మర్యాద కోసం స్త్రీ ఎంత పట్టుదలగా ప్రయత్నిస్తుంది ఈ సినిమాలో గౌరి షిండే చూపించారు. శ్రీదేవికి చాలా మంచి పేరు తెచ్చిన సినిమా ఇది. ఆ తర్వాత గౌరి షిండే ఆలియా భట్, షారుక్‌ఖాన్‌లతో 'డియర్ జిందగీ' తీశారు. మానసిక అయోమయాల్లో ఉన్న అమ్మాయికి జీవితాన్ని అర్థం చేయించి ముందుకు నడిపించిన సైకియాట్రిస్ట్ కథ ఇది. 22 కోట్లతో సినిమా తీస్తే 100 కోట్లు వచ్చాయి.

రీమా కగ్తీ: రచయిత్రిగా ప్రవేశించి దర్శకురాలిగా మారిన రీమా కగ్తీ తన మొదటి సినిమాగా 'హనీ మూన్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు దర్శకత్వం వహించారు. హనీమూన్ కోసం గోవాకు నాలుగు రోజుల ట్రిప్‌కు బయలుదేరిన ఆరు జంటలు ఆ నాలుగు రోజుల్లో ఎటువంటి ఘర్షణకు, స్వీయ దర్శనానికి లోనయ్యారనేది ఈ కథ. షబానా ఆజ్మీ, బొమన్ ఇరానీ, అమీషా పటేల్ తదితరులు నటించారు. అయితే ఆ తర్వాత ఆమిర్‌ఖాన్‌తో తీసిన 'తలాష్' రీమాకు ఇంకా ఎక్కువ పేరు తెచ్చి పెట్టింది. సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రీమా చాలా ప్రతిభావంతంగా తీర్చిదిద్దింది. 1948 సమ్మర్ ఒలింపిక్స్‌లో హాకీలో భారత్ గోల్డ్‌మెడల్ సాధించిన కథను 'గోల్డ్'గా తీసి మరో సూపర్‌హిట్ సాధించారు రీమా. అక్షయ్ కుమార్ ఇందులో హీరో.



మోకాళ్ల నొప్పులు తగ్గుతాయా?

హోమియో కౌన్సెలింగ్స్

నా వయసు 65 ఏళ్లు. నాకు గత కొంతకాలంగా మోకాళ్లలో నొప్పులు వస్తున్నాయి. మెట్లు ఏమాత్రం ఎక్కలేకపోతున్నాను. హోమియో చికిత్స ద్వారా నా సమస్యను పరిష్కారించేందకు అవకాశం ఉందా? దయచేసి వివరించండి.

– ఎమ్. అనసూయ, నాగోలు

చాలామందిలో మోకాళ్ల నొప్పులు సాధారణంగా మోకాలి ప్రాంతంలోని కీళ్లు అరగడం వల్ల వస్తాయి. ఇలా మోకాళ్ల నొప్పులు రావడం వల్ల నడవలేకపోవడం, కింద కూర్చుని మళ్లీ పైకి లేవడంలో చాలా ఇబ్బంది, మెట్లు ఎక్కలేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. చాలామందిలో మోకాళ్ల నొప్పులు రావడానికి వారి స్థూలకాయం/ఊబకాయం లేదా అధిక బరువే మొదటి కారణం. దేహం తాలూకు బరువు వివిధ దశల్లో కీళ్ల మీద పడుతుంది. నడిచేటప్పుడు ఆ బరువు నాలుగు రెట్లు అధికమై మోకాళ్ల మీద మరీ ఎక్కువగా పడుతుంది. ఇక మెట్లు ఎక్కుతున్నప్పుడైతే ఈ భారం 6 నుంచి 7 రెట్లు అధికంగా ఉంటుంది. కీళ్లు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందీ ఉండదు కానీ... అవి దెబ్బతిన్నప్పుడు మాత్రం సమస్యలు వస్తాయి. శారీరక శ్రమ ఎక్కువ చేయడం, కీలు మీద ఒత్తిడి పడే పనులు చేయడం కూడా మోకాళ్ల నొప్పులకు కారణమే. రుమటాయిడ్ ఆర్థరైటిస్ లాంటి సమస్య ఉన్నప్పుడు కూడా కీళ్లనొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది.

డా॥ కె. రవికిరణ్,
మాస్టర్స్ హోమియోపతి,
హైదరాబాద్

లక్షణాలు :

- కూర్చుని లేచే సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కీలు బిగుసుకుపోవడం తెల్లవారుజామున ఎక్కువగా కనిపిస్తుంది.
- లేచేటప్పుడు, కదిలించేటప్పుడు, నడిచేటప్పుడు మోకాలి నుంచి శబ్దం వస్తుంటుంది.
- మోకాలిపై వాపు ఉంటుంది. నొక్కితే నొప్పి ఎక్కువవుతుంది.
- నొప్పి మూలంగా మెట్లు ఎక్కడం, దిగడంలో ఇబ్బంది ఎదురవుతుంది.

హోమియో చికిత్స :

మోకాలి నొప్పులను దూరం చేయడంలో హోమియో మందులు ఎంతో చక్కగా పనిచేస్తాయి. ఇతర వైద్య విధానాల వల్ల కేవలం తాత్కాలికమైన ఉపశమనం లభిస్తుంది. కానీ హోమియో చికిత్స ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కాబట్టి మీరు నిరభ్యంతరంగా హోమియో చికిత్స తీసుకొని మీ నొప్పిని దూరం చేసుకోవచ్చు.

ఒంటిపైన తెల్ల మచ్చలు... తగ్గేదెలా?

ఫ్యామిలీ డాక్టర్

నా వయసు 48 ఏళ్లు. నా శరీరమంత తెల్లమచ్చలు వచ్చాయి. మొదట్లో కాస్త చిన్నవిగా ఉండి, ఇప్పుడు క్రమంగా పెద్దవవుతున్నాయి. ఆ మచ్చలు అసహ్యంగా కనిపిస్తుండటంతో నలుగురిలోకి వెళ్లలేకపోతున్నాను. నాకు హోమియోలో పరిష్కారం సూచించండి.

– ఎమ్. సైదులు, నల్లగొండ

మీరు ఎదుర్కొంటున్న ఈ సమస్యను సాధారణ పరిభాషలో బొల్లి, వైద్యపరిభాషలో ల్యూకోడెర్మా అంటారు. చర్మం వెలుపల పొరల్లో ఉండే మెలనోసైట్ కణజాలాలు విడుదల చేసే 'మెలనిన్ అనే ప్రత్యేక పదార్థం, టైరోసినేజ్ అనే ఎంజైమ్ వల్ల సరైన మోతాదులో విడుదల అవుతుంది. ల్యూకోడెర్మా సమస్య ఉన్నవారిలో ఈ ఎంజైము లోపిస్తుంది. దాంతో మెలనిన్ విడుదలకు అంతరాయం ఏర్పడి, చర్మం రంగును కోల్పోతుంది.

- బొల్లి వ్యాధికి ముఖ్యమైన కారణాల్లో మానసిక ఒత్తిడి ఒకటి. ఇది స్త్రీ, పురుషుల తేడా లేకుండా, వయసుతో సంబంధం లేకుండా రావచ్చు. డిప్రెషన్, యాంగ్జైటీ న్యూరోసిస్ మొదలైన మానసిక పరిస్థితులు దీనికి దారితీయవచ్చు.
- పోషకాహారలోపం కూడా బొల్లి వ్యాధికి దారి తీయవచ్చు.
- జన్యుపరమైన కారణాలతో వంశపారంపర్యంగా కూడా వ్యాధి రావచ్చు.
- దీర్ఘకాలిక గ్యాస్ట్రిక్ సమస్యలు : ఆహారంలో రాగి, ఇనుము మొదలైన ధాతువులు లోపించడం వల్ల విటమిన్లు, ప్రోటీన్ల వంటి పోషకాహార లోపం వల్ల గానీ, అమీబియాసిస్, బద్దె పురుగుల వంటి పరాన్నజీవుల వల్లగానీ తెల్ల మచ్చలు కనిపించవచ్చు.
- మందులు, రసాయనాలు దుష్ఫలితాలు, క్వినోన్స్, క్లోరోక్విన్, యాంటీబయాటిక్స్ వంటి పరిశ్రమల్లో పనిచేయడం లేదా వాటిని సరైన మోతాదులో వాడకపోవడం వల్ల కూడా బొల్లి వ్యాధి వచ్చే అవకాశం ఉంది.
- కొన్ని ఎండోక్రైన్ గ్రంథులు స్రవించే హార్మోన్స్ లోపాలు, డయాబెటిస్‌లో వంటి వ్యాధులలో తెల్లమచ్చలు ఎక్కువగా కనిపించే వీలుంది.
- వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గడం, మన వ్యాధి నిరోధకత మనకే ముప్పుగా పరిణమించే ఆటో ఇమ్యూన్ డిసీజెస్ వల్ల మన సొంతకణాలే మనపై దాడి చేయడం వల్ల కూడా బొల్లి సోకే అవకాశం ఉంది.

లక్షణాలు : మొదట చిన్న చిన్న మచ్చలుగా ఏర్పడి, ఆ తర్వాత శరీరం అంతటా వ్యాపిస్తాయి. చివరకు తెలుపు రంగులోకి మారతాయి. చర్మం పలుచబడినట్లు అవుతుంది. కొన్నిసార్లు ఎండవేడిని తట్టుకోలేరు. జుట్టు రంగుమారడం, రాలిపోవడం, వంటి లక్షణాలు ఉంటాయి. ఈ మచ్చలు ముఖ్యంగా చేతులు, పెదవులు, కాళ్ల మీద రావచ్చు. ఇవి పెరగవచ్చు లేదా అని పరిమాణంలో ఉండిపోవచ్చు.

చికిత్స: తెల్లమచ్చలకు హోమియోలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. తూజా, నైట్రిక్ యాసిడ్, నేట్రమ్‌మ్యూరియాటికమ్, ఆర్సెనికమ్ ఆల్బమ్, లాపిస్ అల్బా, రస్టాక్స్ వంటి మందులతో తెల్లమచ్చలకు సమర్థంగా చికిత్సను అందించవచ్చు.

డాక్టర్ టి.కిరణ్‌కుమార్,
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
శనివారం
7-3-2020

కొత్త సినిమా షురూ


శర్వానంద్

శర్వానంద్‌తో తొలిసారి 'పడి పడి లేచె మనసు' వంటి ప్రేమ కథా చిత్రాన్ని నిర్మించిన సుధాకర్ చెరుకూరి రెండో చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం శర్వానంద్ పుట్టినరోజుని పురస్కరించుకుని కొత్త సినిమాని ప్రకటించారు సుధాకర్. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై ఆయన నిర్మించనున్న ఈ చిత్రానికి కిశోర్ తిరుమల దర్శకత్వం వహించనున్నారు. ''ఇది ఫుల్ ఎంటర్‌టైనింగ్ మూవీ. ఎప్పుడు ప్రారంభం అవుతుందనేది త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

గుడ్‌న్యూస్ చెబుతారా?

సమంత

సమంత-నయనతార ఓ సినిమాలో కలసి నటించాల్సి ఉంది. అయితే ఈ సినిమాలో నుంచి సమంత తప్పుకున్నారట. మరి.. గుడ్‌న్యూస్ అన్నారేంటీ అనుకుంటున్నారా? సమంత ఓ గుడ్‌న్యూస్ చెప్పడానికే ఈ ప్రాజెక్ట్‌లో కొనసాగలేకపోతున్నారని టాక్. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా 'కాదు వాక్కుల రెండు కాదల్' అనే సినిమా తెరకెక్కనుంది. ఇందులో సమంత, నయనతారలను హీరోయిన్లుగా అనుకున్నారు. అయితే తల్లి కాబోతున్నారనే కారణంగానే ఈ ప్రాజెక్ట్‌లో నుంచి సమంత తప్పుకోవాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. ఇదే నిజమైతే ఆ గుడ్‌న్యూస్‌ని ఎప్పుడు ప్రకటిస్తారో చూద్దాం.

పృథ్వీరాజ్ '81

పృథ్వీరాజ్

ఎప్పటికప్పుడు సరికొత్త కథలను ఎంపిక చేసుకుంటూ ఉంటారు మలయాళ నటుడు పృథ్వీరాజ్. తాజాగా ఆయన 'కరాచీ 81' అనే సినిమాను ప్రకటించారు. ఈ సినిమాలో ఐదారు గెటప్స్‌లో కనిపిస్తారట. కేయస్ బావ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. 1971 ఇండియా-పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో పృథ్వీరాజ్ రా ఏజెంట్ పాత్రలో నటించనున్నారు. సినిమాలో కొంత భాగం వరకూ 81 ఏళ్ల వృద్ధుడిగా కనిపిస్తారు. ఆయన లుక్‌ను కూడా విడుదల చేశారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

నటుడు జనార్ధన్ రావు మృతి


జనార్ధన్ రావు

సీనియర్ నటుడు ముప్పాళ్ల జనార్ధన్ రావు(74) శుక్రవారం ఉదయం గుండెపోటుతో చెన్నై సాలిగ్రామంలో కన్నుమూశారు. గుంటూరు జిల్లా పొనిగళ్ల గ్రామంలో 1946లో జన్మించిన జనార్ధన్ చెన్నైలో స్థిరపడ్డారు. తెలుగు, తమిళ సహా వివిధ భాషల్లో వెయ్యికి పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా తెలుగులో 'జానకిరాముడు, మజ్ను, కొండవీటి సింహం, పెదరాయుడు, అభిలాష, అమ్మోరు, గోరింటాకు, గోకులంలో సీత, తలంబ్రాలు'.. వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిగా నటించిన చిత్రం 'జనతా గ్యారేజ్'. పలు టీవీ సీరియళ్లలోనూ నటించారాయన. చెన్నైలో ఒక రికార్డింగ్ స్టూడియోను లీజుకు తీసుకుని నిర్వహించారు. భాగస్వామ్యంలో కొన్ని అనువాద చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు. ఆయన మృతిపట్ల తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులు సంతాపం తెలిపారు. జనార్ధన్ రావు అంత్యక్రియల్ని కుటుంబ సభ్యులు శుక్రవారమే నిర్వహించారు.

ది టార్గెట్

'దక్షయజ్ఞం'లో ఓ దృశ్యం

యోస్ ఈవీఎన్ చారి సారథ్యంలో కస్తూరి ఫిల్మ్స్, హంస క్రియేషన్స్‌పై వి. చిన్న శ్రీశైలం యాదవ్, బొర్ర జ్ఞానేశ్వర ముదిరాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వి. చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ- ''మా మిత్రుడు ఈవీఎన్ చారిగారితో ఈ చిత్రం నిర్మించటం హ్యాపీ. ఈ ఏడాది విజయవంతమైన చిత్రాల్లో 'దక్షయజ్ఞం' ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''యువత ఆశించే థ్రిల్లింగ్ అంశాలు మా చిత్రంలో ఉంటాయి'' అన్నారు బొర్రా జ్ఞానేశ్వర ముదిరాజ్. ''ఇప్పటి వరకూ 8 చిత్రాలు నిర్మించా.. ఈ కొత్త సంవత్సరంలో 9వ చిత్రం నిర్మిస్తున్నాను'' అన్నారు ఈవీఎన్ చారి. ''హత్య నేపథ్యంలో వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది'' అన్నారు కృష్ణ తోట. ఈ చిత్రానికి సమర్పణ: మహతి సాయి జశ్వంత్, సంగీతం: ఘనశ్యాం, సహనిర్మాత: పి. శ్యామ్ రావు.

సూర్య, శివప్రసాద్, మధులగ్న, భవానీ చౌదరి, శ్రీధర్ రాజు, విడదాల శివ, బాతినేని శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'దక్షయజ్ఞం'. 'ది టార్గెట్' అన్నది ఉపశీర్షిక. కృష్ణ తోట దర్శకుడు. మెట్రో స్టూడి

అనుష్క

ఆ అమ్మాయి ఒక్కటే చేసిందంటారా?

''అక్కడ చీకట్లో ఎవరో ఎటాక్ చేశారంట.. కానీ ఎవరో ఏంటో కనిపించలేదంటున్నారు', 'ఒక ఘోస్ట్ ఇదంతా చేసిందని యాక్సెప్ట్ చెయ్యడానికి నా సెన్సిబిలిటీస్ ఒప్పుకోలేదు', 'నిన్న ఆర్చనేజ్‌కు వెళ్లిన మాకు చాలా షాకింగ్ విషయాలు తెలిశాయి', 'ఇదంతా ఓ పాతికేళ్ల అమ్మాయి ఒక్కటే చేసిందంటారా?'... వంటి 'నిశ్శబ్దం' చిత్రం ట్రైలర్‌లోని డైలాగులు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. అనుష్క ప్రధాన పాత్రలో హేమంత్ మధుకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నిశ్శబ్దం'. క్రితి ప్రసాద్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 2న తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల వుతోంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను హీరో నాని తన ట్విట్టర్ ద్వారా విడుదల చేసి, ''ఇదిగో.. మా స్వీటీ (అనుష్క) స్వీటెస్ట్ 'నిశ్శబ్దం' ట్రైలర్.. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ఇది'' అన్నారు. ''ఓ పాడుబడిన ఇంట్లో ఉన్న అనుష్క, మాధవన్ కొన్ని భయానకమైన విషయాలను చూస్తారు.. ఆ ఇంట్లో ఏముందోనని పోలీసుల అన్వేషణతో సినిమా నడుస్తుంది. మరో హీరోయిన్ అంజలి అమెరికన్ పోలీ సాఫీసర్ పాత్రలో కనపడుతుంది. మాట్లాడలేని, చెవులు వినపడని బధిర అమ్మాయి సాక్షి పాత్రలో నటించిన అనుష్క తన సైగలతో అంజలికి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తుంటుంది. అసలు అనుష్క బెస్ట్ ఫ్రెండ్ సోనాలి ఎవరు? దెయ్యం ఇల్లు ఏంటి? అందులో జరిగే కథేంటి?'' వంటి విషయాలన్నీ తెలియాలంటే ఏప్రిల్ 2 వరకూ ఆగాల్సిందే అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. మాధవన్, మైఖేల్ మ్యాడసన్, షాలినీ పాండే, సుబ్బరాజు, శ్రీనివాస అవసరాల తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: షానియల్ డియో, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అహం బ్రహ్మాస్మి అదిరిపోతుంది

- మంచు మనోజ్

మనోజ్, మోహన్‌బాబు, రామ్‌చరణ్

మూడేళ్ల విరామం తర్వాత మంచు మనోజ్ హీరోగా రూపొందుతున్న 'అహం బ్రహ్మాస్మి' చిత్రానికి శుక్రవారం కొబ్బరికాయ కొట్టారు. ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియాభవానీ శంకర్ కథానాయిక. విద్యా నిర్వాణ, మంచు ఆనంద్ సమర్పణలో ఎంఎం ఆర్ట్స్ బ్యానర్‌పై మనోజ్ కుమార్ మంచు, నిర్మలాదేవి మంచు నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పూజా కార్యక్రమాల అనంతరం మనోజ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో రామ్‌చరణ్ క్లాప్ ఇచ్చారు. మంచు లక్ష్మి, చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్చాన్ చేశారు. లక్ష్మి కుమార్తె బేబీ విద్యా నిర్వాణ మంచు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించింది. నటుడు మోహన్‌బాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణలు దర్శకుడికి స్క్రిప్ట్ అందజేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ- ''శ్రీకాంత్ రెడ్డి చెప్పిన కథ బాగా నచ్చడంతో మూడేళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. యంగ్ టీమ్‌తో పనిచేస్తున్న ఈ సినిమా అదిరిపోతుంది. ఈ చిత్రంతో ప్రేక్షకుల్ని, మా అభిమానుల్ని అలరిస్తానని ఆశిస్తున్నా'' అన్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి మాట్లాడుతూ- ''తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా మూవీగా రూపొందిస్తున్న చిత్రమిది. ఈ నెల 11నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. మే నెలలో పీటర్ హెయిన్స్ సారథ్యంలో హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తాం. జూన్‌లోగా సినిమాను పూర్తి చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంలో పాటలు, నేపథ్య సంగీతం కొత్తగా ఉంటాయి. అనంత శ్రీరామ్, రామజోగయ్యశాస్త్రి చక్కని పాటలు రాశారు'' అన్నారు సంగీత దర్శకుడు అచ్చు రాజమణి. ''ఈ చిత్రంలో ఒక పాటకు సంగీతాన్ని అందిస్తున్నా'' అన్నారు రమేష్ తమిళమణి. ''మంచి సినిమాలో నన్ను భాగం చేసిన మోహన్‌బాబుగారికి, మనోజ్, శ్రీకాంత్‌గార్లకు ధన్యవాదాలు'' అన్నారు ప్రియాభవానీ శంకర్. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ చల్లగుళ్ల.

త్రిపాత్రాభినయం చేయబోతున్నా

విశాల్

హీరో విశాల్ - దర్శకుడు మిస్కిన్ కాంబినేషన్‌లో 'తుప్పారివాలన్' (తెలుగులో డిటెక్టివ్) అనే చిత్రం వచ్చింది. మంచి సక్సెస్ అందుకుంది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్ తెరకెక్కుతుంది. మిస్కిన్ దర్శకత్వంలోనే విశాల్ హీరోగా నటిస్తూ, ఈ సీక్వెల్‌ను నిర్మిస్తున్నారు. బడ్జెట్ సమస్యల కారణంగా సినిమా నుంచి తప్పుకున్నారు దర్శకుడు మిస్కిన్. దాంతో దర్శకత్వ బాధ్యతలను చేపట్టారు విశాల్. ''దర్శకత్వం చేయాలనే ఆలోచన నాకు ఎప్పుట్నుంచో ఉంది. కానీ ఇలా వస్తుందని ఊహించలేదు. ఇది మారువేషంలో వచ్చిన అదృష్టంలా భావిస్తున్నాను. సినిమా మేకింగ్‌లో అన్ని బాధ్యతలు దర్శకుడి మీదే ఉంటాయి. డైరెక్షన్ చేయడానికి ఎగ్జయిటింగ్‌గా ఉన్నాను. ఈ సినిమాకు త్రిపాత్రాభినయం (నటన- నిర్మాణం- దర్శకత్వం) చేయబోతున్నాను'' అన్నారు విశాల్.

లావణ్యా త్రిపాఠి

లావణ్యా ఐఏయస్

లావణ్యా త్రిపాఠికి రెండు తమిళ సినిమాలు చేసిన అనుభవం ఉంది. 2014లో వచ్చిన 'బ్రహ్మమ్', 2017లో వచ్చిన 'మాయవాన్' సినిమాల్లో నటించారామె. తాజాగా మూడో తమిళ సినిమా కమిటయ్యారు. అథర్వ మురళి హీరోగా నూతన దర్శకుడు రవీంద్ర మాధవ ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా లావణ్యా త్రిపాఠి నటించనున్నారు. ఈ సినిమాలో ఐఏయస్ కావాలనుకునే అమ్మాయిగా కనిపిస్తారట లావణ్య. ఆమె పాత్ర పవర్‌ఫుల్‌గా, కథను ముందుకు తీసుకెళ్లే విధంగా ఉంటుందట. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ఇందులో అథర్వ పోలీస్ కానిస్టేబుల్‌గా నటిస్తున్నారు.

అసలేం జరిగింది?

మహేంద్రన్, కరోన్య

మహేంద్రన్, శ్రీ పల్లవి, కారుణ్య చౌదరి, కరోన్య కత్రిన్ ప్రధాన పాత్రల్లో శ్రీనివాస్ బండారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అసలు ఏం జరిగిందంటే'. ఏబీఆర్ ప్రొడక్షన్స్, జీఎస్ ఫిల్మ్స్ పతాకంపై అనిల్ బొద్ది రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ బండారి మాట్లాడుతూ- ''ఒక్క క్షణంలో మన జీవితంలో జరిగే మార్పును తెలిపే కథ ఇది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగుతుంది. ఫస్ట్ కాపీ సిద్ధమైంది. సెన్సార్ పూర్తయింది. ఈ నెల 9న ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించి, నెలాఖరులో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ''బాల నటుడిగా చాలా సినిమాల్లో నటించాను. ఈ చిత్రంలో నా పాత్ర ఒకరకంగా చెప్పాలంటే రవితేజగారి పాత్రలా అనిపిస్తుంది'' అన్నారు మహేంద్రన్. ''థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ షానీ సాల్మన్. ''ఈ చిత్రంలో సావి అనే మంచి పాత్ర చేశాను'' అన్నారు కారుణ్య చౌదరి. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: కర్ణ ప్యారసాని.

అదే నిజమైన ఉమెన్స్ డే

రకుల్

''ఉమెన్స్ డే కాన్సెప్ట్‌ని నేను పెద్దగా నమ్మను. ఉమెన్స్ డేని కేవలం ఒక్కరోజు జరుపుకోవడం ఏంటి? ఉమెన్స్ డే స్ఫూర్తిని ప్రతిరోజూ సెలబ్రేట్ చేసుకోవాలి'' అన్నారు రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల జరిగిన ఓ ఫ్యాషన్ ఈవెంట్‌లో మహిళా దినోత్సవం గురించి తన అభిప్రాయాలను ఈ విధంగా పంచుకున్నారు రకుల్.

''మెన్స్ డే అని ప్రత్యేకంగా జరుపుకోం. మరి ఉమెన్స్ డే ఎందుకు? ఉమెన్స్ డే అని ఒకరోజు పెట్టుకొని ఆ ఒక్క రోజు మాత్రమే సెలబ్రేట్ చేసుకోని మిగతా రోజులు మర్చిపోవడం కాదు. ప్రతి ఒక్కరూ పాటించాల్సిన ముఖ్యమైన విషయమేంటంటే... మన చుట్టూ ఉన్న మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి. అదే నిజమైన ఉమెన్స్ డే సెలబ్రేషన్‌లా నేను భావిస్తాను'' అంటూ, ''ఈ ఏడాది హోలీ (ఈ నెల 10) రోజు కూడా నాకు షూటింగ్ ఉంది. హోలీ ఆడటం పదో తరగతిలోనే ఆపేశాను. సంబరం కోసం చేసుకునే హోలీ వల్ల నీరు ఎంత వృథా అవుతుందో అవగాహన వచ్చింది అప్పుడే. అప్పటినుంచి కేవలం రంగులతోనే ఆడేవాళ్లం. ఇప్పుడు అది కూడా తగ్గించేశాం'' అని చెప్పారు.

నిజమైన ప్రేమ

సోనాక్షి, జీపీయస్

జీపీయస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షీ వర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ పిపాసి'. ఎస్.ఎస్. ఆర్ట్ ప్రొడక్షన్స్, యుగ క్రియేషన్స్ పతాకాలపై రాహుల్ భాయ్ మీడియా, దుర్గశ్రీ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రానికి పి.ఎస్ రామకృష్ణ (ఆర్.కె) నిర్మాత. మురళీ రామస్వామి (యం.ఆర్) దర్శకుడు. ''మా సినిమాను ఈ నెల 13న విడుదల చేయబోతున్నాం'' అన్నారు. యం.ఆర్. మాట్లాడుతూ- ''ట్రైలర్ విడుదలైన తర్వాత సినిమాకి మంచి హైప్ వచ్చింది. ఇటీవల మా సినిమా యూనిట్‌తో పాటు కొంతమంది యూత్‌కు సినిమా చూపించాం. అందరూ ఇప్పటి ట్రెండ్‌కన్నా అడ్వాన్స్‌గా ఉందన్నారు. నిజమైన ప్రేమంటే ఎలా ఉంటుందో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే'' అన్నారు. ''ట్రైలర్‌కు, ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు బజ్ వచ్చింది. త్వరలోనే మిగతా పాటలను విడుదల చేస్తాం. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు జీపీయస్.

నా మూడేళ్ల కల ఇది

- శ్రీవిద్య

త్రిష్నా, హరీష్ శంకర్, శ్రీవిద్య, నవదీప్

రాహుల్, త్రిష్నా ముఖర్జీ జంటగా నటించిన చిత్రం 'మధ'. ఇందిరా బసవ నిర్మించిన ఈ చిత్రానికి శ్రీవిద్య దర్శకురాలు. ఈ నెల 13న విడుదలవుతున్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ- ''యంగ్ ఏజ్‌లో అందరూ డబ్బులు పెట్టి సినిమా చూస్తే ఈ చిత్రదర్శకురాలు శ్రీదివ్య మాత్రం డబ్బులు పెట్టి సినిమా తీశారు. ఈ సినిమా ట్రైలర్ చూసినప్పుడు ఆమెలో చాలా ప్యాషన్ కనిపించింది'' అన్నారు. నవదీప్ మాట్లాడుతూ- ''శ్రీవిద్య నాకు ఫేస్‌బుక్ ఫ్రెండ్. నేనీ సినిమా చూశాను. నెక్స్ట్ లెవల్ మూవీ అని ఓ ప్రేక్షకునిగా చెప్పగలను. ఈ సినిమాను ఓ పెద్ద హీరోయిన్‌తో చేయమంటే తన టీమ్ కోసం ఆమె ఒప్పుకోలేదు'' అన్నారు. శ్రీవిద్య మాట్లాడుతూ- ''నా మూడేళ్ల కల ఇది. 'మధ' ప్యారలల్ మూవీ అనొచ్చు. స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలతో తీసిన ఈ చిత్రం ప్రతి అమ్మాయికి నచ్చుతుంది'' అన్నారు. ''శ్రీవిద్య కాన్సెప్ట్ చెప్పగానే, సినిమాలో ఉన్న అన్ని ఎమోషన్స్‌కి కనెక్ట్ అయ్యాను అన్నారు'' త్రిష్నా.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
7-3-2020

హారిక గేమ్ 'డ్రా'... సంయుక్త ఆధిక్యంలో ఏపీ గ్రాండ్‌మాస్టర్

ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. స్విట్జర్లాండ్‌లోని లుసానేలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో... అలెగ్జాండ్రా గోర్యాచికినా (రష్యా)తో శుక్రవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను హారిక 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణులు పోటీపడుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత హారిక, గోర్యాచికినా 3.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

మేమే ఫేవరెట్...

టి20 ప్రపంచకప్ ఫైనల్లో విజయంపై వేద ధీమా

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా నాలుగు సార్లు విశ్వ విజేత అయినప్పటికీ ఈసారి ఫైనల్లో తమ జట్టే ఫేవరెట్‌గా అనిపిస్తోందని భారత సీనియర్ బ్యాటర్ వేద కృష్ణమూర్తి తెలిపింది. ఫైనల్లో టీమిండియానే గెలుస్తుందని తనకు గట్టి నమ్మకముందని ఆమె చెప్పింది. 'ఇదంతా విధి రాత. నేను దీన్ని బాగా నమ్ముతాను. ట్రోఫీ గెలుస్తామనే విశ్వాసం ఉంది. అయితే ఈ ప్రపంచకప్ భారత్‌కు అనుకూలంగానే రూపొందించారనడం హాస్యాస్పదం. వికెట్లు, వాతావరణం సంగతెలా ఉన్నా మేం బాగా ఆడామన్నది నిర్వివాదాంశం. నిజానికి మేం ఈ మెగా టోర్నీలో ఫైనల్ చేరాలనే లక్ష్యంతో బరిలోకి దిగాం. అలా మొదటి దశను పూర్తి చేశాం. ఇప్పుడు అంతిమ దశ మిగిలుంది. ఆఖరి పోరులో ఏం చేయాలో కచ్చితంగా అదే చేస్తాం' అని వేద పేర్కొంది. భారత్ 2017లో వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓడి చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆ జట్టులో వేద కూడా ఉంది. అయితే ఫైనల్ దాకా వచ్చి ట్రోఫీని చేజార్చుకోవడం జీర్ణించుకోలేని బాధను మిగులుస్తుందని ఆమె గత పరాజయం తాలుకు జ్ఞాపకాలను వెల్లడించింది. 'వ్యక్తిగతంగా నా పాత్రను నేను చక్కగా పోషించాను. జట్టు లో అందరిని కలుపుకొని వెళ్లాను. ఏదో ఒకరిద్దరని కాకుండా... ప్రతీ ఒక్కరిని ఉత్సాహపరుస్తూనే ఉన్నాను' అని 27 ఏళ్ల వేద తెలిపింది. ఈ టోర్నీలో భారత అమ్మాయిల జట్టు అజేయంగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి మ్యాచ్‌లో ఆసీస్‌ను ఓడించే... ఈ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టడం విశేషం.

స్టార్క్, అలీసా హీలీ

అమ్మో... పవర్‌ప్లేలో వాళ్లిద్దరికి బౌలింగా?

భారత్‌తో తలపడటం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదన్న ఆసీస్ బౌలర్ మేగన్ షూట్ పవర్ ప్లేలో భారత స్టార్ బ్యాటర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలకు బౌలింగ్ చేయలేనని చెప్పింది. షూట్ వేసిన టోర్నీ ఓపెనింగ్ ఓవర్లో నాలుగు బౌండరీలు బాదిన షఫాలీ ఈ మెగా ఈవెంట్‌కే మెరుపు ఆరంభాన్నిచ్చింది. 'స్మృతి, షఫాలీ నన్ను అలవోకగా ఎదుర్కొంటారు. ముక్కోణపు సిరీస్‌లో షఫాలీ కొట్టిన సిక్సర్ ఇప్పటికీ మర్చిపోలేదు. నేను చూసిన భారీ సిక్సర్లలో అది ఒకటి. అందుకే పవర్‌ప్లేలో వారికి ఎదురుపడటం నాకిష్టం లేదు' అని షూట్ చెప్పింది. ఏదేమైనా మా వ్యూహాలు మాకుంటాయని తప్పకుండా వాటిని ఆచరణలో పెడతామని చెప్పింది.

షూట్

'ఫైనల్' ఫీల్డ్ అంపైర్లు వీరే...

ఇరు జట్ల మధ్య ఆదివారం జరిగే అంతిమ పోరాటంలో న్యూజిలాండ్‌కు చెందిన కిమ్ కాటన్, పాకిస్తానీ అహ్‌సాన్ రజా ఫీల్డు అంపైర్లు గా వ్యవహరిస్తారని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వెల్లడించింది. గ్రెగరీ బ్రాత్‌వైట్ (వెస్టిండీస్) మూడో అంపైర్‌గా ఉంటారు. అహ్‌సాన్ రజా 2017లో జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్, ఆస్ట్రేలియా సెమీస్ మ్యాచ్‌కు అంపైర్‌గా వ్యవహరించింది.

ఆమె కోసం అతడు తిరుగుముఖం

భార్య ఆడే ఫైనల్స్‌ను తిలకించనున్న స్టార్క్

మెల్‌బోర్న్: ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు ఆదివారం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసీస్ జట్టులో స్టార్క్ సతీమణి అలీసా హీలీ వికెట్ కీపర్, బ్యాటర్. మిచెల్ స్టార్క్ దక్షిణాఫ్రికా పర్యటనలో ఆస్ట్రేలియా వన్డే జట్టు తరపున సిరీస్‌లో బిజీగా ఉన్నాడు. అయినా సరే... తన భార్య ఆడే ఫైనల్ పోరును ప్రత్యక్షంగా తిలకించాలనుకున్న స్టార్క్ అంతే తంచనుగా తిరుగుముఖం పట్టేశాడు. దీంతో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పురుషుల జట్ల మధ్య శనివారం జరిగే ఆఖరి వన్డేకు స్టార్క్ దూరమయ్యాడు. ఆస్ట్రేలియా టీమ్ మేనేజ్‌మెంట్ సంతోషంగానే అతనికి అనుమతిచ్చింది. 'ఇలాంటి అవకాశం జీవితంలో ఎవరికో ఒకరికి చాలా అరుదుగా వస్తుంది. స్టార్క్‌కు ఇప్పుడా చాన్స్ వచ్చింది. కాబట్టి తన శ్రీమతి ఆడే మ్యాచ్‌కు ప్రత్యక్షంగా మద్దతుగా నిలిచేందుకు సమ్మతించాం' అని ఆస్ట్రేలియా పురుషుల జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ చెప్పాడు. మూడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ 0-2తో కోల్పోయింది. ఇక అమ్మాయిల మెగా ఫైనల్ విషయానికొస్తే... భారత్ ఈ పొట్టి ఫార్మాట్‌లో తొలిసారి టైటిల్ పోరుకు అర్హత సంపాదించగా... ఆసీస్ ఈ ఇప్పటికే నాలుగుసార్లు విజేతగా నిలిచింది. అన్నట్లు ఆసీస్ డిఫెండింగ్ చాంపియన్ కూడా! కానీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడింది.



పాండ్యా పరాక్రమం

- 55 బంతుల్లో 20 సిక్స్‌లు, 6 ఫోర్లతో 158 నాటౌట్
- డీవై పాటిల్ టి20 కప్

నవీ ముంబై: వెన్ను గాయం నుంచి పూర్తిగా కోలుకున్న భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా డీవై పాటిల్ టి20 క్రికెట్ కప్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగుతున్నాడు. గత మంగళవారం 39 బంతుల్లో 105 పరుగులు చేసిన అతను... తాజాగా శుక్రవారం బీపీసీఎల్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో తన విశ్వరూపం ప్రదర్శించాడు. రిలయెన్స్ వన్ జట్టు తరపున ఆడుతున్న పాండ్యా 55 బంతుల్లోనే 20 సిక్స్‌లు, 6 ఫోర్లతో 158 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దాంతోపాటు టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన భారత ఆటగాడిగా పాండ్యా నిలిచాడు. గతంలో ఈ రికార్డు శ్రేయస్ అయ్యర్ (147)పై ఉండేది. పాండ్యా విధ్వంసంతో తొలుత బ్యాటింగ్ చేసిన రిలయన్స్ వన్ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 238 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో బీపీసీఎల్ 134 పరుగులకే ఆలౌటై... 104 పరుగుల తేడాతో ఓడింది. ఈ మ్యాచ్‌లో రిలయన్స్ తరపున ఓపెనర్‌గా దిగిన శిఖర్ ధావన్ (3) నిరాశ పరిచాడు. మ్యాచ్‌లో పాండ్యా బౌండరీల రూపంలోనే 144 పరుగులు సాధించడం విశేషం. అనంతరం బౌలింగ్ కూడా చేసిన పాండ్యా ఒక వికెట్ తీశాడు. భువనేశ్వర్ కూడా ఒక వికెట్‌తో రాణించాడు.

బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

- మూడో వన్డేలో 123 పరుగులతో ఓడిన జింబాబ్వే
- లిటన్ దాస్, తమీమ్ సెంచరీలు

లిటన్ దాస్

తమీమ్

సిల్హెట్: ఇప్పటికే వన్డే సిరీస్‌ను చేజిక్కించుకున్న బంగ్లాదేశ్ వర్షం అంతరాయం కలిగించిన మూడో వన్డేలోనూ సత్తా చాటింది. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (109 బంతుల్లో 128 నాటౌట్; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు), లిటన్ దాస్ (143 బంతుల్లో 176; 16 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగడంతో... జింబాబ్వేతో శుక్రవారం జరిగిన చివరి వన్డేలో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 123 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా జట్టు 43 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 322 పరుగులు చేసింది. 33.2 ఓవర్లలో బంగ్లాదేశ్ 182/0తో ఉన్న సమయంలో వాన రావడంతో అంపైర్లు మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ఓపెనర్లు లిటన్ దాస్, తమీమ్ తొలి వికెట్‌కు 292 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు శుభారంభం అందించారు. వన్డేల్లో బంగ్లాదేశ్‌కు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. అనంతరం డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం జింబాబ్వే లక్ష్యాన్ని 43 ఓవర్లలో 342 పరుగులుగా నిర్ణయించారు. ఛేదనలో జింబాబ్వే 37.3 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటై ఓడింది. సికిందర్ రాజా (50 బంతుల్లో 61; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మొహమ్మద్ సైఫుద్దీన్ 4 వికెట్లు తీశాడు.

వెస్టిండీస్‌దే టి20 సిరీస్

పల్లెకెలె (శ్రీలంక): శ్రీలంకతో జరిగిన రెండో టి20లో వెస్టిండీస్ 7 వికెట్లతో నెగ్గింది. దాంతో రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. వన్డేల్లో 0-3తో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకుంది. శుక్రవారం ఈ మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 155 పరుగులు చేసింది. దసున్ శనక (24 బంతుల్లో 31; 3 ఫోర్లు, సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్ జట్టు 17 ఓవరల్లో మూడు వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి గెలుపొందింది. బ్రాండన్ కింగ్ (21 బంతుల్లో 43; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెట్‌మైర్ (42 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు), రసెల్ (14 బంతుల్లో 40 నాటౌట్; 6 సిక్స్‌లు) రాణించారు. ముఖ్యంగా రసెల్ సిక్స్‌లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రసెల్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా విండీస్ మరో మూడు ఓవర్లు మిగిలి ఉండగానే గెలుపొందింది.

షూటింగ్ ప్రపంచ కప్ వాయిదా

కోవిడ్-19 వైరస్ విజృంభణ నేపథ్యంలో ఐఎస్‌ఎస్‌ఎఫ్ నిర్ణయం

న్యూఢిల్లీ: దేశంలో జరగాల్సిన ప్రతిష్టాత్మక షూటింగ్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు కోవిడ్-19 వైరస్ అడ్డుగా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్ విజృంభిస్తుండటంతో పాటు... దేశంలో కూడా పలు కేసులు నమోదు కావడంతో ఈ మెగా ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నట్లు అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15 నుంచి 25 వరకు న్యూఢిల్లీ వేదికగా ఈ ఈవెంట్ జరగాల్సి ఉంది. అయితే భారత్‌లో 31 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కావడం... కోవిడ్ తీవ్రత అధికంగా ఉన్న చైనా, ఇటలీ, దక్షిణ కొరియా, జపాన్, ఇరాన్ దేశాలపై భారత ప్రభుత్వం ట్రావెల్ బ్యాన్ విధించడంతో టోర్నీని ప్రస్తుతం నిర్వహించడం సాధ్యం కాదని ఐఎస్‌ఎస్‌ఎఫ్‌కు భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) తెలిపింది. అంతేకాకుండా టోర్నీలో పాల్గొనే 22 దేశాలు కూడా చివరి నిమిషంలో వైదొలిగాయని పేర్కొంది. అయితే షూటింగ్ ప్రపంచ కప్‌ను రెండు దశల్లో నిర్వహించే విషయమై పరిశీలిస్తున్నామని ఐఎస్‌ఎస్‌ఎఫ్ పేర్కొంది. మే 5 నుంచి 12 మధ్య రైఫిల్, పిస్టల్ ఈవెంట్‌లను... జూన్ 2-9 మధ్య షాట్‌గన్ షూటింగ్ పోటీలను నిర్వహించాలని ఎన్ఆర్ఏఐ తమను కోరినట్లు ఐఎస్‌ఎస్‌ఎఫ్ తెలిపింది. దీంతో పాటు ఏప్రిల్ 16 నుంచి టోక్యోలో జరగాల్సిన ఒలింపిక్ టెస్టు ఈవెంట్ కూడా రద్దు అయింది.

ISSF WORLD CUP
RIFLE / PISTOL
NEW DELHI, IND

బయోమెట్రిక్‌కు 'బ్రేక్' ఇచ్చిన 'సాయ్'

అథ్లెట్లు, సిబ్బంది హాజరు కోసం ఉపయోగిస్తున్న బయోమెట్రిక్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) తెలిపింది. బయోమెట్రిక్ ద్వారా కోవిడ్-19 ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'సాయ్' తెలిపింది.

అనుకున్న సమయానికే ఐపీఎల్: గంగూలీ

కోవిడ్ దెబ్బకు ఒక్కో టోర్నీ వాయిదా పడుతున్నా... బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మాత్రం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నీ సీజన్-13 అనుకున్న తేదీనే ప్రారంభమవుతుందని స్పష్టం చేశాడు. వైరస్ ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటామని... దాని గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని ఆయన అన్నాడు. ఐపీఎల్ తాజా సీజన్ మార్చి 29న ప్రారంభమవుతుంది.

రెండు సింగిల్స్‌లోనూ భారత్‌కు నిరాశ

2-0తో ఆధిక్యంలో క్రొయేషియా

జాగ్రెబ్: డేవిస్ కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భాగంగా క్రొయేషియాతో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి రోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. ఆడిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లు ఓటమి చవిచూశారు. తొలి సింగిల్స్‌లో 132వ ర్యాంకర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 6-3, 4-6, 2-6తో ప్రపంచ 277వ ర్యాంకర్ బోర్నా గోజో చేతిలో ఓడిపోయాడు. రెండో సింగిల్స్‌లో 182వ ర్యాంకర్ రామ్ కుమార్ 6-7 (8/10), 6-7 (8/10)తో 37వ ర్యాంకర్ మారిన్ సిలిచ్ చేతిలో పోరాడి ఓడాడు. 2-0తో ఆధిక్యంలోకి వెళ్లిన క్రొయేషియా... నేడు జరిగే డబుల్స్ మ్యాచ్‌లో లేదా రెండు రివర్స్ సింగిల్స్‌లో ఒక దాంట్లో విజయం సాధిస్తే ఈ ఏడాది చివర్లో జరిగే డేవిస్‌కప్ ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

క్వార్టర్స్‌లో వికాస్

అమ్మాన్ (జోర్డాన్): టోక్యో ఒలింపిక్స్ ఆసియా క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో శుక్రవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల 69 కేజీల విభాగంలో వికాస్ కృష్ణన్ 5-0తో నూర్ సుల్తాన్ (కిర్గిస్తాన్)ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. అయితే 91 కేజీల విభాగంలో నమన్ తన్వర్ 0-5తో అల్దీన్ గౌసున్ (సిరియా) చేతిలో ఓడిపోయాడు.

రంజీలు కాదు.. దేశమే ముందు

- ఫైనల్ ఆడేందుకు జడేజాకు గంగూలీ అనుమతి నిరాకరణ

కోల్‌కతా: భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో రంజీ ఫైనల్ ఆడించాలనుకున్న సౌరాష్ట్ర క్రికెట్ సంఘానికి (ఎస్‌సీఏ) నిరాశ ఎదురైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ... జడేజా రంజీ ఫైనల్ ఆడేందుకు అనుమతి నిరాకరించాడు. దేశమే ముందని, ఆ తర్వాతే ఏదైనా టోర్నీలని గంగూలీ తెగేసి చెప్పేశాడు. టీమిండియా స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం సన్నద్ధమవుతోంది. ఈ నెల 12న ధర్మశాలలో ఇరు జట్ల మధ్య తొలి వన్డే జరుగుతుంది. మరోవైపు సోమవారం నుంచి రాజ్‌కోట్‌లో సౌరాష్ట్ర, బెంగాల్ జట్ల మధ్య రంజీ ట్రోఫీ ఫైనల్ జరుగనుంది. కీలకమైన ఫైనల్స్‌లో జడేజాను ఆడించేందుకు ఎస్‌సీఏ అధ్యక్షుడు జయదేవ్ షా బీసీసీఐ చీఫ్ గంగూలీని కోరాడు. కానీ తన అభ్యర్థనను గంగూలీ తిరస్కరించాడని షా చెప్పాడు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన జయదేవ్ రంజీ ఫైనల్ ఉన్నప్పుడు అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించరాదన్నాడు. 'ఐపీఎల్ ఉన్నపుడు బోర్డు అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించదు. ఎందుకంటే లీగ్ ద్వారా బాగా డబ్బు వస్తుంది. రంజీ ట్రోఫీకి ఆదరణ దక్కాలంటే స్టార్ ఆటగాళ్లను ఆడించాల్సిందే. ఆ దిశగా బోర్డు ఆలోచించాలి. రంజీ ఫైనల్ జరిగే రోజుల్లో అంతర్జాతీయ మ్యాచ్ లేకపోతే స్టార్ ఆటగాళ్లందరూ అందుబాటులో ఉంటారు. మ్యాచ్ రసవత్తరంగా జరిగేందుకు అవకాశముంటుంది. ఆదరణ కూడా పెరుగుతుందని జయదేవ్ షా తెలిపాడు.

చెస్ ఒలింపియాడ్‌కు హంపి, హారిక, ఆనంద్



చెన్నై: ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో ఈసారీ భారత్ పూర్తి బలగంతో బరిలోకి దిగనుంది. మహిళల విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టులోని మిగతా మూడు బెర్త్‌ల కోసం తానియా సచ్‌దేవ్, భక్తి కులకర్ణి, ఆర్.వైశాలి రేసులో ఉన్నారు. అయితే మే 1వ తేదీన మిగతా ముగ్గురు క్రీడాకారిణుల పేర్లను ఖరారు చేస్తామని అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. పురుషుల విభాగంలో భారత నంబర్‌వన్, ప్రపంచ మాజీ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ పేరు ఖరారైంది. ర్యాంకింగ్ ప్రకారం పెంటేల హరికృష్ణ, విదిత్ ఎంపిక కూడా లాంఛనమే. మిగతా రెండు బెర్త్‌ల కోసం ఆధిబన్, కృష్ణన్ శశికిరణ్, సేతురామన్, సూర్యశేఖర గంగూలీ, అరవింద్ చిదంబరం రేసులో ఉన్నారు. చెస్ ఒలింపియాడ్ ఈ ఏడాది ఆగస్టు 5 నుంచి 18 వరకు రష్యా రాజధాని మాస్కోలో జరుగుతుంది. మొత్తం 180 దేశాలు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్నాయి.

సాక్షి బిజినెస్
శనివారం
7-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
894 ▼	280 ▼
37,577	10,989

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	8,470	▼ 268
డోజోన్స్	25,502	▼ 620
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,463	▼ 243
డాక్స్	11,542	▼ 403
షాంఘై	3,035	▼ 37
నికాయ్	20,750	▼ 579

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	71.70	75.49
£	బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	92.64	97.32
€	యూరో	ఫామ్‌కుకి	79.96	84.26
¥	జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	65.00	72.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	47.37	49.72
S$	సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	51.29	54.59
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుకి	18.64	20.16
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	19.36	20.78
¥	చైనా యువాన్	ఫామ్‌కుకి	9.42	11.06

'యస్'బీఐ..!

- వాటాల కొనుగోలుకు ఎస్‌బీఐ ఆసక్తి
- పునర్నిర్మాణ స్కీమ్ ముసాయిదా రూపొందించిన ఆర్‌బీఐ
- ఇన్వెస్టర్లు 49% వాటాలు కొనుగోలు చేసేలా ప్రతిపాదన
- షేరుకు రూ. 10 ధర • మూడేళ్ల పాటు లాకిన్
- అభిప్రాయాల వెల్లడికి మార్చి 9 దాకా గడువు

ముంబై: సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్‌ను ఒడ్డున పడేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. యస్ బ్యాంకులో ఇన్వెస్ట్ చేయడానికి ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆసక్తి చూపుతున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో యస్ బ్యాంకు పునర్నిర్మాణ స్కీమ్ 2020 ముసాయిదాను ఆర్‌బీఐ రూపొందించింది. దీని ప్రకారం.. వ్యూహాత్మక ఇన్వెస్టర్లు యస్ బ్యాంక్‌లో 49 శాతం వాటాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పెట్టుబడులు పెట్టిన రోజు నుంచి మూడేళ్ల దాకా వాటాలను 26 శాతం లోపు తగ్గించుకోకూడదు. యస్ బ్యాంక్ షేరు ఒక్కింటికి రూ. 10 చొప్పున లెక్కించి వాటాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యస్ బ్యాంకు షేరు ముఖ విలువ రూ. 2తో పోలిస్తే ఇది రూ. 8 అధికం. ఇక నిర్దేశిత తేదీ నుంచి బ్యాంక్ అధీకృత మూలధనాన్ని కూడా రూ. 5,000 కోట్లకు, ఈక్విటీ షేర్ల సంఖ్యను 2,400 కోట్లకు సవరించనున్నారు. ఈ ముసాయిదాపై సంబంధిత వర్గాలు మార్చి 9 దాకా అభిప్రాయాలు తెలపాల్సి ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది.

మొండిబాకీలు, నష్టాలు, నిధుల కొరత సమస్యలతో సతమతమవుతున్న యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఏప్రిల్ 3 దాకా నెల రోజుల పాటు మారటోరియం విధించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవధిలో డిపాజిట్‌దారులు రూ. 50,000కు మించి విత్‌డ్రా చేసుకోవడానికి లేదు. అటు బ్యాంకు.. ఇతరత్రా రుణాలు ఇవ్వడానికి గానీ పెట్టుబడులు పెట్టడానికిగానీ లేదు. మారటోరియం గడువులోగానే బ్యాంకును పునరుద్ధరించడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని ఆర్‌బీఐ నియమించిన అడ్మినిస్ట్రేటర్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఆర్‌బీఐ చర్యలు తీసుకుందని, ఖాతాదారుల సొమ్ముకు ఢోకా లేదని భరోసా నిచ్చారు.

కరోనా.. టెర్రర్!

11,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ

- మాంద్యం భయాలతో ప్రపంచ మార్కెట్ల పతనం
- యస్ బ్యాంక్‌పై ఆంక్షలతో దెబ్బతిన్న సెంటిమెంట్
- 894 పాయింట్లు క్షీణించి 37,577 వద్ద ముగింపు
- 280 పాయింట్ల నష్టంతో 10,989కు నిఫ్టీ

కోవిడ్-19(కరోనా) వైరస్ కల్లోలం కారణంగా ప్రపంచం మాంద్యంలోకి జారిపోతోందనే ఆందోళనతో ప్రపంచ మార్కెట్లు భారీగా పతనం కావడంతో శుక్రవారం మన మార్కెట్ కూడా భారీగా నష్టపోయింది. యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 38,000 పాయింట్లు, నిఫ్టీ 11,000 పాయింట్ల దిగువకు పడిపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం, డాలర్‌తో రూపాయి మారకం 74 స్థాయికి చేరువ కావడం, ముడి చమురు ధరలు 2.5 శాతం మేర క్షీణించడం కూడా ప్రతికూల ప్రభావం చూపించాయి. ఇంట్రాడేలో 1,459 పాయింట్ల మేర క్షీణించిన సెన్సెక్స్ చివరకు 894 పాయింట్ల నష్టంతో 37,577 పాయింట్ల వద్దకు చేరింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 280 పాయింట్లు పతనమై 10,989 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ 1,014 పాయింట్లు కోల్పోయి 27,801 పాయింట్లకు చేరింది. సెన్సెక్స్ 2.3 శాతం, నిఫ్టీ 2.4 శాతం, బ్యాంక్ నిఫ్టీ 3.5 శాతం చొప్పున నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు క్షీణించాయి. సెన్సెక్స్, నిఫ్టీలు ఆరు నెలల కనిష్టానికి, బ్యాంక్ నిఫ్టీ ఐదు నెలల కనిష్టానికి పడిపోయాయి. ఇక వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 721 పాయింట్లు, నిఫ్టీ 212 పాయింట్లు నష్టపోయాయి.

చివర్లో తగ్గిన నష్టాలు....

గురువారం అమెరికా మార్కెట్, శుక్రవారం ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోవడంతో మన మార్కెట్ కూడా భారీ నష్టాల్లో ఆరంభమైంది. సెన్సెక్స్ 857 పాయింట్లు, నిఫ్టీ 326 పాయింట్ల నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,460 పాయింట్లు, నిఫ్టీ 442 పాయింట్ల మేర క్షీణించాయి. చివర్లో నష్టాలు కొంత తగ్గాయి. యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ తీసుకున్న చర్యల నేపథ్యంలో బ్యాంక్ షేర్లు బేర్‌మన్నాయి. కరోనా వైరస్ కల్లోలం నేపథ్యంలో విమానయాన, లోహ షేర్లు నష్టపోయాయి. ఆసియా మార్కెట్లు 1-3 శాతం, యూరప్ మార్కెట్లు 3-4 శాతం రేంజ్‌లో క్షీణించగా, అమెరికా సూచీలు 2-3 శాతం నష్టాల్లో ట్రేడయ్యాయి.

- 30 సెన్సెక్స్ షేర్లలో మూడు షేర్లు-బజాజ్ ఆటో, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ మాత్రమే లాభపడ్డాయి.
- యస్ బ్యాంక్‌లో వాటాను ఎస్‌బీఐ కొనుగోలు చేయనున్నదన్న వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్ 6 శాతం నష్టంతో రూ.270 వద్దకు చేరింది.
- చైనాలో రిటైల్ అమ్మకాలు 85 శాతం తగ్గడంతో టాటా మోటార్స్ షేర్ 9% నష్టంతో రూ.114 వద్ద ముగిసింది.
- దాదాపు 600కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, ఓఎన్‌జీసీ, పీఎన్‌బీ, ఇండిగో, తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- మొత్తం ఐదు షేర్లు సెన్సెక్స్‌ను 510 పాయింట్ల మేర పడగొట్టాయి. సెన్సెక్స్ నష్టాల్లో హెచ్‌డీఎఫ్‌సీ వాటా 140 పాయింట్లుగా ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా 125 పాయింట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ 113 పాయింట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 68 పాయింట్లు, ఎస్‌బీఐ వాటా 64 పాయింట్లుగా ఉన్నాయి.
- దాదాపు 400 మేర షేర్లు లోయర్ సర్క్యూట్లను తాకాయి. కార్పొరేషన్ బ్యాంక్, డీహెచ్‌ఎఫ్ఎల్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

రూ.3.30 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో రూ.3.30 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.29 లక్షల కోట్లు తగ్గి రూ.144.3 లక్షల కోట్లకు పడిపోయింది.

ఖాతాదారుల సొమ్ము భద్రం: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

యస్ బ్యాంక్‌లో గవర్నెన్స్ లోపాలు, నిబంధనలను పాటించకపోవడం, రిస్కుతో కూడుకున్న రుణాలివ్వడం వంటి ధోరణులను 2017 నుంచి రిజర్వ్ బ్యాంక్ గమనిస్తూనే ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే బ్యాంక్ మేనేజ్‌మెంట్‌ను కూడా మార్చాలని ఆర్‌బీఐ ఆదేశించినట్లు తెలిపారు. యస్ బ్యాంక్‌లో సమస్యలు, వాటికి బాధ్యులెవరన్న అంశాలన్నింటిపైనా విచారణ జరపాలంటూ ఆర్‌బీఐకి ప్రభుత్వం సూచించినట్లు ఆమె వివరించారు. 'ఖాతాదారుల ప్రయోజనాలు పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీఐతో పాటు పరిస్థితులను నేను కూడా సమీక్షిస్తున్నాను. డిపాజిటర్ల సొమ్ము భద్రంగానే ఉంటుంది' అని నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. నిర్దిష్ట 30 రోజుల్లోగానే పునర్నిర్మాణ స్కీమ్ అమల్లోకి రాగలదని, ఇన్వెస్ట్ చేసేందుకు ఎస్‌బీఐ ముందుకొచ్చిందని మంత్రి చెప్పారు. ఏడాది పాటు యస్ బ్యాంక్ సిబ్బంది ఉద్యోగాలు, జీత భత్యాలకు ఎలాంటి సమస్య ఉండబోదని భరోసానిచ్చారు. అంబానీ గ్రూప్, ఎస్సెల్, ఐఎల్ఎఫ్ఎస్, డీహెచ్ఎఫ్ఎల్, వొడాఫోన్ వంటి సంస్థలకు ఇచ్చిన రుణాలు యస్ బ్యాంక్‌కు గుదిబండగా మారాయన్నారు.

ఆందోళనలో కస్టమర్లు..

విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షలతో యస్ బ్యాంక్ ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. వార్త తెలిసినప్పట్నుంచీ ఏటీఎంలు, పలు శాఖల్లో కస్టమర్లు బారులు తీరారు. తమ డిపాజిట్ల పరిస్థితి గురించి వాకబు చేస్తూ కనిపించారు. నెట్ బ్యాంకింగ్ పనిచేయకపోవడం, ఏటీఎంలలో డబ్బు లేకపోవడం తదితర ఫిర్యాదులతో బ్యాంక్ హెల్ప్‌లైన్ హోరెత్తింది. కొందరు ట్విట్టర్ వంటి వేదికల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆర్‌బీఐ ఆంక్షలు విధించడానికి రెండు రోజుల ముందునుంచే బ్యాంకు చిక్కుల్లో ఉన్న సంకేతాలు కనిపించాయని కొందరు ఖాతాదారులు చెప్పారు. బ్యాంకింగ్ సమస్యలపై మార్చి 3, 4 తారీఖుల నుంచే పలువురు కస్టమర్లు యస్ బ్యాంక్ ట్విట్టర్ హ్యాండిల్‌లో ఫిర్యాదులు చే శారు.

షేరు 85 శాతం క్రాష్..

యస్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డ్‌ను రద్దు చేయడం, విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షల నేపథ్యంలో శుక్రవారం యస్ బ్యాంక్ షేర్ కుప్పకూలింది. శుక్రవారం ఒకానొక దశలో 85 శాతం దిగజారి రూ.5.55ను తాకింది. చివరకు 55 శాతం నష్టంతో రూ.16.55 వద్ద ముగిసింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి యస్ బ్యాంక్ షేర్ రూ.47గా ఉంది. షేర్ ధర భారీగా నష్టపోవడంతో ఈ షేర్‌లో ఇన్వెస్ట్ చేసిన రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా భారీగా నష్టపోయారు. ఎల్ఐసీ మార్క్-టు-మార్కెట్ నష్టాలు రూ.617కోట్ల మేర ఉండగా, మ్యూచువల్ ఫండ్స్ మార్క్-టు-మార్కెట్‌నష్టాలు కూడా ఇదే రేంజ్‌లో ఉన్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,162 కోట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు రూ.3,300 కోట్లు నష్టపోయారు. ఇక హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ నష్టాలు రూ.239 కోట్లుగా ఉన్నాయి.

మే 29 తర్వాత ఎఫ్‌అండ్‌వో నుంచి అవుట్

యస్ బ్యాంకును ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ సెగ్మెంట్ నుంచి తప్పించాలని నిర్ణయించినట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తెలిపింది. మే 29 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వివరించింది. ప్రస్తుత కాంట్రాక్ట్స్ అన్నీ మే 28తో ముగిసిపోతాయని తెలిపింది. మరోవైపు, యస్ బ్యాంక్ జారీ చేసిన బ్యాంక్ గ్యారంటీలు, ఎఫ్‌డీ రసీదులను తనఖా కింద అంగీకరించబోమని ఎక్స్ఛేంజీలు తెలిపాయి. అలాగే, తనఖాలో ఉంచిన యస్ బ్యాంక్ షేర్లపై హెయిర్‌కట్‌ను 100 శాతానికి తగ్గించేస్తున్నట్లు పేర్కొన్నాయి. యస్ బ్యాంక్ రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేస్తున్నట్లు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తెలిపింది. బ్యాంకు జారీ చేసిన రూ. 52,612 కోట్ల బాండ్ల రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసినట్లు మరో రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది.

త్వరలో పరిష్కారమవుతుంది: ఎస్‌బీఐ చీఫ్ రజనీష్ కుమార్

'యస్ బ్యాంక్ సమస్య కేవలం ఆ బ్యాంకుకే పరిమితమైన అంశం. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సమస్య కాదు. యస్ బ్యాంక్ సంక్షోభానికి చాలా తొందర్లోనే పరిష్కారం లభిస్తుంది' అని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ చెప్పారు. బ్యాంకులో వాటాలు కొనుగోలు చేసే పక్షంలో తమకు ఇప్పటికే సూత్రప్రాయంగా అనుమతులు కూడా ఉన్నాయని తెలిపారు.

సత్వర చర్యలు తీసుకుంటున్నాం: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

దేశీ ఆర్థిక రంగంలో స్థిరత్వానికి సమస్యలు వాటిల్లకుండా యస్ బ్యాంక్ సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. బ్యాంకును పునరుద్ధరించడానికి అత్యంత వేగంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. 30 రోజుల మారటోరియం అన్నది గరిష్ట పరిమితి అని.. ఈలోగానే పరిష్కార ప్రణాళిక అమల్లోకి రాగలదని దాస్ ధీమా వ్యక్తం చేశారు. ఖాతాదారుల ప్రయోజనాలను పూర్తిగా పరిరక్షిస్తామన్నారు. స్వయంగా పరిస్థితి చక్కదిద్దుకునేందుకు బ్యాంకుకు తగినంత సమయం ఇచ్చినా ఫలితం కనిపించకపోవడంతోనే ఆర్‌బీఐ ప్రస్తుత చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని పరిక్రమల సమాఖ్య అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. ఇది తొందరపాటుతనం అని కొందరు .. చాలా ఆలస్యం చేశారని మరికొందరు వ్యాఖ్యానించవచ్చని, కానీ ఆర్‌బీఐ తగిన సమయంలోనే చర్యలు తీసుకుందని దాస్ చెప్పారు.

డిజిటల్ పార్ట్‌నర్స్‌కు సెగ..

యస్ బ్యాంక్‌పై ఆంక్షలతో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, దానిపై ఆధారపడిన ఫిన్‌టెక్ సంస్థలకు సమస్యలొచ్చి పడ్డాయి. ప్రధానంగా ఫోన్‌పే వంటి డిజిటల్ పేమెంట్స్ సంస్థల లావాదేవీలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. అటు యస్ బ్యాంక్ ఖాతాల్లోకి యూపీఐ ప్లాట్‌ఫాం ద్వారా చేసే చెల్లింపులు సహా పలు లావాదేవీల సెటిల్మెంట్‌లపై పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఆంక్షలు విధించింది. ఇక, యస్ బ్యాంక్ బాండ్లలో వివిధ స్కీమ్‌ల ద్వారా చేసిన పెట్టుబడుల విలువను సున్నా స్థాయికి తగ్గించేసినట్లు నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. మరోవైపు, యస్ బ్యాంక్‌లో ఖాతాలున్న షేర్, బాండ్ హోల్డర్ల నిధులు చిక్కుబడిపోకుండా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. వారి షేర్లు, బాండ్లు మొదలైనవి విక్రయించిన పక్షంలో వచ్చే నిధులను వేరే బ్యాంకులో జమ చేసుకునే వీలు కల్పిస్తూ సత్వర చర్యలు తీసుకున్నాయి.

పూరీ జగన్నాథునికీ కష్టాలు...

యస్ బ్యాంకులో పూరీ జగన్నాథ స్వామి ఆలయానికి సంబంధించి రూ. 545 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయి. బ్యాంకుపై ఆర్‌బీఐ మారటోరియం విధించడంతో ఈ డిపాజిట్ల పరిస్థితిపై ఆందోళన నెలకొంది. ప్రైవేట్ బ్యాంకులో జగన్నాథుడి నిధులను డిపాజిట్ చేయడం అనైతికమని, ఈ విషయంలో శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్, గుడి మేనేజింగ్ కమిటీపై పోలీసులకు ఫిర్యాదు చేశామని జగన్నాథ సేన కన్వీనర్ ప్రియదర్శి పట్నాయక్ చెప్పారు. అయితే, అధికారులు చర్యలేమీ ఇంతవరకూ తీసుకోలేదన్నారు. మరోవైపు, ఈ మొత్తాన్ని మార్చి నెలాఖరులోనే ఏదైనా ప్రభుత్వ రంగ బ్యాంకులోకి మళ్లించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుందని.. ఈలోగానే తాజా పరిణామం చోటు చేసుకుందని ఒడిశా న్యాయశాఖ మంత్రి ప్రతాప్ జెనా తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (24 క్యారెట్లు)	45,310	▲	790
బంగారం (22 క్యారెట్లు)	43,150	▲	750
వెండి (కిలో)	50,400	▲	700
హైదరాబాద్/చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	44,310	▲	1030
బంగారం (22 క్యారెట్లు)	42,200	▲	980
వెండి (కిలో)	50,400	▲	700
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	43,900	▲	300
బంగారం (22 క్యారెట్లు)	40,730	▲	420
వెండి (కిలో)	48,000	▲	500
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	45,700	▲	1320
బంగారం (22 క్యారెట్లు)	42,500	▲	1220
వెండి (కిలో)	48,000		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	45,620	▲	1020
బంగారం (22 క్యారెట్లు)	41,200	▲	980
వెండి (కిలో)	48,100	▲	700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 7-3-2020

విశాఖ	350-00
చిత్తూరు	323-00
వరంగల్	278-00
విజయవాడ	313-00
గోదావరి	313-00
6-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	275-00

ఎస్‌టీపీఐ సహకారంతో విశాఖలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం: పల్సస్

డిజిటల్ మార్కెటింగ్‌పై ఫోకస్: శ్రీనుబాబు

సాక్షి, విశాఖపట్నం: సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సహకారంతో విశాఖలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పల్సస్ గ్రూప్ తెలియజేసింది. పల్సస్ హెల్త్‌టెక్‌కు హైదరాబాద్‌తో పాటు చెన్నై, విశాఖ, గుర్‌గావ్‌లో కేంద్రాలున్నాయి. విశాఖలో డిజిటల్ మార్కెటింగ్‌కు సంబంధించి నైపుణ్యాలను అభివృద్ధి పరిచే శిక్షణ ఇవ్వటానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ తెలియజేసింది. ''డిజిటల్ మార్కెటింగ్‌తో ఆన్‌లైన్లోనే వినియోగదారుల దగ్గరకు వస్తువులు వెళుతున్నాయి. ప్రపంచంలో ఏ మూలో ఉన్నవారికి ఇక్కడి నుంచే మనం ఉత్పత్తిని ప్రజెంట్ చేయొచ్చు. మా సంస్థ ఇప్పటికే 50కి పైగా దేశాల్లో మెడికల్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తోంది. మా ఓపెన్ యాక్సెస్ హెల్త్ జర్నల్స్ ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులకు, వర్సిటీ విద్యార్థులకు అందుతున్నాయి. వీటి ద్వారా డిజిటల్ మార్కెటింగ్ చేయాలనుకుంటున్నాం. అందుకే విశాఖ కేంద్రంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. శిక్షణ పొందిన వారిలో చాలామందికి మేమే ఉద్యోగాలు కల్పిస్తాం. విశాఖలో దశల వారీగా 25 వేల మందికి ఉద్యోగాలిచ్చేలా ప్రణాళిక వేస్తున్నాం. రాబోయే పదేళ్లలో ఐటీని మించి ఉద్యోగాలు కల్పించే స్థాయి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు మాత్రమే ఉంది'' అని పల్సస్ గ్రూప్ సీఈఓ శ్రీనుబాబు గేదెల చెప్పారు. సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ విషయాలు తెలియజేశారు. ఎంసీఏ, ఎంబీఏ, ఎం.ఫార్మా కోర్సులు చేసినవారు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై రాణించడానికి అవకాశం ఉందన్నారు.

కట్టాల్సినది రూ. 21 వేల కోట్లే

ఏజీఆర్ బాకీలపై వొడాఫోన్ ఐడియా స్వీయ మదింపు

న్యూఢిల్లీ: లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల బాకీల (ఏజీఆర్) కింద తాము కట్టాల్సినది టెలికం శాఖ (డాట్) చెబుతున్న దానికంటే చాలా తక్కువేనని టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) తెలిపింది. వాస్తవంగా తాము చెల్లించాల్సినది రూ. 21,533 కోట్లు మాత్రమేనని స్వీయ మదింపులో తేలిందని సంస్థ వివరించింది. ఇందులో ఇప్పటికే రూ. 3,500 కోట్లు కట్టినట్లు పేర్కొంది. వొడాఫోన్ ఐడియా రూ. 53,000 కోట్ల పైగా కట్టాలని డాట్ చెబుతోంది. మరోవైపు, వొడాఫోన్ గ్రూప్ సీఈవో నిక్ రీడ్ శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సమాచార శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్‌తో భేటీ అయ్యారు. కంపెనీని నిలబెట్టేందుకు తోడ్పాటు అందించాలని కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రాణా కపూర్ నివాసంలో ఈడీ సోదాలు

ముంబై: మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణలో భాగంగా యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్ నివాసంలో (ముంబై) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మరిన్ని సాక్ష్యాధారాలు సేకరించేందుకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఓ కార్పొరేట్ సంస్థకు ఇచ్చిన రుణాలకు ప్రతిఫలం తీసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని అవకతవకలపైనా ఈడీ విచారణ జరుపుతోంది.

హైదరాబాద్‌లో అతిపెద్ద యూఎస్ కాన్సులేట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో యూఎస్ కాన్సులేట్ అతిపెద్ద కార్యాలయం హైదరాబాద్‌లో రానుంది. ముంబైలో ఉన్న దౌత్య కార్యాలయం కంటే ఇది భారీగా ఉంటుందని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మన్ వెల్లడించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శుక్రవారం ఏర్పాటు చేసిన సీఈవో ఫోరం సదస్సులో ఆయన మాట్లాడారు. గచ్చిబౌలిలో 18 నెలల్లో ఇది అందుబాటులోకి రానుందని చెప్పారు.

సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా కృష్ణ బోదనపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ చైర్మన్‌గా సైయంట్ ఎండీ కృష్ణ బోదనపు ఎన్నికయ్యారు. 2020-21 సంవత్సరానికి ఆయన ఈ పదవిలో ఉంటారు. వైస్ చైర్మన్‌గా కోర మాండల్ ఇంటర్నేషనల్ ఎండీ సమీర్ గోయల్‌ను నియమించారు.

యాదాద్రిలో చక్రతీర్థ స్నానం చేయిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బాలాలయంలోని మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆచార్యులు, యాజ్ఞికులు మహా పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్న ప్రధాన మండపంలో చక్రతీర్థ స్నానం నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులను శ్రీచక్ర ఆళ్వారుడికి అలంకరించి, ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. ఆలయంలోనే ప్రత్యేక పాత్రలో శుద్ధమైన నీటిని తీసుకువచ్చి అందులో స్నానం చేపట్టారు. శ్రీచక్ర స్నానం చేసిన నీటిని తీసుకెళ్లేందుకు భక్తులు పోటీపడ్డారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం శ్రీస్వామి వారి ప్రధాన మండప ఆవరణలో దేవతా ఉద్వాసన, పుష్పయాగం, డోలారోహణ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాంపురంలో రోడ్డుపైనే శవాన్ని దహనం చేస్తున్న కుటుంబ సభ్యులు

రోడ్డుపైన దహన సంస్కారాలు

నేరేడుచర్ల (హుజూర్‌నగర్): మనిషి చనిపోయిన తర్వాత కావాల్సిన ఆరడుగుల నేల ప్రస్తుతం కరువైంది. దీంతో రోడ్డుపైన దహన సంస్కారాలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాంపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జంగిలి చిన సైదులు మృతిచెందగా ఆయన మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అయితే శ్మశాన వాటికను ఆక్రమించుకున్న వ్యక్తి అందులో దహన సంస్కారాలు నిర్వహించవద్దని హెచ్చరించాడు. దీంతో బంధువులు ఎటు తీసుకెళ్లాలో తెలియక.. రాంపురం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుపైనే దహన సంస్కారాలు నిర్వహించారు. రాంపురంలో గతంలో శ్మశానవాటిక ఉందని, దానిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకోవడంతో రోడ్డుపైనే దహన కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

మరికల్‌లో పగిలిన పైపులైన్ నుంచి ఎగిసిపడుతున్న నీళ్లు

భగీరథ.. ఇదేమి వ్యథ..!

పైప్‌లైన్ పగిలిపోవడంతో ఎగిసిపడిన నీళ్లు

మరికల్ (నారాయణపేట): మన్యంకొండ నుంచి నారాయణపేట జిల్లాకి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ మరికల్ సమీపంలో పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా నీళ్లు 50 అడుగుల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే నీటి సరఫరాను నిలిపివేశారు. శుక్రవారం మరికల్ పెట్రోల్ బంకు సమీపంలో భగీరథ ప్రధాన పైపులైన్‌కు ఉన్న ఎయిర్‌వాల్వ్ వద్ద ముళ్లచెట్లను తొలగిస్తున్న క్రమంలో వాల్వ్‌కు జేసీబీ తగిలి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో పైపులైన్ కింద భాగంలో ఉన్న రాళ్లు వంద అడుగుల దూరం వరకు ఎరిగిపడ్డాయి. పైప్‌లైన్ పగిలిన విషయాన్ని సర్పంచ్ గోవర్ధన్ మిషన్ భగీరథ అధికారులకు తెలియజేయడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. కాగా, నారాయణపేట జిల్లాలోని 244 గ్రామాలకు తాగునీటి సరఫరాను నిలిపివేస్తునట్టు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

ఎస్జీటీ ఉర్దూ మీడియం పోస్టులకు 20 మంది

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) ఉర్దూ మీడియం పోస్టులకు వికలాంగుల కేటగిరీలో 20 మంది ఎంపికయ్యారు. మొత్తం 636 ఉర్దూ మీడియం పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా, అందులో వికలాంగుల కేటగిరీలో 35 పోస్టులున్నాయి. వాటిలో 20 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఎంపికైన వారి జాబితాను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. అభ్యర్థులు రీలింక్విష్‌మెంట్ ఆప్షన్‌ను (మరో పోస్టు వస్తే ఈ పోస్టు వద్దని ఆప్షన్) ఈ నెల 8 నుంచి 10 వరకు తమ వెబ్‌సైట్‌లో ఇవ్వాలని సూచించింది.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 11న వెరిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉర్దూ మీడియం పోస్టుల భర్తీకి సంబంధించి ఖాళీగా ఉన్న పోస్టులకు ఏడుగురు దివ్యాంగ అభ్యర్థులకు ఈ నెల 11న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండనుంది. ఈ మేరకు 11న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. పూర్తి వివరాలకు www. tspsc. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది

8న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు

సాక్షి, హైదరాబాద్: పలు శాఖల్లోని జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ స్టెనో, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 8న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే తుది ఎంపిక ఉంటుందని, ప్రొఫిషియన్సీ టెస్టు అర్హత పరీక్ష మాత్రమేనని పేర్కొంది. హాల్ టికెట్లు, ఇతర వివరాలకు www. tspsc. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

వీసీల నియామక ప్రక్రియ వేగవంతం

- సెర్చ్ కమిటీల్లో యూనివర్సిటీ ఈసీ నామినీలకు ర్యాటిఫికేషన్
- ఇదివరకే నామినీలను వేసిన యూనివర్సిటీలు..
- ఇప్పుడు పూర్తి స్థాయి ఈసీలు వేయడంతో ఆ నామినీలకు ర్యాటిఫికేషన్
- 10వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం..

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల (వీసీ) నియామక ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇటీవల 7 యూనివర్సిటీలకు పాలక మండళ్ల (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్–ఈసీ) ను నియమించిన ప్రభుత్వం ఇప్పుడు వీసీల నియామకంపై దృష్టి సారించింది. వీలైనంత త్వరగా వీసీలను నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా వీసీల నియామకం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీల్లో యూనివర్సిటీ నామినీని ఖరారు చేసే ప్రక్రియను చేపట్టింది. యూనివర్సిటీ ఈసీ నామినీ పేరును (కొత్త పేరు లేదా గతంలో ఇచ్చిన పేరునే ఆమోదిస్తూ) ఈ నెల 10వ తేదీలోగా పంపించాలని ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గతంలోనే ఇచ్చినా...

ప్రస్తుతం రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేకపోగా జేఎన్‌ఏఎఫ్ ఏయూకు ఇన్‌చార్జి వీసీ కూడా లేరు. గతేడాది జూన్ 23న వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చే నాటికి జేఎన్‌ఏఎఫ్‌ఏయూ, ఆర్‌జీయూకేటీకి వీసీలు ఉన్నందునా వాటిని అప్పట్లో నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. దీంతో ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, మహాత్మాగాంధీ, జేఎన్‌టీయూ, తెలుగు వర్సిటీ, ఓపెన్ యూనివర్సిటీ వీసీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆయా పోస్టులకు 273 మంది ప్రొఫెసర్లు, 984 దరఖాస్తు ఫారాలను అందజేశారు. వాటిని పరిశీలించి ఒక్కో వర్సిటీ వీసీ పోస్టు కోసం ము గ్గురి పేర్లను ప్రతిపాదించేందుకు సెర్చ్ కమి టీలను ఏర్పాటు చేసింది. వాటిల్లో ప్రభుత్వ నామినీగా ప్రస్తుత ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉన్నారు. యూజీసీ కూడా నామినీలను నియమించింది. ఇటు యూనివర్సిటీల నామినీ పేర్లను కూ డా యూనివర్సిటీల ఈసీల నుంచి ప్రభు త్వం తెప్పించుకుంది. అయితే నిబంధనల ప్రకారం యూనివర్సిటీ పూర్తి స్థాయి ఈసీ మాత్రమే సెర్చ్ కమిటీకి తమ యూనివర్సిటీ నామినీ పేరును ఇవ్వాలి. అప్పట్లో పూర్తి స్థాయి ఈసీలు లేనందునా సెర్చ్ కమిటీల భేటీలను నిర్వహించలేదు. అయితే ఈసీలను వెంటనే నియమించి వీసీల నియామకాన్ని వేగవంతం చేయాలని గత నెల 19న సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. దీంతో తెలుగు వర్సిటీ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మినహా మిగతా 7 యూనివర్సిటీలకు ప్రభుత్వం పూర్తి స్థాయి ఈసీలను నియమించింది. ఇప్పుడు వీసీల పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒక్కో యూనివర్సిటీ సెర్చ్ కమిటీలో ఉండాల్సిన యూనివర్సిటీ నామినీ పేర్లను ఈ నెల 10లోగా తమకు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యూనివర్సిటీలు ఆ మేరకు చర్యలు చేపట్టాయి. ఎలాగో ఈనెల 10 లోగా యూనివర్సిటీలకు నామినీలు వసా ్తరు కనుక యూజీసీ నామినీలతో మా ట్లాడి సెర్చ్ కమిటీల సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఆ సెర్చ్ కమిటీలు ఒక్కో యూనివర్సిటీకి ముగ్గురి పేర్ల ను ఇస్తే ప్రభుత్వం వాటిని యూనివర్సిటీలకు చాన్సలర్ అయిన గవర్నర్‌కు పంపించనున్నాయి. ఆ ముగ్గురిలో ఒకరి పేరును గవర్నర్ ఆమోదించనున్నారు. మొత్తానికి ఈ నెలాఖరులోగా ఓయూ, కాకతీయ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు, మహాత్మా గాంధీ, జేఎన్‌టీయూల వీసీల నియామకాలను పూర్తి చేసే అవకాశం ఉంది. కాగా, తెలుగు వర్సిటీ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి పూర్తి స్థాయి ఈసీలను ఇంకా నియమించలేదు. దీంతో వాటి తరపున సెర్చ్ కమిటీల్లో ఉండే నామినీల పేర్లను ఇప్పట్లో ఖరారు చేసే అవకాశం లేదు. దీంతో వీసీ పోస్టుల దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరిగే అవకాశం ఉంది.

సీజన్ మొదట్లో భారీగా పలికిన మిర్చి ధరలు ఆ తర్వాత తగ్గుముఖం పట్టాయి. మళ్లీ ఇప్పుడిప్పుడే ధరలు పెరుగుతుండడంతో మార్కెట్‌కు రైతులు మిర్చిని తీసుకొస్తున్నారు. రెండు రోజుల క్రితం దేశీ మిర్చి క్వింటాల్‌కు రూ.19వేలు ధర లభించడంతో రైతులు వరంగల్‌లోని ఏనుమాముల మార్కెట్‌కు శుక్రవారం ఒక్కరోజే సుమారు 60 వేలకు పైగా మిర్చి బస్తాలు తీసుకువచ్చారు. దీంతో మార్కెట్ ఆవరణలో ఎక్కడ చూసినా మిర్చి బస్తాలే కనిపించాయి. కాగా, గురువారంతో పోలిస్తే శుక్రవారం ఒకే సారి క్వింటాల్‌కు రూ.4 వేల వరకు ధర తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- వరంగల్

పోటెత్తిన మిర్చి

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బస్తాల నుంచి కారుతున్న నీరు

తడిసిన మిర్చి

ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం కురిసిన అకాల వర్షాలు రైతులకు భారీ నష్టాన్ని కలిగించాయి. ఖమ్మం నగరంతోపాటు వివిధ మండలాల్లో కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన మిర్చి దెబ్బతిన్నది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తరలించిన మిర్చి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. దాదాపు 10 నుంచి 15 వేల బస్తాలు వర్షపునీటిలో తడిసినట్లు అంచనా. అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మక్కలను రైతులు ఓపెన్‌యార్డులో రాశులుగా పోసుకోగా సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి వెయ్యి బస్తాల మక్కలు తడిసిపోయాయి.

- సాక్షిప్రతినిధి, ఖమ్మం/కేసముద్రం

రూ.'లక్ష' కోట్లు దాటింది!

రాష్ట్ర ఏర్పాటు నుంచి సాగు నీటి ప్రాజెక్టులకు భారీగా నిధుల ఖర్చు

- ఏడాదికి సుమారుగా రూ.16,666.66 కోట్ల మేర వెచ్చింపు
- మొత్తం ఖర్చులో రుణాల రూపేణా రూ.46 వేల కోట్ల వ్యయం
- 70 లక్షల ఎకరాల ఆయకట్టులో ఇప్పటికే 17.09 లక్షలు సాగులోకి..

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్ర పరివాహకంలో కురిసే ప్రతి నీటి చుక్కనూ వినియోగంలోకి తేవడం, ప్రధాన నదులైన కృష్ణా, గోదావరిల నుంచి గరిష్ఠ నీటిని మళ్లించే దిశగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం గణనీయంగా ఖర్చు చేస్తోంది. రాష్ట్ర ఏర్పాటు అనంతరమే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న, కొత్తగా చేపడుతున్న ఎత్తిపోతల పథకాలపై ఏకంగా లక్ష కోట్లు నిధులను ఖర్చు చేసింది. దీని ద్వారా కొత్తగా 17 లక్షల ఎకరాల మేర ఆయకట్టును సాగులోకి తేగలిగింది. ఈ ఖరీఫ్ నాటికి మరో 10 లక్షల ఎకరాల మేర ఆయకట్టును సాగులోకి తేనుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ ప్రాజెక్టులపై రుణాలతో కలిపి మరో రూ.25 వేల కోట్ల మేర ఖర్చు చేసేలా ప్రణాళికలు వేసుకుంది.

రుణాలే ఆధారం..

రాష్ట్రంలో 1.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఏటా నిధుల ఖర్చు చేస్తూ వస్తోంది. ఇందులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్టులు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, దేవాదుల వంటి ఎత్తిపోతల పథకాలతో పాటు తెలంగాణ ఏర్పాటు అనంతరం చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, డిండి, సీతారామ ఎత్తిపోతల వంటి పథకాలున్నాయి. ఈ పథకాలపై 2004 నుంచి ఇంతవరకు 1.29 లక్షల కోట్లు మేర నిధులు ఖర్చవగా, తెలంగాణ ఏర్పాటు అనంతరం ఫిబ్రవరి చివరి వరకు ఏకంగా రూ.లక్ష కోట్లకు మించి నిధులు ఖర్చు చేశారు. ఏడాదికి రూ.16,666.66 కోట్లకు తగ్గకుండా తెలంగాణ ప్రభుత్వం ఆరేళ్లలో ఖర్చు చేసింది. ఇందులో కాళేశ్వరం, సీతారామ, దేవాదుల, పాలమూరు వంటి ప్రాజెక్టులకు రుణాల రూపేణా తీసుకొని ఖర్చు చేసిన మొత్తం రూ.46 వేల కోట్ల మేర ఉంది. ఇందులోనూ అధికంగా రూ.40 వేల కోట్ల మేర కాళేశ్వరం ఎత్తిపోతల అవసరాలకే వెచ్చించారు. ఇక మొత్తంగా వెచ్చించిన రూ.లక్ష కోట్లలో కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.60 వేల కోట్లు ఖర్చు చేయగా, పాలమూరు–రంగారెడ్డికి రూ.8,200 కోట్లు, సీతారామ ఎత్తిపోతలపై రూ.4,200 కోట్లు ఖర్చు చేసినట్లు నీటి పారుదల శాఖ నివేదికలు చెబుతున్నాయి. మొత్తం ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే మరో రూ.97,842 కోట్ల మేర అవసరం ఉండగా, 2020–21 వార్షిక ఏడాదిలో సైతం రుణాలతో కలిపి కనీసంగా రూ.25 వేల కోట్ల నిధులు ఖర్చు చేసే అవకాశాలున్నాయి.

కొత్త, పాత కలిపి 20 లక్షల ఎకరాలు...

ఎత్తిపోతల పథకాల కింద మొత్తంగా 70.11 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు వృద్ధిలోకి తేవాలని లక్ష్యంగా ఉండగా, ఇప్పటికే 17.09 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 2.96 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగింది. ఇందులో అధికంగా జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల కిందే ఆయకట్టు సాగులోకి వచ్చింది. ముఖ్యంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడుల కిందే ఏకంగా 7 లక్షల ఎకరాల మేర వృద్ధిలోకి రాగా, దేవాదుల కింద 2 లక్షలు, ఎస్సారెస్పీ–2 కింద 3.52 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది. వచ్చే జూన్ ఖరీఫ్‌లో కొత్తగా 10 లక్షల ఎకరాల మేర ఆయకట్టు సాగులోకి వస్తుందని నీటి పారుదల శాఖ అంచనా వేస్తోంది. ఇందులో కాళేశ్వరం కిందే కనీసంగా 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు ఉంటుందని లెక్కగడుతోంది.

రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల స్వరూపం ఇలా...

- మొత్తం భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు: 38
- ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన మొత్తం: రూ.2,27,632.79 కోట్లు
- 2004 నుంచి ఇప్పటివరకు చేసిన ఖర్చు: రూ.1,29,790.29 కోట్లు
- ఇంకా ఖర్చు చేయాల్సిన మొత్తం: రూ.97,842.50 కోట్లు
- తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి చేసిన ఖర్చు (మైనర్‌తో కలిపి): రూ.1,00,237 కోట్లు
- ప్రాజెక్టులతో సాగులోకి రావాల్సిన ఆయకట్టు: 70.11 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు: 17.09 లక్షల ఎకరాలు
- ఇంకా సాగులోకి రావాల్సింది: 53.02 లక్షల ఎకరాలు

దీర్ఘకాలంగా ఉన్నవారిని బదిలీ చేయండి

మంత్రి తలసాని ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రం ఏర్పాటైన తొలి నాళ్లలో విజయా డెయిరీ ద్వారా రోజుకు 1.27 లక్షల లీటర్లు పాలను సేకరించేవారు. కేసీఆర్ ప్రత్యేక చొరవతో లీటర్‌కు రూ.4 పాడి ప్రోత్సాహకం ప్రకటించడంతో పాల సేకరణ 4.7 లక్షల లీటర్లకు పెరిగింది. ఆ తర్వాత 2018 జూలైలో రోజుకు 3.6 లక్షల లీటర్లు సేకరించాం. దీనికి అదనంగా 65 వేల పాడి గేదెలను సబ్సిడీపై రాష్ట్రంలో పంపిణీ చేశాం. అయినా పాలసేకరణ రోజుకు 2 లక్షల లీటర్లకు పడిపోతుందా? ఈ విషయంలో పశుసంవర్ధక, పశుగణాభివృద్ధి, డెయిరీ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయా డెయిరీ పాలసేకరణ పెరిగేలా చర్యలు చేపట్టాలి'అని రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పాల సేకరణ పెంపునకు చేపట్టాల్సిన చర్యలు, కృత్రిమ గర్భధారణ అమలుపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలసేకరణ పెంపు కోసం వెంటనే జిల్లాల వారీగా సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. డెయిరీలో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని, 10 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశాలిచ్చారు.

టీఎస్ ఐసెట్-20 నోటిఫికేషన్ విడుదల

- ఈనెల 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అపరాధరుసుము లేకుండా ఏప్రిల్ 30 వరకు అవకాశం
- మే 20, 21 తేదీల్లో పరీక్ష నిర్వహణ
- ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజిరెడ్డి వెల్లడి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో 2020–21 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు టీఎస్‌ఐసెట్–2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి దీనిని జారీచేశారు. కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఈ పరీక్షకు సంబంధించి వివరాలను శుక్రవారం ఆయన రిజిస్ట్రార్ పురుషోత్తంతో కలసి మీడియాకు వివరించారు. ఈనెల 9 నుంచి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని, అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450, మిగతావారు రూ.650 ఫీజు చెల్లించాల్సింటుందని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో మే 6 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో మే 11 వరకు, రూ.5,000 అపరాధ రుసుముతో మే 16 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. మే 14 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్ష మే 20, 21 తేదీల్లో ఉంటుందని, 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు, 21న ఒక సెషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గం టల వరకు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ంలో 14 రీజనల్ సెంటర్ల పరిధిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ప్రిలిమినరీ కీని మే 27న విడుదల చేస్తామని, అభ్యంతరాలను జూన్ 1 వరకు స్వీకరించి జూన్ 12న ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. అదేరోజు తుదికీని కూడా వెల్లడిస్తామని అన్నారు. సిలబస్, మోడల్ పేపర్ తదితర వివరాలను కేయూ వెబ్‌సైట్‌లో చూడవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పురుషోత్తం.చిత్రంలో ఐసెట్ కన్వీనర్ రాజిరెడ్డి

కోవిడ్‌పై పర్యవేక్షణకు మరో ముగ్గురు ఐఏఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌పై పర్యవేక్షణ కోసం మరో ముగ్గురు ఐఏఎస్‌లను ప్రభుత్వం రంగంలోకి దింపింది. హైదరాబాద్ కలెక్టర్ శ్వేత మహంతి, పరిశ్రమల శాఖ కమిషనర్ మాణిక్యరాజ్, ఫైనాన్స్ సెక్రటరీ టి.కె.శ్రీదేవిలను కోవిడ్ నియంత్రణకు వేసిన కమిటీల్లోకి తీసుకున్నట్లు మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. కోఠిలోని కోవిడ్ కంట్రోల్ రూమ్‌లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఐదు కమిటీల సభ్యులతో ఈటల సమావేశమయ్యారు. కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అవాస్తవాల ప్రచారాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలెవరూ మాస్కుల కోసం ఎదురు చూడొద్దన్నారు. మాస్కుల ధరలు పెంచి అమ్ముతున్న షాపులపై దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు.

కేంద్రమంత్రితో వీడియో కాన్ఫరెన్స్...

కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిందని మంత్రి తెలిపారు. ఇంటర్నేషనల్ పాసెంజర్లనే కాకుండా డొమెస్టిక్ పాసెంజర్లను కూడా పరీక్షలు చేయడం కోసం అనుమతి ఇవ్వాలని, ఎన్95 మాస్క్‌లు అందించాలని విజ్ఞప్తి చేశామన్నారు. మరో వైరాలజీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను కోరామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కరోనా వైరస్ భయం, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో శుక్రవారం జనం లేక వెలవెలబోతున్న ఎన్‌టీఆర్ గార్డెన్స్

కోవిడ్ నుంచి 19,945 మందికి విముక్తి

- 28 రోజుల వైద్య పర్యవేక్షణ పూర్తిచేసుకున్న ప్రయాణికులు
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక వెల్లడి
- అందులో తెలంగాణలో 100 మందికి విముక్తి
- దేశంలో ప్రస్తుతం 71 మందికి చికిత్స

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ నుంచి దేశవ్యాప్తంగా 19,945 మంది విముక్తి పొందారు. వీరంతా విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులే. మొత్తం 27,481 మంది ప్రయాణికులకు కోవిడ్ అనుమానిత లక్షణాలుండటంతో వైద్యులు వారిని తమ పర్యవేక్షణలో ఇళ్లలోనే ఐసోలేషన్ చేశారు. ఈ నెల రెండో తేదీ నాటికి వారిలో 19,945 మంది 28 రోజుల కాలపరీక్షలో ఎలాంటి లక్షణాలు లేకుండా బయటపడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం ఒక నివేదిక విడుదల చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కోవిడ్ లక్షణాలు కనిపించిన వారిలో 1,647 మంది నుంచి వైద్య పరీక్షల కోసం నమూనాలను సేకరించారు. వారిలో ఇప్పటి వరకు 1,564 మందికి నెగటివ్ వచ్చినట్లు నివేదిక తెలిపింది. కొందరి వైద్య పరీక్షల వివరాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం 71 మంది దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని కేంద్రం తెలిపింది.

ఢిల్లీలో అత్యధిక మంది...

అంతర్జాతీయంగా వివిధ దేశాల నుంచి ఢిల్లీకి అత్యధిక మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో అక్కడ 5,937 మందిని వైద్యులు తమ పర్యవేక్షణలో ఉంచుకోగా, వారిలో 5,818 మంది 28 రోజుల పరిశీలనా కాలాన్ని పూర్తి చేసుకొని కోవిడ్ నుంచి బయటపడ్డారు. ఆ తర్వాత పంజాబ్‌లో 4,436 మంది వైద్యుల పరిశీలనలో ఉండగా, 3,302 మంది విముక్తి పొందారు. ఆ తర్వాత కేరళలో 4,249 మంది పర్యవేక్షణలో ఉండగా, 3,955 మంది కోవిడ్ నుంచి విముక్తి పొందినట్లు నిర్ధారించారు. తెలంగాణలో 380 మంది వైద్యుల పర్యవేక్షణలో ఉండగా, వారిలో ఇప్పటివరకు వంద మందికి కోవిడ్ లేదని నిర్ధారించినట్లు కేంద్రం తెలిపింది. ఒకరికి కోవిడ్ పాజిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది.

14 రోజుల నుంచి 28 రోజుల కాలం కీలకం...

కోవిడ్ వైరస్ సోకిన వ్యక్తిలో వాటి లక్షణాలు బయటపడటానికి సాధారణంగా రెండ్రోజుల నుంచి 14 రోజుల వరకు పడుతుంది. మరికొందరిలో 28 రోజుల వరకు కూడా పడుతుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ తెలిపారు. కాబట్టి కోవిడ్ ఉన్న దేశాల నుంచి వచ్చి, లక్షణాలున్న వారిని 28 రోజులపాటు ఇంట్లోనే ఒంటరిగా ఐసోలేషన్‌లో ఉంచాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. ఇతరత్రా ఎలాంటి అనారోగ్యం లేకపోతే 14 రోజుల్లోనే కోవిడ్ బయటపడుతుందని, అనారోగ్యం ఉన్న వారి విషయంలో ఒక్కోసారి 28 రోజులు సమయం తీసుకుంటుందని వివరించారు. కాగా, హైదరాబాద్ విమానాశ్రయంలో గురువారం నాటికి 22,790 మంది ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ చేశారు. మొత్తంగా 215 మంది నుంచి కోవిడ్ నిర్ధారణ కోసం శాంపిళ్లను సేకరించారు. 169 మందికి నెగటివ్ అని తేలింది. ఒకరికి మాత్రమే పాజిటివ్ వచ్చినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తేల్చాయి. మిగిలిన వారి ఫలితాలు రావాల్సి ఉంది.

'సచివాలయం'పై తీర్పు వాయిదా

- భవనాల్ని కూల్చొద్దంటూ పలు 'పిల్స్'
- ముగిసిన ఇరుపక్షాల వాదనలు
- తీర్పు తర్వాత వెలువరిస్తామన్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయ భవనాలను కూల్చరాదంటూ దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలపై శుక్రవారం వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కనీసం 50 ఏళ్లపాటు వినియోగానికి యోగ్యంగా ఉన్న భవనాలను కూల్చేసి రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లు వెచ్చించి కొత్తగా భవనాలు నిర్మిస్తే ప్రజాధనం వృథా చేసినట్లేనంటూ కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి, రిటైర్డు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధి పద్మనాభరెడ్డి విడివిడిగా 'పిల్స్'దాఖలు చేశారు. కొత్తగా నిర్మించనున్న భవనాల అంచనా వ్యయం, భవనాల ప్లాన్‌లు, డిజైన్లు మొదలైన వాటిని మంత్రివర్గం ఆమోదించే వరకు ప్రస్తుత భవనాలను కూల్చరాదని హైకోర్టు గతంలోనే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ స్థాయికి తగినట్లుగా భవనాలు నిర్మించాలని మంత్రివర్గం తీసుకున్న విధాన నిర్ణయమని, విధాన నిర్ణయాలను ప్రజాహిత వ్యాజ్యాల పేరుతో అడ్డుకోవడానికి వీల్లేదని, విధాన నిర్ణయాలపై న్యాయ సమీక్ష చేసేందుకు రాజ్యాంగం వీలు కల్పించలేదని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదించారు. సర్దార్ పటేల్ విగ్రహాన్ని గుజరాత్‌లో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేస్తే ఎవరూ అడ్డుకోలేదని, తెలంగాణలో పాతబడిన సచివాలయం కూల్చి భావితరాలకు ఉపయోగపడేలా నిర్మిస్తామంటే పిల్స్ వేసి అడ్డుకోవడం తగదన్నారు. మంత్రివర్గం కొత్తగా సచివాలయ భవనాల నిర్మాణం చేయాలని తీర్మానం చేసే నాటికి ప్రభుత్వం వద్ద అరకొర సమాచారమే ఉందని, కచ్చితమైన సమాచారం లేకుండా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి చట్టబద్ధత ఉండదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తరపు న్యాయవాది బి. రచనారెడ్డి వాదించారు. ఇప్పుడు భవనాల్లో పది పదిహేను ఏళ్ల కింద నిర్మించినవి కూడా ఉన్నాయని చెప్పారు. భవనాల వినియోగ సామర్థ్యంతో సాంకేతికంగా ఎలాంటి నివేదికలు లేకుండానే మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పుడు కొత్తగా నిర్మాణాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక కమిటీలు, నిపుణుల కమిటీల నివేదికలు కంటితుడుపుగానే ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా సచివాలయ భవనాలు సరిపోవడం లేదనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జీవన్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ, మరమ్మతులు చేసి వినియోగించాల్సిన భవనాల్ని నేలమట్టం చేసి తిరిగి రూ. 400 కోట్ల నుంచి రూ. 500 కోట్ల ఖర్చుతో నిర్మాణం చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని చెప్పారు. ఎంపీ రేవంత్‌రెడ్డి, తరపున న్యాయవాది రజనీకాంత్, విశ్వేశ్వరరావు తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌లు వాదించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

పీజీ నీట్ రాష్ట్ర స్థాయి ర్యాంకుల విడుదల

- రాష్ట్రం నుంచి 4,933 మంది అర్హత
- టాప్-10 ర్యాంకుల్లో 8 మంది అమ్మాయిలే

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి పీజీ నీట్ ర్యాంకుల్లో టాప్-10లో 8 మంది అమ్మాయిలే ఉన్నారు. జాతీయ స్థాయిలో 49వ ర్యాంక్ పొందిన ఎన్.శ్రీనిధి అనే అమ్మాయి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించింది. నీట్ పీజీ 1,200 మార్కులకు నిర్వహించగా, శ్రీనిధికి 935 మార్కులొచ్చాయి. 921 మార్కులతో ఉప్పుల సుప్రియ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్, 915 మార్కులతో ఎస్.కవిత మూడో ర్యాంక్ సాధించారు. ఇవి ప్రాథమిక ర్యాంకులేనని, ఇందులో నుంచి ఎవరైనా నేషనల్ కోటాలో సీటు తీసుకుంటే స్టేట్ లెవల్ ర్యాంకులు మారతాయని అధికారులు వెల్లడించారు. మొత్తంగా తెలంగాణ నుంచి 8,649 మంది నీట్ పరీక్ష రాయగా, 4,933 మంది అర్హత సాధించారు. ఈ నెల రెండు లేదా మూడో వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు కాళోజీ వర్సిటీ అధికారులు తెలిపారు.

టాప్ టెన్ ర్యాంకర్ల వివరాలు

రాష్ట్ర ర్యాంక్/విద్యార్థి పేరు	మార్కులు	నేషనల్ లెవల్ ర్యాంక్
1. ఎన్.శ్రీనిధి	935	49
2. సుప్రియ	921	96
3. ఎస్.కవిత	915	124
4. ఎస్.ఎస్.అక్షర	915	126
5. టి.సి.నాగసాయి	912	140
6. లక్ష్మీప్రసన్న	900	208
7. సాయి సుబ్రహ్మణ్యం	898	218
8. వి.నవ్య	897	237
9. నాయిని అభిలాష్	894	264
10. పి.భార్గవి	892	274

ఏప్రిల్ 29 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ఏప్రిల్ 29 నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. డిగ్రీ 3వ సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు, రెండో సంవత్సరం పరీక్షలు మే 6 నుంచి 11 వరకు, మొదటి సంవత్సరం వారికి మే 13 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. విద్యార్థులు వర్సిటీ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఫీజును టీఎస్, ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా చెల్లించాలని సూచించాయి. ఈ నెల 29 రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ అని చెప్పాయి.

టిక్‌టాక్‌తో ఒత్తిడి చిత్తు!

- పరీక్షల సమయంలో ఒత్తిడిని దూరం చేసే వీడియోలు
- టిక్‌టాక్ సాయంతో 'సేవ్ ది చిల్డ్రన్' ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థుల్లో టెన్షన్.. టెన్షన్.. సరిగ్గా చదవకపోవడం, తల్లిదండ్రుల ఒత్తిడి, క్లాస్‌మేట్స్‌తో పోటీ.. ఇలా ఒత్తిడికి కారణాలు బోలెడు! అనుకున్న మార్కులు రాకపోతే అఘాయిత్యాలకు పాల్పడేది కూడా ఒత్తిడి వల్లే.. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం 2014-2016 మధ్యకాలంలో దేశం మొత్తం మీద 26 వేల మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే.. వీరిలో పరీక్షల్లో ఫెయిలైన కారణంగా తనువు చాలించిన వారు 7,462 మంది. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. పరీక్షల చుట్టూ ఉన్న ఒత్తిడిపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు 'సేవ్ ది చిల్డ్రన్'స్వచ్ఛంద సంస్థ ఓ వినూత్నమైన ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. వీడియో అప్లికేషన్ 'టిక్‌టాక్'ఈ ప్రయత్నానికి తనవంతు సాయం అందిస్తోంది.

వీడియోల రూపంలో చిట్కాలు..

పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. వీటి గురించి తెలిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. సేవ్ ది చిల్డ్రన్, టిక్‌టాక్‌లు ఇదే పనిచేస్తున్నాయి. '#BeatTheStress' కార్యక్రమం కింద సేవ్ ది చిల్డ్రన్ కార్యకర్తలు ఒత్తిడిని జయించే చిట్కాలను వీడియోల రూపంలో అందిస్తారు. పరీక్షకు ఎలా సిద్ధమవ్వాలి? ఏ రకమైన ఆహారం తీసుకోవాలి? వంటి అనేక అంశాలపై టిక్‌టాక్ ద్వారా వీడియో సందేశాలు అందిస్తారు. ఉదాహరణకు సమాధానాలు బాగా వచ్చిన ప్రశ్నలకు ముందు సమాధానాలు రాయడం. తద్వారా ప్రశ్నపత్రాలు దిద్దే వారిలో ఆ విద్యార్థిపై సానుకూల దృక్పథం ఏర్పడుతుందని, తద్వారా మంచి మార్కులు సాధించొచ్చని ఓ నిపుణుడు చెప్పడం ఒక వీడియోలో ఉంటే.. మరో వీడియోలో పరీక్షలు ముఖ్యమే గానీ.. జీవితం అంతకంటే ఎక్కువ విలువైందన్న సందేశం కూడా ఉంటుంది. చిన్నచిన్న పాటలు, గేయాలు, సరదా సన్నివేశాలు, యానిమేషన్లు, జీఐఎఫ్‌లన్నింటినీ వాడుతూ విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉంచేందుకు బీట్ ది స్ట్రెస్ కార్యక్రమం ద్వారా ప్రయత్నిస్తున్నట్లు టిక్‌టాక్ ఫర్ గుడ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ సుబి చతుర్వేది తెలిపారు. చదువును ఒక వేడుకగా చేసేందుకు, తద్వారా విద్యార్థుల విపరీత ఆలోచనలను నివారించేందుకే తాము ఈ ప్రయత్నం చేస్తున్నామని సేవ్ ది చిల్డ్రన్‌కు చెందిన జ్యోతి నాలే తెలిపారు.

27,473 మంది గైర్హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ప్రథమ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు 27,473 మంది (5.39 శాతం) విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు రాసేందుకు 5,08,930 మంది రిజిస్టర్ చేసుకోగా 4,81,457 మంది పరీక్షకు హాజరయ్యారు.

జేఈఈ మెయిన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఈ నెల 12 వరకు పొడిగించిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్‌లో నిర్వహించనున్న రెండో దఫా జేఈఈ మెయిన్-2020 దరఖాస్తుల గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. గత నెల 7న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగిసిన నేపథ్యంలో తాజాగా ఈ నెల 12 వరకు పొడిగించింది. అభ్యర్థులు 12న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని, అదే రోజు రాత్రి 11:50 గంటల వరకు ఫీజు చెల్లించవచ్చని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో (గత జనవరి జేఈఈకి దరఖాస్తు చేసుకున్న వారు కూడా) పొరపాట్లు ఉంటే అదనపు ఫీజు చెల్లించి పరీక్ష కేంద్రాల చాయిస్ మినహా మిగతా అంశాలు సవరించుకునేలా చర్యలు చేపట్టింది. ముందస్తు షెడ్యూలు ప్రకారం ఈ నెల 8 నుంచి 12 వరకు పొరపాట్ల సవరణకు చర్యలు చేపట్టినా, ఆ షెడ్యూలులో మార్పు చేసింది. తాజా షెడ్యూలు ప్రకారం అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 16న రాత్రి 11:50 గంటల వరకు పొరపాట్లను సవరించుకోవచ్చని పేర్కొంది. నిబంధనల మేరకు వికలాంగులకు స్క్రైబ్ (సహాయకుడు) ఉన్నా లేకున్నా పరీక్ష రాసేందుకు అదనంగా గంట సమయం ఇవ్వనున్నట్లు తెలిపింది. అయితే వారు తమ వైకల్యానికి సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన చీఫ్ మెడికల్ ఆఫీసర్/సివిల్ సర్జన్/మెడికల్ సూపరింటెండెంట్ నుంచి నిర్దేశిత సర్టిఫికెట్ అందజేయాలని పేర్కొంది. సర్టిఫికెట్ నమూనాను జేఈఈ మెయిన్ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు తెలిపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.